WWW.ninadam.co.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

గురువారం, జనవరి 2, 2025 | సంపుటి - 21 | సంచిక 106 | వెల - 7 | పేజీలు -12 + 8

Published from Hyderabad and Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Anantapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

## నేటి నుంచి టీజీ టెట్`2024 పరీక్ష



**హైదరాబాద్, నినాదం:**

టీజీ టెట్ 2024 అర్హత పరీక్షలను ఈ నెల 2వ తేదీ నుంచి 20 వరకు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలను కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహించనున్నారు. టెట్ పరీక్షలకు 2.75 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. టెట్ హాల్ టికెట్లు 2024. అనే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. ▸▸తరువాయి2లో



# మేడ్చల్, శామీర్‌పేటలకు మెట్రో రైలు

## నగర వాసులకు సీఎం రేవంత్ గుడ్‌న్యూస్

- 3 నెలల్లో డిపిఆర్ సిద్ధం చేయాలని ఎన్వీరెడ్డికి ఆదేశం
- నగర ప్రజలకు తీరనున్న ట్రాఫిక్ కష్టాలు

రాష్ట్ర ప్రభుత్వం నగర వాసులకు తీపి కబురు చెప్పింది. మెట్రో రైలు పొడిగింపులో కీలక అడుగు వేసింది. హైదరాబాద్ ఉత్తర భాగం నగరవాసుల మెట్రో రైల్ కల నెరవేరబోతోంది. హైదరాబాద్ నార్త్ సిటీ వాసులకు నూతన సంవత్సర కానుకగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్యారడైజ్- మేడ్చల్ (23 కిలోమీటర్లు), జేబీఎస్-శామీర్‌పేట్ (22 కిలో మీటర్లు) మెట్రో కారిడార్ల డీపీఆర్‌ల తయారీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

**హైదరాబాద్,జనవరి1(నినాదం):**

వెంటనే డీపీఆర్‌లను సిద్ధం చేసి మెట్రో రైల్ ఫేజ్–2 'బి'లో భాగంగా కేంద్ర ప్రభుత్వ అనుమతికి పంపించాలని హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డిని సీఎం ఆదేశించారు. పుర పాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డితో ఈ రెండు కారిడార్ల డీపీఆర్ తయారీ విషయంపై చర్చించి ఈ మేరకు సీఎం కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్యారడైజ్ మెట్రో స్టేషన్ నుంచి తాడ్‌బండ్, బోయిన్‌పల్లి, సుచిత్ర సర్కిల్, కొంపల్లి, గుండ్లపోచంపల్లి, కండ్లకోయ, ఆర్ఆర్ఆర్ ఎగ్జిట్ మీదుగా మేడ్చల్ వరకు దాదాపు 23 కిలోమీటర్ల కారిడార్ ఉంటుంది. జేబీఎస్ మెట్రో స్టేషన్ నుంచి విక్రమ్‌పురి, కార్ఖానా, తిరుమలగిరి, లోతుకుంట, ఆల్వాల్, బొల్లారం, హకీంపేట్, తూముకుంట, ఓఆర్ఆర్ ఎగ్జిట్ మీదుగా శామీర్‌పేట్‌కు

## ఆస్ట్రేలియా పర్యటనకు సిఎం

- 13న ఉన్నతస్థాయి బృందంతో వెళ్లనున్న సిఎం
- క్రీడా విశ్వవిద్యాలయ ఏర్పాటుపై పరిశీలన

**హైదరాబాద్, నినాదం:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 13వ తేదీన ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనున్నారు. రాష్ట్రంలో క్రీడావిశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే ఆస్ట్రేలియాలోని క్వీన్‌ల్యాండ్ విశ్వవిద్యాలయాన్ని ఆయన పరిశీలించనున్నారు. సిఎంతో పాటు ప్రభుత్వ సలహాదారుడు జితేందర్ రెడ్డి, సిఎస్ శాంతికుమారి, ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రటరీ జయేశ్ రంజన్, స్పోర్ట్ ఎండి సోనీ బాల, స్పోర్ట్ చైర్మన్ శివసేనా రెడ్డి వెళ్లనున్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఈనెల 13న రాత్రి ఆస్ట్రేలియా బయలుదేరి వెళతారు. 14, 15, 16, 17 నాలుగు రోజుల పాటు సిఎం బృందం పర్యటించనుంది.



## సంధ్య థియేటర్ ఘటనలో వివరణ ఇవ్వండి

### డీజీపీకి జాతీయ మానవ హక్కుల కమిషన్ నోటీసులు

**హైదరాబాద్, నినాదం:**

సంధ్య థియేటర్ ఘటనలో వివరణ ఇవ్వాలని తెలంగాణ డీజీపీ, హైదరాబాద్ సీపీకి జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) నోటీసులు జారీ చేసింది. డిసెంబరు 4న పుష్ప–2 ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనకు సంబంధించి న్యాయవాది రామారావు.. ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు చేశారు.



## అణుస్థావరాల జాబితా పరస్పర మార్పు

### ఒప్పందాన్ని మరో ఏడాది పొడిగించిన భారత్, పాక్

**న్యూఢిల్లీ, నినాదం:**

భారత్, పాకిస్థాన్ తమ దేశాల్లోని అణుస్థావరాల జాబితాను పరస్పరం మార్పిడి చేసుకున్నాయి. మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయాన్ని ఈ ఏడాది కూడా పాటించాయి. ఈ విషయాన్ని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఒకరి దేశంలోని అణు కేంద్రాలపై మరో దేశం దాడి చేయకూడదనే ద్వైపాక్షిక ఒప్పందంలో భాగంగా ఈ జాబితాను అందజేసుకున్నాయి. ఇరుదేశాలు ఏకకాలంలో ఈ ప్రక్రియ పూర్తి చేసినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. '

2

## ఆదానీతో విద్యుత్ ఒప్పందం రద్దు

2

### తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం




## తల్లి, నలుగురు చెల్లెళ్లను చంపిండు..

- గాఢ నిద్రలో ఉన్న వాళ్లను హత్యమార్చిన యువకుడు
- లక్నోలో దారుణం




**లక్నో, నినాదం:**

ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో దారుణం జరిగింది. ఓ హోటల్‌లో తన తల్లితో పాటు నలుగురు చెల్లెళ్లను హత్య చేశాడు ఓ యువకుడు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సెంట్రల్ లక్నో డిప్యూటీ కమిషనర్ రవీణ త్యాగి తెలిపిన వివరాల ప్రకారం.. రాజధాని లక్నోలోని శరణ్‌జిత్ హోటల్‌లో ఓ యువకుడు తన తల్లి, నలుగురు చెల్లెళ్లతో దిగాడు. తల్లి, చెల్లెళ్లు గాఢ నిద్రలోకి జారుకున్న తర్వాత సోదరుడు అత్యంత దారుణంగా హతమార్చాడు.హోటల్ సిబ్బంది సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు.

## వ్యక్తిని బలిగొన్న భూ తగాదాలు

### సూర్యపేట జిల్లాలో విషాదం

**సూర్యాపేట, నినాదం:**

సూర్యాపేట జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. భూతగాదాలు ఓనిండు ప్రాణాన్ని బలితీసుకున్నాయి. నూతన సంవత్సర వేడుకలకు పిలిచి ఓ వ్యక్తిని దారుణంగా హతమార్చారు. ఈ విషాదకర సంఘటన చివ్వెంల మండలం లక్ష్మి తండాలో చోటు చేసుకుంది. తండాకు చెందిన ధరావత్ శేషు(39)కు అదే తండాకు చెందిన తన ప్రత్యర్థులతో కొంత కాలంగా భూ వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో శేషు ప్రత్యర్థులు న్యూఇయర్ వేడుకలకు పిలిచి కత్తితో గొంతు కోసి దారుణంగా హతమార్చారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



## ఫార్ములా ఈ కేసు లొట్టపీసు కేసు

### ఏదో రకంగా జైలుకు పంపాలని చూస్తున్నారు

### మీడియా సమావేశంలో కెటిఆర్ వ్యాఖ్యలు

### పార్టీ నేతలు, అభిమానుల న్యూ ఇయర్ శుభాకాంక్షలు

ఏసీబీ కేసులో అస్సలు పస లేదని..తనకు న్యాయస్థానాల పై నమ్మకం ఉందన్నారు. ఫార్ములా ఈ కేసు లొట్టపీసు కేసు అంటూ వ్యాఖ్యలు చేశారు. 'పాపం.. నన్ను ఏదో రకంగా జైలుకు పంపాలని ప్రభుత్వం చూస్తోంది. నాపై ఇది ఆరో ప్రయత్నం.. రేవంత్‌కు ఏమీ దొరకటం లేదు' అంటూ కేటీఆర్ సెటైర్ విసిరారు.

**హైదరాబాద్,జనవరి1(నినాదం):**

కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేయటానికి బీఆర్ఎస్ కార్యకర్తలు పని చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. కొత్త సంవత్సరంలో బీఆర్ఎస్ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పార్టీ కార్యాలయంలో పార్టీ అభిమానులు కెటిఆర్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఫార్ములా ఈ రేసు కేసుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. బుధవారం మీడియాతో కేటీఆర్ మాట్లాడుతూ.. ఫార్ములా ఈరేస్ కేసులో తెలంగాణ హైకోర్టులో ఏ తీర్పు వస్తుందో చూద్దామన్నారు. ఇందులో అవినీతే లేనప్పుడు.. కేసు ఎక్కడది అని ప్రశ్నించారు. ఏసీబీ ఎఫ్ఐఆర్ తప్పు అని వ్యాఖ్యలు చేశారు.

## మహారాష్ట్రలో మావోలకు ఎదురుదెబ్బ

### సిఎం ఫడ్నవీస్ ఎదుట 11మంది మావోల లొంగుబాటు

మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట 11 మంది మావోయిస్టులు లొంగిపోయారు. బుధవారం గడ్చిరోలి జిల్లాలో సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సమీక్షంలో ఈ మావోయిస్టులు లొంగిపోయారు.





## డీఏపీ ఎరువుల బస్తా రూ.1,350

### రూ.3,850 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ పొడిగింపు

- రైతులకు కేంద్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్
- ఫసల్ భీమా యోజన పథకం పొడిగింపు
- కేటాయింపులను రూ.69,515 కోట్లకు పెంపు
- కేంద్ర కేబినేట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రి అశ్వినీ వైష్ణవ్

**న్యూఢిల్లీ,జనవరి1(నినాదం):**

దేశవ్యాప్తంగా రైతుల కోసం చేపట్టిన.. ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకాన్ని పొడిగించాలని కేంద్ర కేబినెట్ తీర్మానం చేసింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ బుధవారం న్యూఢిల్లీలో సమావేశమైంది. ఈ భేటీలో కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆవన్నీ రైతుల సంక్షేమం కోసమే కేంద్ర కేబినెట్ ఈ నిర్ణయాలు తీసుకుంది. కేంద్ర క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పంటల బీమా పథకమైన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను మరింతగా మెరుగుపరచాలని నిర్ణయించారు. ఈ పథకం రైతుల జీవితాల్లో గణనీయమైన మార్పు తెచ్చిందన్న కేంద్రం.. కేటాయింపులను రూ.69,515 కోట్లకు పెంచుతూ ఆమోదం తెలిపింది.

## నేటి నుంచి టీజీ టెట్`2024 పరీక్ష

జనవరి 2వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పది రోజుల పాటు 20 సెషన్లలో పరీక్షలను నిర్వహించనున్నారు. ప్రతి రోజు రెండు సెషన్లు అంటే సెషన్ 1 ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు, సెషన్ –2 మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పేపర్–1 పరీక్షలను జనవరి 8, 9, 10, 18 తేదీల్లో నిర్వహించనున్నారు. పేపర్ –2 పరీక్షలను జనవరి 2, 5, 11, 12, 19, 20వ తేదీల్లో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం సెషన్‌కు హాజరయ్యే అభ్యర్థులను ఉదయం 7.30 నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. మధ్యాహ్నం సెషన్‌కు హాజరయ్యే వారిని మ. 12.30 గంటల నుంచి అనుమతించనున్నారు. ఇక పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందే పరీక్షా కేంద్రం గేట్లను క్లోజ్ చేయనున్నారు. అంటే ఉదయం సెషన్‌లో ఉ. 8.45కు, మధ్యాహ్నం సెషన్‌లో 1.45 గంటలకు గేట్లను మూసివేయనున్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్‌తో పాటు బ్లాక్ లేదా బ్లూ బాల్ పాయింట్ పెన్, గుర్తింపు కార్డు(ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్ పోర్ట్, పాన్ కార్డు, ఓటర్ ఐడీ) తీసుకెళ్లాలి. స్మార్ట్ వాచీలతో పాటు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు.

## ఆదానీతో విద్యుత్ ఒప్పందం రద్దు

చెన్నై, నినాదం:
అదానీ కంపెనీతో విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు తమిళనాడు ప్రభుత్వం బుధవారం వెల్లడిరచింది. సౌర విద్యుత్ కాంట్రాక్టులను దక్కించుకునేందుకు అదానీ భారీ కుంభకోణానికి పాల్పడ్డారని ఇటీవల అమెరికా పత్రిక ఫైనాన్షియల్ టైమ్స్ వెల్లడిరచిన సంగతి తెలిసిందే. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ (ఎఇఎస్ఎల్)తో స్మార్ట్ మీటర్ల సేకరణ కోసం తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ ( టిఎఎన్‌జిఇడిసిఒ) చేసుకున్న ఒప్పందాన్ని స్టాలిన్ ప్రభుత్వం రద్దు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అధిక ధరలను కోట్ చేశారని, అందుకే ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు ఆ వర్గాలు వెల్లడిరచాయి.కేంద్ర ప్రభుత్వ పథకం కింద 2023 ఆగస్టులో నాలుగు ప్యాకేజీలుగా టెండర్లు జరిగాయి. చెన్నై సహా ఎనిమిది జిల్లాలను కవర్ చేసే టెండర్‌లో ప్యాకేజీ 1కి కి అదానీ సంస్థ 82 లక్షలకు పైగా స్మార్ట్ మీటర్లను పంపిణీ చేసేందుకు ఒప్పందం కుదిరినట్లు ఆ వర్గాలు తెలిపాయి. అదానీ సంస్థ కోట్ చేసిన ధర అధికంగా ఉన్నందున డిసెంబర్ 27, 2024న టెండర్‌ను రద్దు చేసినట్లు వెల్లడిరచాయి. మరో మూడు ప్యాకేజీల టెండర్లను కూడా రద్దు చేశామని తెలిపింది. మరోసారి టెండర్లను ఆహ్వానించే అవకాశం ఉందని పేర్కొన్నాయి.2020–2024 మధ్య లాభదాయకమైన సౌర విద్యుత్ కాంట్రాక్టులను దక్కించుకోవడం కోసం అదానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తులకు రూ.2029 కోట్ల ముడుపులు ముట్టజెప్పడం లేదా ఇస్తానని వాగ్దానం చేయడం వంటి చేశారని అమెరికా న్యాయశాఖ అక్కడి కోర్టుకు తెలియజేసింది. సెకీతో విద్యుత్ సరఫరా ఒప్పందాలు కుదుర్చుకునేలా ఆ వ్యక్తులు పలు రాష్ట్రాల విద్యుత్ పంపిణీ కంపెనీలను ఒప్పించారు. ఆ విధంగా కొన్ని రాష్ట్ర విద్యుత్ కంపెనీలు సెకీతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. 2021 జులై, 2022 ఫిబ్రవరి మధ్య కాలంలో ఒరిస్సా, జమ్ము కాశ్మీర్, తమిళనాడు, చత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విద్యుత్ పంపిణీ కంపెనీలతో ఒప్పందాలు జరిగాయి. ఇందుకు సంబంధించి 54 పేజీల నేరాభియోగ పత్రాన్ని న్యాయవాదులు కోర్టులో దాఖలు చేసినట్లు అమెరికా పత్రిక ఫైనాన్సియల్ టైమ్స్ వెల్లడిరచిన సంగతి తెలిసిందే. ఆ అభియోగ పత్రంలోని వివరాలను ప్రముఖ అమెరికన్ పత్రిక ఫైనాన్షియల్ టైమ్స్ వెల్లడిరచడంతో ఈ భాగోతం బయటపడిరది. నేరాభియోగ పత్రంలో కేటగిరీల వారీగా, వ్యక్తుల వారీగా ఎవరికి ఎంతెంత ముడుపులు ముట్టజెప్పడం లేదా హామీ ఇవ్వడమో చేశారని స్పష్టంగా పేర్కొనడం జరిగింది. గౌతమ్ అదానీ మేనల్లుడు సాగర్ అదానీని కూడా ఫెడరల్ ప్రాసిక్యూటర్లు ప్రతివాదుల జాబితాలో చేర్చారు.

## తల్లి, నలుగురు చెల్లెళ్లను చంపిండు..

మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతులను ఆలియా(9), అల్షియా(19), అక్ష(16), రహమీన్(18), తల్లి ఆస్మాగా పోలీసులు గుర్తించారు. నిందితుడు ఆర్షద్(24) ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. కుటుంబ కలహాల కారణంగానే ఆర్షద్ తన కుటుంబ సభ్యులను హతమార్చినట్లు పోలీసుల విచారణలో తేలింది. వీరంతా ఆగ్రాకు చెందిన వారని పోలీసులు పేర్కొన్నారు.

## మేడ్చల్, శామీర్ పేటలకు మెట్రో రైలు

22 కిలోమీటర్ల మేర ఈ కారిడార్ విస్తరించి ఉంటుందని మెట్రో ఎండీ.. సీఎంకు వివరించారు. మల్కాజిగిరి ఎంపీగా ఉన్నప్పుడు ఈ ప్రాంతం ట్రాఫిక్ సమస్యలపై, ఈ కారిడార్ల రూట్ మ్యాప్‌లపై తనకు మంచి అవగాహన ఉందని సీఎం ప్రస్తావించారు. రూట్ మ్యాప్ విషయంలో ప్రస్తుత మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు కూడా వివరించి ఆయన సూచనలు, సలహాలు తీసుకోవాలని మెట్రో ఎండీని సీఎం ఆదేశించారు. డీపీఆర్ తయారీని 3 నెలల్లో పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తీసుకోవాలని సీఎం సూచించినట్టు మెట్రో ఎండీ తెలిపారు. మెట్రో ఫేజ్–2 'ఏ' భాగం మాదిరిగానే 'బి' భాగాన్ని కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్ ప్రాజెక్టుగా రూపొందించాలని సీఎం ఆదేశించినట్టు చెప్పారు. ఈ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం అనుమతి కోసం పంపించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని.. ఈ మేరకు వెంటనే డీపీఆర్, ఇతర అనుబంధ డాక్యుమెంట్ల తయారీ చేపడుతున్నట్టు మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వివరించారు.

## ఆస్ట్రేలియా పర్యటనకు సిఎం

అక్కడ క్వీన్‌ల్యాండ్ విశ్వవిద్యాలయాన్ని ఈ బృందం పరిశీలించనుంది. తిరిగి ఈనెల 18వ తేదీన సింగపూర్‌కు ముఖ్యమంత్రి బృందం అక్కడ షాపింగ్ మాల్‌ను, క్రీడా ప్రాంగణాల నిర్మాణాలను పరిశీలించనుంది. అదే విధంగా సింగపూర్‌లో జరుగనున్న పారిశ్రామికవేత్తల సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పాల్గొంటారు. అనంతరం 19వ తేదీన సింగపూర్ నుంచి స్విట్జర్లాండ్‌లోని దావోస్ వెళ్లి అక్కడ 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు పర్యటించనుంది. దావోస్‌లో 20 నుంచి 24వ తేదీ వరకు 5 రోజుల పాటు 'ప్రపంచ ఆర్థిక వేదిక' 55వ వార్షిక సదస్సు జరగుతుంది. సిఎంతో పాటు ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ఇతర ఉన్నతాధికారులు మూడు రోజులు ఈ సదస్సులో పాల్గొననున్నారు. 2024లో దావోస్ పర్యటన సందర్భంగా సుమారు రూ.40 వేల కోట్లకు పైగా పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలను రాష్ట్ర ప్రభుత్వం వేర్వేరు కంపెనీలతో ఒప్పందం చేసుకుంది. ప్రస్తుత పర్యటనలోనూ మరిన్ని పెట్టుబడుల ను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసింది. ఈ సదస్సులో 50కి పైగా దేశాల నుంచి ప్రభుత్వ, పారిశ్రామిక ప్రతినిధులు పాల్గొంటారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అవకాశాలున్న రంగాలను చాటిచెప్పడం ద్వారా విదేశీ పెట్టుబడులు ఆకర్షించేందుకు దావోస్ సమావేశాల్లో 'తెలంగాణ పెవిలియన్' పేరుతో ప్రత్యేక పెట్టుబడుల సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు.

## అణుస్థావరాల జాబితా పరస్పర మార్పు

దౌత్యమార్గాల ద్వారా భారత్, పాకిస్థాన్ తమ అణు స్థావరాల జాబితాను పంచుకున్నాయి. ఏకకాలంలో ఈ ప్రక్రియ పూర్తయ్యింది. కశ్మీర్ సమస్యతో పాటు సీమాంతర ఉగ్రవాదంపై కూడా రెండు దేశాల మధ్య జాబితా మార్పిడి జరిగింది. ఈ జాబితాను ఇలా ఇచ్చిపుచ్చుకోవడం ఇది వరుసగా 34వ సారి' ఓ ప్రకటనలో పేర్కొంది. కాగా.. అణు స్థావరాలపై దాడులకు వ్యతిరేకంగా కుదిరిన ఒప్పందం ప్రకారం ఇరు దేశాలు ఈ వివరాలను పరస్పరం అందజేసుకుంటున్నాయి. 1988 డిసెంబర్ 31న ఈ ఒప్పందంపై భారత్, పాక్ సంతకం చేశాయి. ఆర్టికల్–2 నిబంధన ప్రకారం ప్రతి సంవత్సరం అణు స్థావరాల సమాచారం అందజేసుకోవాలి. దీని ప్రకారం 1992 జనవరి 1 నుంచి ప్రతి సంవత్సరం అదే రోజు అణు సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకుంటున్నాయి.

## సంధ్య థియేటర్ ఘటనలో వివరణ ఇవ్వండి



ప్రీమియర్ షోకి అల్లు అర్జున్ రావడం, పోలీసులు లాఠీఛార్జ్ చేయడం వల్లే తొక్కిసలాట జరిగి రేవతి మృతి చెందిందని, బాలుడికి తీవ్ర గాయాలయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన కమిషన్ సంధ్య థియేటర్ ఘటనపై సీనియర్ ర్యాంక్ పోలీసు అధికారితో విచారణ జరిపించి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఘటనపై నాలుగు వారాల్లో నివేదిక ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొంది.

# డీఏపీ ఎరువుల బస్తా రూ.1,350

మొదటిపేజీ తరువాయి

దీంతో రైతుల పంటలకు మరింత రక్షణ లభించడంతో పాటు నష్టాల పట్ల ఆందోళన తగ్గనుంది. అలాగే, 50 కిలోల డీఏపీ ఎరువుల బస్తాను రూ.1,350 చొప్పున రైతులకు అందజేసేందుకు రూ.3,850 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని పొడిగిస్తున్నట్లు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడిరచారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో నిర్వహించిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. 2025లో తొలి క్యాబినెట్ భేటీని ప్రధాని నరేంద్ర మోదీ రైతులకు అంకితం చేశారన్న అశ్వినీ వైష్ణవ్.. రైతుల సంక్షేమం గురించి ఈ భేటీలో చర్చ జరిగిందన్నారు. రెండు పంటల బీమా పథకాలను కేంద్రం 2025–26 వరకు పొడిగించినట్లు తెలిపారు. వీటిని 15వ ఆర్థిక సంఘం కాలానికనుగుణంగా పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకాలకు 2020–21 నుంచి 2024–25 ఆర్థిక సంవత్సరం వరకు రూ.66,550 కోట్లు కేటాయించగా.. దాన్ని 2021–22 నుంచి 2025–26 ఆర్థిక సంవత్సరాలకు గాను రూ.69,515.71 కోట్లకు పెంచారు. ఈ పంటల బీమా పథకాల అమలులో సాంకేతికతను వినియోగించేందుకు రూ.824.77 కోట్ల కార్పస్‌తో ప్రత్యేక నిధి ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. ఈ టెక్నాలజీ వినియోగంతో పంట నష్టం అంచనాలను త్వరగా తెలుసుకోవడంతో పాటు క్లెయిమ్ సెటిల్‌మెంట్, వివాదాలను తగ్గించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. క్యాబినెట్ నిర్ణయాలపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేస్తూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. 'రైతుల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉన్న ప్రభుత్వం మాది. దేశానికి అన్నం పెట్టేందుకు శ్రమించే మన రైతులు గర్వకారణం. 2025 మొదటి క్యాబినెట్ భేటీని రైతుల శ్రేయస్సు కోసం అంకితం చేశాం. వారి విషయంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నందుకు ఆనందంగా ఉంది' అని పేర్కొన్నారు. కొత్త సంవత్సరం ప్రారంభమైన తొలి రోజు భేటీ అయిన.. ఈ తొలి కేబినెట్‌ను రైతులకు అంకితం ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించిందని చెప్పారు. ఇక ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద దేశవ్యాప్తంగా నాలుగు కోట్ల మంది రైతులు లబ్ది పొందుతున్నారని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. డీఏపీ ఎరువులపై అదనపు భారాన్ని భరించాలని కేంద్రం నిర్ణయించిందని సోదాహరణగా ఆయన వివరించారు. 2014లో ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టారు. నాటి నుంచి గతేడాది వరకు.. అంటే 2024 చివరి వరకు.. ఎరువుల సబ్సిడీ కింద రూ. 11.9 లక్షల కోట్లను కేంద్రం ఖర్చు చేసింది. అదే విధంగా 2024లో ముచ్చటగా మూడోసారి కేంద్రంలో మోదీ ప్రభుత్వం కొలువు తీరింది. ఆ క్రమంలో రైతుల కోసం రూ. 6 లక్షల కోట్ల విలువైన 23 కీలక నిర్ణయాలను కేంద్రం తీసుకుంది.

**ఎరువుపై మరింత సబ్సిడీ**

ఇకపై ఒక 50 కిలోల డీఏపీ బస్తా రూ.1350 కే లభ్యం కానుంది.



కేంద్రం తాజాగా తీసుకున్న ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా 4 కోట్ల మంది రైతులకు లబ్ధి చూకూరనుంది. అదేవిధంగా 'ఫండ్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ'కి కేంద్రం రూ.800 కోట్ల నిధిని ఏర్పాటు చేసింది. అంతేగాక పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పథకం కింద అందించే మొత్తాన్ని రూ.6 వేల నుంచి రూ.10 వేలకు పెంచాలని నిర్ణయించింది. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న పలు ముఖ్యమైన ప్రాజెక్టులపై ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిపాదనలపై కూడా ఈ సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది. నిరుద్యోగులకు ప్రత్యేక శిక్షణ అందించేందుకు ఓ ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేయాలని కూడా సమావేశంలో నిర్ణయించినట్లు తెలిసింది.

## ఇంటివాడు కాబోతున్న యువ ఎంపి తేజ్వి

బెంగళూరు : దేశంలోనే అత్యంత పిన్న వయస్సు ఎంపీలలో ఒకరిగా గుర్తింపు పొందిన తేజస్వి సూర్య ఓ ఇంటివారు కాబోతున్నారు. బెంగళూరు దక్షిణ లోక్‌సభ నియోజకవర్గం నుంచి రెండోసారి గెలిచిన ఆయన చెన్నైకు చెందిన ప్రముఖ గాయని, శాస్త్రీయ సంగీతం, భరతనాట్య కళాకారిణి అయిన శివశ్రీ స్కంద ప్రసాద్‌ను వివాహం చేసుకోనున్నారు. ఈ విషయాన్ని బెంగళూరులో ఆయన స్వయంగా ప్రకటించారు. మార్చి 24న ముహూర్తం నిర్ణయించినట్లు వెల్లడిరచారు. శివశ్రీ.. మద్రాస్ విశ్వవిద్యాలయం నుంచి భరతనాట్యంలో ఎంఏ, మద్రాస్ సంస్కృత కళాశాలలో సంస్కృతంలో ఎంఏ పూర్తి చేశారు.

## మన్మోహన్ స్మారక స్థలం ఎంపికపై కసరత్తు

**ప్రక్రియను ప్రారంభించిన కేంద్రం**

న్యూఢిల్లీ :
మాజీ ప్రధాని దివంగత మన్మోహన్ సింగ్ స్మారక చిహ్నం నిర్మించే ప్రక్రియను కేంద్రం ప్రారంభించింది. రాజ్‌ఘాట్, రాష్ట్రీయ స్మృతి స్థల్‌తో పాటు కిసాన్ ఘాట్ సమీపంలో 1 నుంచి 1.5 ఎకరాల స్థలంలో స్మారక చిహ్నం కోసం ప్రతిపాదించినట్టు సమాచారం. పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అధికారులు ఈ ప్రాంతాలను ఇప్పటికే పరిశీలించారు. ఈ రెండు స్థలాల్లో ఒక స్థలాన్ని ఎంచుకోవాలని మన్మోహన్ సింగ్ కుటుంబ సభ్యులకు అధికారులు సూచించినట్టు తెలుస్తోంది. కొత్త విధానం ప్రకారం, మెమోరియల్ కోసం స్థలాన్ని ట్రస్టుకు మాత్రమే కేటాయించాల్సి ఉంటుంది. ఆ కారణంగా ప్రాజెక్టు ప్రారంభించడానికి ముందు ట్రస్టు ఏర్పాటు కావాలి. ట్రస్టు ఏర్పాటయిన వెంటనే భూమి కేటాయింపు కోసం దరఖాస్తు చేసుకోవాలి. నిర్మాణం కోసం సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌తో ఎంఓయూపై సంతకం చేయాలి. మన్మోహన్ సింగ్ స్మారక చిహ్నం జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, సంజయ్ గాంధీ స్మారకాలు ఉన్న రాజ్‌ఘాట్‌కి సమీపంలో ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది.

## కొంపల్లిలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

పలు రెస్టారెంట్లలో అపరిశుభ్ర వాతావారణం గుర్తింపు

హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలోని కొంపల్లిలో వివిధ రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు జరుపగా, కొన్ని రెస్టారెంట్లు ఫుడ్ సేఫ్టీ నిబంధనలను పాటించడం లేదని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఉలవచారు, మల్నాడు కిచెన్, ట్రైన్ థీమ్ రెస్టారెంట్ లలో తనిఖీలు నిర్వహించారు అధికారులు. ఫుడ్ సేఫ్టీ అధికారులు, ఈ రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహించిన తర్వాత నిబంధనలను పూర్తిగా అనుసరించడం లేదని అధికారులు తెలిపారు. కిచెన్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో పాటు, కొన్ని రెస్టారెంట్లలో కంట్రోల్డ్ ఫుడ్ పద్ధతులు పాటించడం లేదని తెలిపారు. రేట్లతో సహా, ఈ రెస్టారెంట్లలో నాన్ వెజ్ ఐటమ్స్‌లో సింథటిక్ ఫుడ్ కలర్స్ కలిపినట్లు అధికారుల గుర్తించారు. ఇది ఆహార పదార్థాలకు హానికరం కలిగిస్తాయని తెలిపారు.

## మహరాష్ట్రలో మావోలకు ఎదురుదెబ్బ



ముంబయి, నినాదం:
మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట 11 మంది మావోయిస్టులు లొంగిపోయారు. బుధవారం గడ్చిరోలి జిల్లాలో సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సమీక్షంలో ఈ మావోయిస్టులు లొంగిపోయారు. అయితే లొంగిపోయిన వారిలో.. తార్కా సిడం సైతం ఉన్నారు. గడ్చిరోలిలో గతంలో మావోయిస్టుల ప్రాబల్యం అధికంగా ఉండేదని.. అలాంటి ప్రాంతంలో పోలీసులు అవుట్ పోస్ట్ ఏర్పాటు చేశారన్నారు. అలాగే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతోందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గడ్చిరోలి ప్రాంతాన్ని చత్తీస్‌గఢ్‌తో అనుసంధానం చేస్తూ.. రహదారిని అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. అలాగే మొబైల్ టవర్లు సైతం నిర్మిస్తున్నారని గుర్తు చేశారు. ఇక మహారాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు.. ఇటీవల నాగపూర్‌లో ముగిశాయి. ఈ సమావేశాల్లో సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ.. గత ఏడాది 33 మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో మరణించారని చెప్పారు. ఇక గడ్చిరోలి జిల్లా ఉత్తర భాగం పూర్తిగా మావోయిస్టు రహిత ప్రాంతంగా మారిందని వివరించారు. అలాగే 55 మంది మావోయిస్టులను అరెస్ట్ చేయగా.. 33 మంది లొంగిపోయారని తెలిపారు. మావోయిస్టులపై తమ ప్రభుత్వం పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఇక వామపక్ష తీవ్రవాదాన్ని అణిచివేసేందుకు మూడేళ్ల కాలపరిమి విధించుకున్నామని ఈ సందర్భంగా సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ గుర్తు చేశారు. మరోవైపు గడ్చిరోలి ప్రాంతానికి చెందిన వందలాది యువత పోలీస్ శాఖలో చేరారన్నారు. వారిలో 33 మంది యువకులు మావోయిస్టులు బాధితులు ఉన్నారని వివరించారు. ఇక మావోయిస్టుల అగ్రనేతలు సైతం లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారన్నారు. 2026, మార్చి మాసాంతం నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకొంది. అందుకోసం తనదైన శైలిలో ముందుకు వెళ్తుంది. ఇప్పటికే దేశంలోని చాలా రాష్ట్రాల్లో మావోయిస్టుల ప్రభావం భాగా తగ్గిపోయింది. ఇంకా సోదాహరణగా చెప్పాలంటే.. తెలుగు రాష్ట్రాలు, జార్ఖండ్, బిహార్, ఉత్తర ప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో వారి ప్రాబల్యం దాదాపుగా తుడిచి పెట్టుకుపోయింది. ఇక ఛత్తీస్‌గఢ్‌లో మాత్రం వారి ప్రాబల్యం కొంత స్పష్టంగా కనిపిస్తోంది. దీంతో ఆ రాష్ట్రంలో సైతం భద్రత దళాలు, స్థానిక పోలీసుల సహాయంలో కూబింగ్ తీవ్రతరం చేసింది.అందులోభాగంగా పలు ఎన్‌కౌంటర్లు సైతం చోటు చేసుకున్నాయి. ఎన్‌కౌంటర్లలో దాదాపు 27 మంది అగ్రనేతలు మరణించిన విషయం విధితమే. ఇక దేశంలో మావోయిస్టుల నిర్మూలన కోసం .. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ.. కీలక సూచనలు చేస్తున్నారు.

# ఫార్ములా ఈ కేసు లొట్టపీసు కేసు



ఈకేసులో ఈడీ ఎదుట ఈనెల 7న హాజరుపై తన లాయర్లు నిర్ణయిస్తారని తెలిపారు. రూ. 600 కోట్ల సంగతి అటుంచితే.. ఒక్క పైసా కూడా అవినీతి లేదన్నారు.జడ్జి అడిగే ప్రశ్నలకు ఏజీ దగ్గర సమాధానం లేదన్నారు. రేసు కావాలని తాను నిర్ణయం తీసుకున్నాని.. వద్దనేది రేవంత్ నిర్ణయమన్నారు. ఇద్దరి నిర్ణయాలపై క్యాబినెట్‌లో చర్చ జరగలేదన్నారు. ' నాపై కేసు పెడితే.. రేవంత్‌పై కూడా కేసు పెట్టాలి. రేవంత్ రెడ్డి.. ఒక ముఖ్యమంత్రినా?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్‌కు ఎదురయ్యే చిన్న, చిన్న అడ్డంకులను అధిగమించి లక్ష్యాన్ని సాధించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రం, దేశ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కేటీఆర్ అన్నారు. బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం ఏప్రిల్ 27న భారీ బహిరంగ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏడాది మెదటి హాఫ్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు. తర్వాత గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి కమిటీలు పూర్తి చేస్తామన్నారు. పార్టీ అధ్యక్షుడి ఎన్నికకు.. వచ్చే అక్టోబర్ వరకు సమయముందని తెలిపారు. పార్టీ నేతలకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చూపిస్తామని స్పష్టం చేశారు. రైతుబరోసాతో రేవంత్ సర్కార్‌పై ప్రజల్లో తిరుగుబాటు రాబోతోందన్నారు. రైతుభరోసా కొందరకికే ఇచ్చే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. రైతులకు సెల్ఫ్ డిక్లరేషన్ ఎందుకు అని ప్రశ్నించారు. బ్యాంకులను ముంచేటోళ్ళకే సెల్ఫ్ డిక్లరేషన్ లేదన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజిస్ట్రేషన్లు ఇవ్వాలని రేవంత్‌కు లేదని విమర్శించారు. 42 శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వమే కోర్టులో కేసులు వేయిస్తోందన్నారు. ఉద్యోగస్తులు, పాన్ కార్డ్ ఉన్నవాళ్ళకు రైతుభరోసా ఎగ్గొట్టే ప్రయత్నం జరుగుతోందని కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫార్ములా ఈరేస్ కేసుకు సంబంధించి కేటీఆర్ వేసిన క్వాష్ పిటిషన్‌పై తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసిన విషయం తెలిసిందే. ఆ తీర్పు వెలువడే వరకు కేటీఆర్‌ను అరెస్ట్ చేయవద్దని హైకోర్టు స్పష్టం చేసింది. ఫార్ములా ఈ రేసు కేసుకు సంబంధించి ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ మాజీ మంత్రి కేటీఆర్.. హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. నిన్న (డిసెంబర్ 31) విచారణ జరిపిన హైకోర్టు.. తీర్పును రిజర్వ్ చేసింది. మరోవైపు ఈకేసు సంబంధించి హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్‌ఎన్ రెడ్డి రేపు (జనవరి 2) ఈడీ ముందుకు విచారణకు హాజరు కానున్నారు. అలాగే జనవరి 3 ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ హాజరవుతారు. వీరిద్దరి విచారణ మీద ఈనెల 7 కేటీఆర్ ఈడీ విచారణకు హాజరుకావాలా వద్దే అనేదానిపై నిర్ణయానికి వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## చరిత్రలో కేసీఆర్ నిలిచిపోతారు

**ఎవరి వల్ల కానిది కేవలం కేసీఆర్ వల్లే సాధ్యమైంది**
**మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రం బాగు : మాజీ మంత్రి కేటీఆర్**

చరిత్రలో కేసీఆర్ ఎప్పటికీ నిలిచిపోతారని, ఎవరి వల్ల కానిది కేసీఆర్ వల్లే సాధ్యం అయిందని అది అందరికీ తెలుసునని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమ రథసారథి కేసీఆర్.. చావునోట్లో తలపెట్టి తెలంగాణ సాధించిన నాయకుడు అని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. ఆంగ్ల నూతన సంవత్సరం మొదటి రోజున తెలంగాణ భవన్‌కు విచ్చేసి బీఆర్‌ఎస్ నాయకత్వం మొత్తం ఇక్కడ కొలువుదీరి బీఆర్‌ఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించుకోవడం సంతోషంగా ఉంది. మనందరం మనస్ఫూర్తిగా కాంక్షిస్తున్నది ఒక్కటే.. చావునోట్లో తలపెట్టి తెలంగాణ సాధించిన నాయకుడు కేసీఆర్ తిరిగి రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలనే ఒకే ఒక్క కోరితో గట్టిగా పని చేస్తున్నాం. కేసీఆర్ నాయకత్వంలో మన పార్టీ మరిన్ని విజయాలు నమోదు చేయాలని, ప్రజల ఆశీస్సులు పూర్తిస్థాయిలో తిరిగి పొందాలని, మనకు ఎదురయ్యే అడ్డంకులు ఎదుర్కొనే శక్తి ఆ భగవంతుడు మీకు ప్రసాదించాలని, మీ కుటుంబాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. కులమతాలకు అతీతంగా, ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ దేశం, రాష్ట్రం ఎల్లవేళలా ప్రశాతంగా ఉండాలని మనస్ఫూర్తిగా కాంక్షిస్తున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా కేటీఆర్‌కు గులాబీ శ్రేణులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ చేత కేటీఆర్ కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలిలో ప్రతిపక్ష నేత ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎంపీ సురేశ్ రెడ్డి, మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, మల్లారెడ్డి, మహమూద్ అలీ, ఎర్రబెల్లి దయాకర్ రావుతోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

## ఆర్జీ -2 ఏరియాలో 81 శాతం బొగ్గు ఉత్పత్తి

### ఏరియా జిఎం బి.వెంకటయ్య




**8ఇంక్లైన్ కాలనీ, జనవరి 1, నినాదం న్యూస్:** ఆర్జీ 2 ఏరియా సంభందించిన ఉత్పత్తి, ఉత్పాదకత ఓవర్ బర్డన్ వెలికితీత మరియు రవాణా వివరాలను తెలియ జేస్తూ ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య మీడియా ప్రతినిధు లతో సమావేశం నిర్వహించారు. ముందుగా మీడియా సోదరులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి, డిసెంబర్ మాసానికి సంబంధించి నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలలో 10,81,600 టన్నులకు గాను 8,74, 749 టన్నులు (81%) మరియు ఓబీ వెలికితీతలో 62,00,000 క్యుబిక్ మీటర్లగాను 52,16,029 క్యూబిక్ మీటర్లతో 84 % ఓవర్ బర్డన్ వెలికి తీయడం జరిగిందని తెలిపారు. అలాగే ఈ నెలలో ఓసిపి-3 సిహెచ్ పి నుండి 7,16,030 టన్నుల బొగ్గును రవాణా చేయడం జరిగిందని ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరములో 66,49,600 టన్నులకు గాను 63,36,826 టన్నులు (95%) బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించడం జరిగిందని, రాబోయే మూడు నెలలలో వంద శాతం ఉత్పత్తి సాధించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య అన్నారు. అలాగే ఏరియాలో ఉద్యోగుల మరియు పరిసర గ్రామాలకు చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను తెలిపారు. ఈ సమావేశంలో ఏరియా ఇంజినీర్ నరసింహారావ్, ఎస్ఓ టు జిఎం ఏ.రాముడు, వకీల్ పల్లి ప్రాజెక్ట్ అధికారి ఏ,నెహ్రూ, డిజిఎం (పర్సనల్) అధికార ప్రతినిధి ఎస్.అనిల్ కుమార్, డీజీఎం వర్క్ షాప్ ఎర్రన్న, డిజిఎం (ఐఈ) మురళీకృష్ణ, మెడికల్ సూపరింటెండెంట్ డా.. మహిపాల్, డీజీఎం ఫైనాన్స్ వెంకట రామ చంద్ర, సీనియర్ సెక్యూరిటి అధికారి షరీఫ్ మహమ్మద్, ఇఇ సివిల్ వినయ్ సాగర్ మరియు మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## అండర్ ట్రయిల్ ఖైదీలలో పరివర్తన రావాలి

- క్షణికావేశంతో చేసిన తప్పులకు కుటుంబాలు బలౌతున్నాయి
- ఖైదీల మానసిక ఉల్లాసానికి కలర్ టి.వి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**కోదాడ/ హుజూర్నగర్, జనవరి 1 (నినాదం న్యూస్):** అండర్ ట్రయిల్ ఖైదీలలో మానసిక పరివర్తన ఆవశ్యకత ఎంతైనా ఉంద ని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. క్షణికావేశంతో చేసిన తప్పులతో వారి వారి కుటుంబాలు బలౌతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నూతన సంవత్సర వేడుకల్ని పురస్కరించుకుని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వినూత్న ప్రక్రియకు తెర లేపారు.ఎటువంటి హంగులు, ఆర్భాటాలు లేకుండా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించేందుకు రూట్ మ్యాప్ రూపొందించి అమలు పరచడం తో పాటు నూతన సంవత్సర వేడుకలు సమజాభివృద్ధికి దోహద పడేలా ఉండాలన్న సందేశాన్ని ఈ సంవత్సరం ప్రారం భంరోజున ఆయన పంపారు. నూతన సంవత్సర వేడుకల్ని పురస్కరించుకుని బుధవారం ఉదయం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తాను ప్రాతి నిధ్యం వహిస్తున్న హుజుర్నగర్ నియోజకవర్గ కేంద్రంలోని జైల్ను సందర్శించారు. అక్కడ ఆయన అండర్ ట్రయిల్ ఖైదీలతో కలసి సహపంక్తి అల్పాహారం తీసుకున్నారు. అనంతరం వారి వారి జీవిత విశేషాలను తెలుసుకుంటూనే వారిలో పరివర్తనకు తీసుకు రావాల్సిన మార్పులపై వారికి ఉద్బో ధించారు చిన్న చిన్న తప్పులకు కుటుంబాలకు దూరమై ఒంటరి జీవితం అనుభవిస్తున్న తీరును విశ్లేషించారు.అటువంటి సంఘట నలు పునరావృతం





కాకుండా చూసుకోవడంతో పాటు మీరు అనుభవించిన, అనుభ విస్తున్న దుర్భర పరిస్థితులు సమాజానికి తెలియజేయాల న్నారు తద్వారా మీతో సమాజంలో ఒక మార్పు తీసుకు రావొచ్చని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హితవు పలికారు

**సబ్ జైల్కు కలర్ టి.వి...** ఇదిలా ఉండగా తమతో కొత్త సంవత్సరం ప్రారంభం రోజున జైలును సందర్శించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఖైదీలు తమ సాధక బాధకాలను చెప్పుకున్నారు. మాకు ఆహ్లాదాన్ని అందించడం కోసం కలర్ టి.వి కావాలని వారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని అభ్యర్థించారు. అడిగిందే తడవుగా తాను వ్యక్తిగతంగా సబ్ జైలుకు టి.వి అందిస్తానని హామీ ఇచ్చారు.

**మంచి ప్రవర్తన కల్గిన ఖైదీలకు బేయిల్ వచ్చేలా చూస్తాను....**
జైలులో ఖైదీల వాస్తవ పరిస్థితులు తెలుసుకు నేందుకు నూతన సంవత్సరం రోజున రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా ఎస్పి సన్ ప్రీత్ సింగ్తో కలిసి హుజూర్ నగర్ సబ్ జైలుని సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మంచి ప్రవర్తన కల్గిన ఖైదీలకుమానవతా దృక్పథంతో బేయిల్ వచ్చే విధంగా చూడాలని జిల్లా ఎస్పి సన్ ప్రీత్ సింగ్కి సూచించారు..ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి నాగేశ్వరావు, డిఎస్పి శ్రీధర్ రెడ్డి, జైలు సూపరి టిడెంట్ మంగ్త నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

यूनियन बैंक Union Bank of India

**అస్సెట్ రికవరీ బ్రాంచ్**
నెం. 249/3ఆర్టీ, 1వ అంతస్తు, మెయిన్ రోడ్, ఎస్.ఆర్. నగర్, హైదరాబాద్- 500038, తెలంగాణ. మెయిల్ ఐడి: ubin0556009@unionbankofindia.bank

**అమ్మకం గురించి తెలియజేస్తూ, ఋణగ్రహీతకు నోటీసు (30 రోజుల నోటీసు)**
**సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్మెంట్) రూల్స్ 2002 సందలి రూల్ 6(2)/ 8(6)**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద బ్యాంక్కు రావల్సిన బకాయిలను రాబట్టుకొనుటకు ఆస్తుల అమ్మకం.
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 లోని సెక్షన్ 13(2) క్రింద **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచ్, హైదరాబాద్** సెక్యూర్డ్ క్రెడిటార్ వారు డిమాండ్ నోటీసు జారీచేసి, నిర్దిష్ట కాలవ్యవధిలోగా బకాయిలను చెల్లించమని మిమ్మల్ని కోరడమైనది. మీరు నిర్దిష్ట కాలవ్యవధిలోగా సదరు నోటీసును పాటించడంలో విఫలమైనందున, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్మెంట్) రూల్స్ 2002లోని రూల్ 6/8తో చదవబడుతూ చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద స్థిర సెక్యూర్డ్ ఆస్తులను అధీకృత అధికారి స్వాధీనం చేసుకున్నారు.
సెక్యూర్డ్ ఆస్తులను స్వాధీనం చేసుకున్న తర్వాత కూడా బ్యాంక్కు చెందిన బకాయిలు చెల్లించుటలో మీరు విఫలమైనారు. కావున ఆన్లైన్ విధానం ద్వారా ఈ నోటీసు స్వీకరణ తేదీ నుండి 30 రోజుల తర్వాత బహిరంగ ఇ-వేలం నిర్వహించుట ద్వారా క్రింద తెలిపిన ఆస్తులను అమ్ముటకు తప్పనిసరి అయినది. సర్వీస్ ప్రొవైడర్ వివరములు మరియు ఆస్తుల యొక్క రిజర్వు ధరతోపాటు ఇ-వేలం తేదీ మరియు సమయములను, ఇ-వేలం నిర్వహించుట గురించి మీకు విడిగా తెలియజేయబడును.
ఒకవేళ అమ్మకం నోటీసు ప్రచురణ తేదీ కంటే ముందుగా బ్యాంక్కు చెందిన బకాయి మొత్తము మరియు తదుపరి వడ్డీ, వ్యయాలు, చార్జీలు మరియు బ్యాంక్చే వెచ్చించిన వ్యయములతో మీరు చెల్లించినచో, ఆస్తి అమ్మకం కొరకు ఎటువంటి తదుపరి చర్యలను చేపట్టరు మరియు సదరు చట్టంలోని సెక్షన్ 13(8) క్రింద నిర్దిష్ట గడువులోగా మీ ఆస్తులను విడిపించుకొనుటకు గల లభ్యతను పొందగలరు.

**(1) దరఖాస్తుదారు/ ఋణగ్రహీత/ తనఖాదారు పేరు: 1) శ్రీమతి కొర్తివాడ మణికంఠ తండ్రి కె శివకుమార్, 2) శ్రీమతి కొర్తివాడ అనసూయ భర్త కె శివకుమార్, ఇరువురి నివాసం: చిరునామా నెం. 1: ఇం.నెం. 4-4-32, సుభాష్ రోడ్ సిద్దిపేట మండలం, మెదక్ రోడ్, సిద్దిపేట్ 502103, చిరునామా నం. 2: ఫ్లాట్ నంబర్ 403, ఎస్వి రాఘవేంద్ర నిలయం, సర్వే నెం 1541, శివాజీ నగర్, సిద్దిపేట, తెలంగాణ, 502103.**
**డిమాండ్ నోటీసులు తేదీ: 12-04-2024** — **స్వాధీనత నోటీసు తేదీ: 14-10-2024**

**ఆస్తి షెడ్యూల్**
ఎస్ఆర్ఓ సిద్దిపేట్ అర్బన్ వద్ద సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 2738/2018, సంగారెడ్డి వద్ద జిల్లా రిజిస్ట్రార్ సిద్దిపేట్, సబ్ రిజిస్ట్రార్ సిద్దిపేట్ అర్బన్, సిద్దిపేట్ జిల్లా, ప్రస్తుతం సిద్దిపేట్ మున్సిపాలిటీ, పాత జి.పి. ప్రశాంతి నగర్ వద్ద ఉన్న సర్వే నెం. 1541, ఫ్లాట్ నెం. 57, 58, 59లలోని మొత్తం 781.66 చ.గ.ల విస్తీర్ణము గల భూమిలో 27.91 చ.గ.ల విస్తీర్ణము గల భూమి అవిభాజ్య వాటాతో మొత్తం 885.00 చ.అ.లతో పాటు మందపాటి గోడలు మరియు దామాషా కామన్ ఏరియా బాల్కనీలతో కలుపుకొని ఎస్.వి.రాఘవేంద్ర నిలయంలోని 4వ అంతస్తులో ఇం.నెం. 18-18-22/3× తో పూర్తి అయిన ఫ్లాట్ నెం. 403 యావదాస్తి. సరిహద్దులు: ఫ్లాట్ సరిహద్దులు: ఉత్తరం: ఖాళీ ప్రదేశం, దక్షిణం: ఫ్లాట్ నెం.402, తూర్పు: కారిడార్, పడమర: ఖాళీ ప్రదేశం. భూమి సరిహద్దులు: ఉత్తరం: పొరుగువారి ఆస్తి, దక్షిణం: పొరుగువారి ఆస్తి, తూర్పు: నాలా, పడమర: రోడ్.

**(2) దరఖాస్తుదారు / ఋణగ్రహీత / తనఖాదారు వ్యక్తి పేరు: శ్రీ చామల భాస్కర్ రెడ్డి తండ్రి సి. వెంకట రెడ్డి, సహ-దరఖాస్తుదారు: శ్రీమతి చామల స్వప్న భర్త భాస్కర్ రెడ్డి, ఇరువురి నివాసం: చిరునామా నం. 1: ఫ్లాట్ నెం. .303, ఫ్లాట్ నెం. 66, సుజాత రెసిడెన్సీ, పి & టి కాలనీ, మేడిపల్లి, ఘట్కేసర్ జిల్లా- మేడ్చల్ మల్కాజ్గిరి-500098, తెలంగాణ, చిరునామా నం. 2: ఫ్లాట్ నెం. 1, మెరుగు సత్తయ్య లేఅవుట్, రిజిస్ట్రేషన్ ఆఫీస్ రోడ్, ఇందిరమ్మ కాలనీ, లింగారెడ్డిపల్లి గ్రామం, సిద్దిపేట్, జిల్లా. సిద్దిపేట-502 103.**
**డిమాండ్ నోటీసులు తేదీ: 09-06-2023** — **స్వాధీనత నోటీసు తేదీ: 27-09-2023**

**ఆస్తి షెడ్యూల్**
ఎస్ఆర్ఓ సిద్దిపేట్ యొక్క సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 6957/2016 ద్వారా కవర్ చేయబడి ఉంది తెలంగాణ, సిద్దిపేట్ జిల్లా, సిద్దిపేట్, లింగారెడ్డిపల్లి గ్రామంలో ఉన్న మొత్తం 171 చదరపు గజాల విస్తీర్ణముతో ఫ్లాట్ నెం.1, సర్వే నెంబర్ 562/A, 562/AA1 వద్ద ఉన్న ఆర్సిసి రూఫ్ జి+2 నివాస గృహం. సరిహద్దులు: ఉత్తరం: ఫ్లాట్ నెం.2, దక్షిణం: 33 అడుగుల రోడ్డు, తూర్పు: ఫ్లాట్ నెం. 16, పడమర: పొడిశెట్టి సత్తయ్య యొక్క ఖాళీ ప్రదేశం & 33 అడుగుల రోడ్డు.

**(3) దరఖాస్తుదారు/ఋణగ్రహీత/తనఖాదారు పేరు: శ్రీమతి మురంశెట్టి శైలజ భర్త శ్రీ మురంశెట్టి ఆంజనేయులు, సహ-దరఖాస్తుదారు/హామీదారు: శ్రీ మురంశెట్టి ఆంజనేయులు తండ్రి శ్రీ మురంశెట్టి నాగలింగం, ఇరువురి నివాసం: ఫ్లాట్ నెం 301, 3వ అంతస్తు, "సుప్రజ ఎన్క్లేవ్ అపార్ట్మెంట్" ప్రశాంత్ నగర్, సిద్దిపేట్, జిల్లా. సిద్దిపేట్, తెలంగాణ-502103.**
**డిమాండ్ నోటీసులు తేదీ: 12-04-2024** — **స్వాధీనత నోటీసు తేదీ: 01-10-2024**

**ఆస్తి షెడ్యూల్**
శ్రీమతి మురంశెట్టి శైలజ భర్త మురంశెట్టి ఆంజనేయులుకి చెంది ఉండి తెలంగాణ, సిద్దిపేట్ జిల్లా మరియు మండలం, సిద్దిపేట్ మున్సిపాలిటీ, మహాశక్తి నగర్, ఓల్డ్ జి పి ప్రశాంత్ నగర్ వద్ద ఉన్న సర్వే నెం.1308లోని మున్సిపల్ ఇం.నెం. 18-19-36/19 గల ఆవరణములో 600 చ.గ.లలోని 28.00 చ.గ.ల విస్తీర్ణము గల భూమి అవిభాజ్య వాటా & కామన్ ఏరియాతో కలుపుకొని 1345 చ.అ.ల కట్టుబడి ప్రదేశము కలిగిన "సుప్రజ ఎన్క్లేవ్" భవనములోని 3వ అంతస్తులో ఫ్లాట్ నెం 301 గల రెసిడెన్షియల్ ఫ్లాట్ యావదాస్తి. భూమి సరిహద్దులు: ఉత్తరం: పొరుగువారి భూమి, దక్షిణం: 18' వెడల్పు రోడ్డు, తూర్పు: 18' వెడల్పు రోడ్డు, పడమర: 18' వెడల్పు రోడ్డు. భూమి సరిహద్దులు: ఉత్తరం: ఖాళీ ప్రదేశం, దక్షిణం: ఖాళీ ప్రదేశం, తూర్పు: ఖాళీ ప్రదేశం, పడమర: కారిడార్ & ఫ్లాట్ నం. 302.

**(4) ఋణగ్రహీత సహిత హామీదారు పేరు: శ్రీ పూడెం శేఖర్ రెడ్డి తండ్రి రాజి రెడ్డి, ఇం.నెం. 5-31, సర్వన్నపేట్ గ్రామం, జగదేవ్పూర్ మండలం, చేబర్తి, సిద్దిపేట్ జిల్లా, 502279 ఫోన్ నెం.: 9949379729. హామీదారు: మదుగారి రజనీకాంత్, తండ్రి మదుగారి లక్ష్మణ్ రావు, ఇం.నెం 1-115, అనంతరావుపల్లి, గజ్వేల్ మండలం, సిద్దిపేట్-502278.**
**డిమాండ్ నోటీసులు తేదీ: 14-11-2023** — **స్వాధీనత నోటీసు తేదీ: 31-01-2024**

**ఆస్తి షెడ్యూల్**
శ్రీ పూడెం శేఖర్ రెడ్డి తండ్రి రాజి రెడ్డికి చెంది ఉండి సిద్దిపేట్ జిల్లా- 502279, మర్కూక్ మండలం, చేబర్తి గ్రామం, సర్వే నెం. 231/ఏ2/1లోని 16,758.50 చదరపు గజాల విస్తీర్ణముతో వ్యవసాయేతర భూమి యావదాస్తి. సరిహద్దులు: ఉత్తరం: పూడెం శ్రీనివాస్ రెడ్డి భూమి, దక్షిణం: భూకల కిష్టయ్య భూమి, తూర్పు: రోడ్డు, పడమర: భూకాల పర్వతాల భూమి.

**(5) ఋణగ్రహీత పేరు: సంహిత స్టీల్స్ ప్రతినిధిగా ప్రొప్రైటర్ వంగరి వెంకటేశ్వర్లు, 10-28-187/1 శ్రీ చక్రి విద్యా నికేతన్ దగ్గర, నాగార్జున నగర్ కాలనీ కుషాయిగూడ హైదరాబాద్ 500062, హామీదారు: శ్రీ జి. విజయ్ శ్రీనాథ్, ఇంటి నెం. 1-9-112/1/ఏ, సౌత్ కమలా నగర్, ఇసిఐఎల్ పోస్ట్ హైదరాబాద్ 500062, ప్రొప్రైటర్: వంగరి వెంకటేశ్వర్లు, 10-28-187/1 శ్రీ చక్రి విద్యా నికేతన్ దగ్గర, నాగార్జున నగర్ కాలనీ కుషాయిగూడ హైదరాబాద్ 500062, హామీదారు సహిత తనఖాదారు: శ్రీమతి వంగరి నవనీత, 1-10-28/199/22/8 & 9, శుభోదయ కాలనీ కాప్రా సర్కిల్, హైదరాబాద్.**
**డిమాండ్ నోటీసులు తేదీ: 22-05-2024** — **స్వాధీనత నోటీసు తేదీ: 16-08-2024**

**ఆస్తి షెడ్యూల్**
శ్రీమతి వంగరి నవనీతకు చెంది ఉండి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, ఇసిఐఎల్, జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్, సుభోదయ కాలనీ వద్ద ఉన్న 400 చదరపు గజాల ఫ్లాట్ నెం. 8 మరియు 9లో ఇం.నెం. 1-10-28/199/22/8 & 9లో భూమి మరియు భవనం యొక్క ఇఎండి. సరిహద్దులు: ఉత్తరం: పరమేశ్వర్ రెడ్డి ఇల్లు, దక్షిణం: లక్ష్మణ్ ఇల్లు, తూర్పు: విజయ ఇల్లు, పడమర: రోడ్డు.

తేదీ: 01.01.2025, ప్రదేశం: హైదరాబాద్ — సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

# ధరణికి చరమగీతం...

# భూ భారతికి స్వాగతం

**కోదాడ, జనవరి 1(నినాదం న్యూస్):**

- తీరనున్న సాదా బైనామాల సమస్యలు
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేల సంఖ్యలో దరఖాస్తుల పెండింగ్...
- ఏళ్ల తరబడి ఎదురుచూపులు...
- పకడ్బందీగా అమలుకు ప్రభుత్వం చర్యలు

*భూ సమస్యలతో రైతులు అనేక అవస్థలు పడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక భూముల సమస్య లకు పరిష్కారం చూపుతామని అప్పటి ప్రభుత్వం చెప్పి భూ సర్వే చేపట్టింది. అంతేనా.. అన్ని సమస్యలకు ధరణి ఓ చక్కని పరిష్కారమని చెప్పింది. కానీ.. ధరణి వచ్చిన తర్వాత ఉన్న సమస్యలకు కొత్త సమస్యలు తోడయ్యాయి. దీంతో రైతుల పరిస్థితి పెనం నుండి పొయ్యిలో పడ్డట్టయింది. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ధరణిని బంగాళాఖాతంలో పడేస్తున్నామని, ఆర్వోఆర్ చట్టం తీసుకొస్తున్నామని అసెంబ్లీలో ప్రకటించింది. అన్నట్లే ఇటీవల అసెంబ్లీలో భూ భారతి పేరిట ఆర్వోఆర్-2024 చట్టాన్ని ఆమోదించింది.*

**భూభారతి పై రైతుల ఆశలు...**
రైతులు ధరణి దరిద్రం పోయిందని, భూభారతి తమకు హారతి పడుతుందని రైతులు సంబరపడుతున్నారు. అయితే కొత్త ఆర్ఓఆర్ చట్టం రైతులకు చుట్టంలా మారి.. ప్రతి సమస్యకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది. ఏ సమస్యా పరిష్కారం కాలేదనడానికి లేకుండా.. ప్రతి రైతు భూమికి పక్కా హక్కులు కల్పించినప్పుడే ధరణి దరిద్రం పోయినట్లని రైతులు భావిస్తున్నారు.

**ధరణితో చిక్కులే ఎక్కువ...**
ప్రత్యేక తెలంగాణ ఏర్పాటయ్యాక ఏర్పడిన బీఆర్ఎస్ ప్రభుత్వం.. రాష్ట్రంలో భూముల వివరాలు పక్కాగా ఉండాలని, ప్రతి రైతు భూమిని ఆన్లైన్లో పొందుపర్చాలని, ప్రతి రైతు భూమికి హక్కులు కల్పిస్తామని చెప్పింది. దీంతో రైతులంతా సంబరపడ్డారు. అదే సమయంలో భూ సర్వే పేరిట ప్రతి మండలం, ప్రతి గ్రామంలో సర్వే చేశారు. పరిష్కారానికి నోచని, అపరిష్కృతంగా ఉన్న భూములకూ పట్టాలు కల్పిస్తారని రైతులు ఎంతో సంతోషించారు. కానీ పరిస్థితిలో ఏ మార్పు కనిపించలేదు. గతంలో ఉన్న పట్టా పాసుపుస్తకాల ఆధారంగానే కొత్త పాసు పుస్తకాలు జారీ చేశారు. అసంఖ్యాక సమస్యలకు ఏకైక పరిష్కారం ధరణి అని గొప్పలు చెప్పారు. మ్యూటేషన్లతో పాటు వెంటనే రిజిస్ట్రేషన్లు చేయొచ్చని ప్రభుత్వం చెప్పింది. కానీ రాతపూర్వక రికార్డులంటూ ఏమీ లేకుండాపోయాయి. అంతా ఆన్లైన్ చేయడంతో కనీసం పేరు మార్పు, ఇతర వివరాలకు కూడా రైతులు నోచుకోలేకపోయారు. ఆన్లైన్లో సమాచారం ఉన్నవాడిదే భూమి అన్నట్లు తయారైంది. కాస్తుకాలం లేకపోవడంతో కాస్తులో ఉన్న వారు ఫలాలు అందుకోలేకపోయారు. అసలు కాస్తు చేసే రైతునే పట్టించుకోలేదు. పైగా గతంలో పరిష్కారంలో ఉన్న భూములనే ఆన్లైన్ చేశారే తప్ప.. సమస్యల పరిష్కారానికి మార్గం చూపించలేదు. భూ సర్వేలో వెలుగు చూసిన సమస్యలకు పరిష్కారం లభిస్తుందని భావించినా.. ఆశలు అడియాసలయ్యాయి.

**పెండింగ్లో వేల దరఖాస్తులు..**
సూర్యాపేట జిల్లాలో 8,564 దరఖాస్తులు పెండింగ్లో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. సంవత్సరాల తరబడి దరఖాస్తుదారులు సమస్య పరిష్కారానికై ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం కూడా భూభారతితో సాదా బైనమాల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. కొంతమేరకు ఊపిరి పీల్చుకున్నారు. ముందుగా దరఖాస్తులను పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అనంతరము పరిష్కారం



చేయనున్నారు. 2020 సంవత్సరంలో గత ప్రభుత్వము ధరణి పోర్టల్ ను తీసుకొచ్చింది. అందులో అన్ని రకాల ఆప్షన్స్ లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా సాదా బైనామాలు కలిగిన రైతులు పడ్డ బాధలు వర్ణనాతీతం. గత ప్రభుత్వానికి అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఆశలు వదులుకున్నారు. భూభారతితో వారిలో ఆశలు చిగురిస్తున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేల సంఖ్యలో సాదా బైనమాల దరఖాస్తులు ఉన్న సంగతి సూర్యాపేట జిల్లాలో 8,564 దరఖాస్తులు, నల్లగొండ జిల్లాలో 13,080 దరఖాస్తులు, యాదాద్రి భువనగిరి జిల్లాలో 3,786 దరఖాస్తులు వచ్చాయి.

**వివాదాలకు ఆస్కారం లేకుండా..**
దరఖాస్తులన్నీ పెండింగ్లో గత ప్రభుత్వము శాసనసభ ఎన్నికలకు ముందు సాదా బైనామాల సమస్య పరిష్కారానికి దరఖాస్తులు స్వీకరించి విచారణ ప్రారంభించింది. ఈ లోపు ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో నిలిచిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం సాదా బైనామాల సమస్య భూభారతితో పరిష్కరించేందుకు కంకణం కట్టుకుంది.
ఆన్లైన్లో దరఖాస్తు చేసుకొని పెండింగ్ లో ఉన్న సాదా బై నామాలను క్రమబద్ధీకరణ చేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. సరైన విచారణతో రిజిస్ట్రేషన్ చేసిన వెంటనే మ్యుటేషన్ అప్పి లకు అవకాశం ఉంది. వివాదాలు డబుల్ రిజిస్ట్రేషన్లు లేకుండా చర్యలు తీసుకుంటు న్నారు. భూ రికార్డుల సవరణలో భాగంగా డిజిటల్ ల్యాండ్ రికార్డుల సవరణ పార్ట్ బి కేసులపై నిర్ణయానికి అవకాశం ఉంది. జిల్లాస్థాయిలో రెండంచుల అప్పిలు వ్యవస్థ ప్రత్యేక భూ పరిపాలన ట్రిబ్యునల్స్, పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం గ్రామానికి రెవెన్యూ అధికారి ప్రతి భూకమతానికి ప్రత్యేక సంఖ్య తో కూడిన భూధార్ అమలు చేయనున్నారు.భూభారతి చట్టం 2024 సాదా బైనామాల సమస్య పరిష్కారంతోపాటు ధరణితో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతుల సమస్యలు కూడా పరిష్కారం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి..

## ఆస్తుల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలి

### ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య - సెక్యూరిటీ సిబ్బందితో సమావేశము



**8ఇంక్లైన్ కాలనీ, ఆర్జీ2 ఏరియా, జనవరి 1, నినాదం న్యూస్:** ఆర్జీ 2 ఏరియా సెక్యూరిటి విభాగం డిస్ట్రిబ్యూషన్ పాయింట్ వద్ద ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య సెక్యూరిటి సిబ్బందితో సమావేశము నిర్వహించారు. ఈ సమావేశములో వారికి నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలియజేసి, విధినిర్వహణలో సెక్యూరిటి సిబ్బంది విధులు, క్రమశిక్షణ, ఆస్తుల పరిరక్షణ తదితర విషయాలపై మాట్లాడారు. సెక్యూరిటీ సిబ్బంది సింగరేణి ఆస్తుల పరిరక్షణలో అప్రమత్తతో వ్యవహరించాలని, క్రమశిక్షణ కలిగిన సెక్యూరిటి సిబ్బంది ఇతర ఉద్యోగులకు ఆదర్శవంతంగా ఉండాలని ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య అన్నారు. చెక్ పోస్ట్ ల వద్ద కోల్ ట్రాన్స్ పోర్ట్, సిఎస్పిల వద్ద, ఓపన్ కాస్ట్ గనుల వద్ద సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా లేకపోతే దాని యొక్క ప్రభావం ఉత్పత్తి, ఉత్పాదకత మరియు రవాణా పై పడే అవకాశం ఉంటుందని వారు అన్నారు. అలాగే విధులకు వచ్చే టప్పుడు ఇంటి వద్ద నుండి డ్యూటీ సమయానికంటే ముందుగానే బయలుదేరి విధులకు హాజరు కావాలని వారు అన్నారు. ఈ కార్యక్రమములో ఎస్ఓ టు జీఎం ఏ.రాముడు, డీజీఎం ఐఇ మురళీకృష్ణ, ఏరియా సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్, జమేదార్లు సంపత్ విజయ్ కుమార్, అబ్దుల్ మజ్జిద్, మరియు ఎస్ పిసి సెక్యూరిటీ సిబ్బంది, ప్రైవేట్ సెక్యూరిటి సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఆలయాలకు పోటెత్తిన భక్తులు



**హైదరాబాద్, (నినాదం న్యూస్) :** కొత్త సంవత్సరం వేడుకలు మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారు జాము వరకు కొనసాగాయి. చిన్నా, పెద్దా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్లో భాగస్వాములై .. కొత్త ఏడాదికి ఘనంగా స్వాగతం పలికారు. ఇక న్యూ ఇయర్ సంబురాలు ముగియడంతో.. బుధవారం ఉదయం నుంచి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. దేశ వ్యాప్తంగా ఉన్న ప్రధాన ఆలయాలకు భక్తులు తరలి వెళ్తున్నారు. నూతన సంవత్సరం రోజున తమ ఇష్ట దైవాన్ని దర్శించుకుని, అంతా శుభం జరగాలని భక్తులు కోరుకుంటున్నారు. ఇక భక్తుల తాకిడిని ముందే ఊహించిన ఆలయాల అధికారులు.. వారి రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. తెలంగాణలోని యాదాద్రి, భద్రాద్రి, వేములవాడ, జోగులాంబతో పాటు ఇతర ఆలయాలకు భక్తులు బారులు తీరారు. దర్శనానికి 3 గంటల సమయం పడుతోంది. హైదరాబాద్ నగరంలోని చిలుకూరు బాలజీ టెంపుల్, బిర్లా మందిర్, పెద్దమ్మ తల్లి ఆలయం, జూబ్లీహిల్స్, హిమాయత్ నగర్లోని టీటీడీ ఆలయాలు, పద్మారావు నగర్లోని స్కంధగిరి టెంపుల్కు భక్తులు పోటెత్తారు.

## 16 మంది టీచర్లపై వేటు



**హైదరాబాద్, (నినాదం న్యూస్) :** యాదాద్రి భువన గిరి జిల్లాలో దీర్ఘకాలికంగా విధులకు డుమ్మా కొడుతున్న 16 మంది టీచర్లపై వేటు పడింది. వారిని సర్వీస్ నుంచి తొలగిస్తూ విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని పలు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు పాఠశాలకు రాకుండానే అన్ని సదుపాయాలు పొందుతున్నారు. స్కూల్ అసిస్టెంట్ గీతారాణి, ఎస్జీటీలు విజయలక్ష్మీ, శ్రీనివాస్ రెడ్డి, ఉమారాణి, ప్రభాకర్ రెడ్డి, అబ్దుల్ హమీద్, స్వప్న, మాధవి, నవీన్ కుమార్, ఎం.ఉమాదేవి, క్రాంతి కిరణ్, జె.ఉమాదేవి, నర్సింహారావు, శ్కెలజ, భాగ్యలక్ష్మీ, కిరణ్కుమారి 2005 నుంచి 2022 వరకు అనధికారికంగా విధులకు గైర్హాజరయ్యారు. ఈ విషయం విద్యాశాఖ దృష్టికి వెళ్లడంతో.. దీర్ఘకాలికంగా విధులకు గైర్హాజరవ్వడంపై వివరణ ఇవ్వాలని సదరు ఉపాధ్యాయులను నోటీసులు ఇచ్చింది. అయినప్పటికీ స్పందించలేదు. దీంతో విద్యాశాఖ అధికారులు గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చి 16 మంది ఉపాధ్యాయులను సర్వీసు నుంచి తొలగించారు. ఈ విషయాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా డీఈవో సత్యనారాయణ తెలిపారు. యాదాద్రి జిల్లాలో 16 మంది ప్రభుత్వ టీచర్లను విధుల్లో నుంచి తొలగించారు. వీరు దీర్ఘకాలికంగా విధులకు గైర్హాజరు కావడంతో డీఈవో ఇటీవల నోటీసులి చ్చారు. అయినప్పటికీ స్పందించకపోవడంతో సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## గాయని శివశ్రీని పెళ్లాడనున్న ఎంపీ తేజస్వి సూర్య





బెంగళూరు: దేశంలోనే అత్యంత పిన్న వయస్సు ఎంపీలలో ఒకరిగా గుర్తింపు పొందిన తేజస్వి సూర్య ఓ ఇంటివారు కాబోతున్నారు. బెంగళూరు సౌత్ లోక్సభ నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున వరుసగా రెండోసారి గెలిచిన తేజస్వి సూర్య.. చెన్నైకి చెందిన ప్రముఖ గాయని, శాస్త్రీయ సంగీతం, భరతనాట్య కళాకారిణి అయిన శివశ్రీ స్కంద ప్రసాద్ను పెళ్లి చేసుకోబోతున్నారు. ఈ విషయాన్ని ఎంపీ తేజస్వి సూర్యనే బెంగళూరులో నిన్న ప్రకటించారు. మార్చి 24వ తేదీన బెంగళూరులోనే ఆయన వివాహం జరగనుంది. శివశ్రీ శాస్త్ర యూనివర్సిటీ నుంచి బయో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. మద్రాస్ యూనివర్సిటీ నుంచి భరతనాట్యంలో ఎంఏ, మద్రాస్ సంస్కృత కాలేజీలో సంస్కృతంలో ఎంఏ పట్టా పుచ్చుకున్నారు. పొన్నియిన్ సెల్వన్ పార్ట్ -2లో కన్నడ వర్షన్లో శివశ్రీ ఓ పాట ఆలపించారు.
ఆమె యుట్యూబ్ చానెల్కు 2 లక్షల మంది సబ్స్క్రైబర్స్ ఉన్నారు. తేజస్వి సూర్య వృత్తి రీత్యా లాయర్. కానీ ప్రస్తుతం ఆయన బెంగళూరు సౌత్ నియోజకవర్గం నుంచి పార్లమెంట్కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2024 ఎంపీ ఎన్నికల్లోనూ ఆయన గెలుపొందారు. 2019 ఎన్నికల్లో 3.31 లక్షల ఓట్ల మెజార్టీతో ఆయన గెలుపొందారు. తేజస్వి చేతిలో కాంగ్రెస్ నేత బీకే హరిప్రసాద్ ఓడిపోయారు. 2020 నుంచి భారతీయ జనతా యువ మోర్చా జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

## పార్టీ క్యాలెండర్ ఆవిష్కరించిన కేటీఆర్



**హైదరాబాద్, (నినాదం న్యూస్) :** తెలంగాణ భవన్లో బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన 2025 క్యాలెండర్ను వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్కు బీఆర్ఎస్ శ్రేణులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ చేత కేటీఆర్ కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలిలో ప్రతిపక్ష నేత ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎంపీ సురేశ్ రెడ్డి, మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, మల్లారెడ్డి, మహమూద్ అలీ, ఎర్రబెల్లి దయాకర్ రావుతోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.



# పాలకులు ఆత్మ విమర్శ చేసుకోవాలి !

సంపాదకీయం

దేశంతో పాటు ప్రపంచమంతా కొత్త సంవత్సరంలోకి అడుగిడిన వేళ..ప్రజలంతా కొత్త ఆశలు, ఆకాంక్షలతో ముందుకు సాగాలని కోరుకుంటున్న వేళ..రాజకీయ నాయకులు, పాలకులు కూడా అదే ఆశయాలతో ముందుకు సాగితే దేశం పురోగమిస్తుంది. కానీ రాజకీయ నాయకులు ఎల్లవేళలా ఓటుబ్యాంకు దృష్టిలోనే ఆలోచనలు చేస్తున్నారు. అదే కోణంలో పథకాలు గానీ, పనులుగానీ చేస్తున్నారు. దీంతో దేశం ముందుకు సాగడం లేదు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం,రూపాయి పతనం వంటి సమస్యలన్నీ మనం సృష్టించుకున్నవే. వాటిని పరిష్కరించుకునే ప్రయత్నం చేయడం లేదు. ధరల అదుపునకు చర్యలు లేవు. ఆహారధాన్యాలు ఉత్పత్తి అవుతున్నా..రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. కొనుగోలుదారులు మాత్రం అధికధరలతో అవస్థలు పడుతున్నారు. ఇకపోతే 140కోట్ల మంది భారతీయులు ఉన్న మన దేశంలో కూలీల కొరతను ఎదుర్కొంటున్నాం. వ్యవసాయ కూలీలు దొరకడం లేదు. దీనికతంటికి పాలకుల విధానాలే కారణం. ఉచిత పథకాలతో ప్రజలను సోమరులను చేసి, పనులకు దూరం చేస్తున్నారు. ఈ సమస్యలపై చర్చించి ముందుకు సాగాలన్న బలమైన సంకల్పం పాలకుల్లో కొరవడిరది. ఐదేళ్లు గడిచే లోగా..మరో ఐదేళ్లకు వేసుకునే ప్రణాళికలతో పాలకులు సాగుతున్నారు. సమిష్టి కృషితో దేశాన్ని ముందుకు నడిపిస్తు న్నామని ప్రధాని మోడీ నూతన సంవత్సరానికి ముందు ప్రకటించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. అలా అయితే భారతదేశం పురోగమించదని, ప్రజలు సమస్యలు, అప్పులు, పన్నుల భారం నుంచి బయటపడరని ప్రధాని మోడీ గుర్తించడం లేదు. ఇకపోతే భాగస్వామ్య పక్షాలుగా ఉన్నా టిడిపి,జనసేన తదితర పార్టీలు కూడా చొరవ తీసుకుని మంచి సలహాలు కూడా ఇవ్వలేక పోతున్నాయి. పెన్షన్లు 4వేలకు పెంచి పంచడమే గొప్ప ఘన కార్యాంగా ఎపి సిఎం చంద్రబాబు భావిస్తున్నారు. మంత్రులు, పార్టీ పెద్దల సలహాలు తీసుకుని పాటించే ఆనవాయితీ మోడీకి ఎలాగూ లేదు. కనీసం భాగస్వామ్య పక్షాలతో అయినా చర్చించే పరిస్థితి లేదు. ఇకపోతే గతేడాది అనేక ముఖ్య ఘట్టాలను మనం పరిశీలించవచ్చు. దేశ రాజకీయాలకు సంబంధించినంత వరకు 2024 ఒక చారిత్రక ఘట్టంగా భావించాలి. కొడిగట్టి పోతున్న కాంగ్రెస్‌కు నూనె పోసి దీపం వెలిగించిన ఘనత మోడీదే. మోడీ నిరంకుశ విధానాలతో కాంగ్రెస్ మళ్లీ బతికి బట్టకట్టింది. అయోధ్యలో రామమందిర నిర్మాణం జరిగి శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ జరగడం ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నాం. కానీ అయోధ్యలోనే బిజెపి పతనం చెందింది. కారణమేమంటే అక్కడి స్థానికులకు లబ్ది కలిగేలా, వారికి దారి చూపేలా పథకాలు అమలు కాలేదు. అయితే గత సంవత్సరం భారతీయ జనతా పార్టీకి సంబంధించి అత్యంత కీలకమైనదిగానే చెప్పుకోవాలి. రామమందిర నిర్మాణం జరిగిన వెంటనే మోదీ ఎన్నికలకు వెళ్లి ఉంటే ఏమి జరిగేదో కాని, ఆయన ఉన్నట్లుండి వ్యూహం మార్చి పూర్తిగా మోదీ పేరుతోనే ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. దేశమంతటా మోదీ అనే వ్యక్తి ఆధారంగానే బీజేపీ ఎన్నికల బరిలోకి దిగింది. తన పేరు చెబితే దేశం దేశం ఏకమై ఉవ్వెత్తున జనం ముందుకు వచ్చి ఓటు వేస్తారని ఊహించుకున్న మోదీ 400 సీట్లు సాధిస్తామని చెప్పుకున్నారు. కాని ఈ ప్రయోగం అంతగా సఫలీకృతం కాకపోవడంతో బీజేపీ కేవలం 240 సీట్లకే పరిమితమయింది. ఇదో రకంగా మోడీకి శరాఘాతంగా భావించాలి. ఈ విఘాతాన్ని అధిగమించాలంటే హరియాణా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడం తప్పదని మోదీ గ్రహించారు. అందుకే అన్నిశక్తులూ ఒడ్డి, అన్ని రకాల వ్యూహాలు పన్ని ఈ రెండు రాష్ట్రాల్లో బీజేపీ గెలుపొందేలా చేయడంతో దేశ రాజకీయ చిత్రపటంపై తనకు తిరుగులేదని అనిపించుకున్నారు. ఎన్నికల్లో గెలవడం తెలుసుకున్న మోడీ ప్రజల మనసులను మాత్రం గెలవలేకపోతున్నారు. ఆయన అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు ప్రజలను నరకయాతన పెడుతున్నా సమీక్షించుకోవడం లేదు. ఈ క్రమంలో 2025 ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బీజేపీకి సంబంధించి కీలక సంవత్సరంగా భావించాలి. మారుతున్న ప్రపంచ రాజకీయాల నేపథ్యంలో భారత్‌లో కూడా మార్పులు రావాల్సి ఉంది. రాజ్యాంగం, కులగణన, అదానీ కుంభకోణం వంటి అంశాలను లేవనెత్తుతున్న కాంగ్రెస్‌ను ఎదుర్కోవడం కూడా అంత సులభం కాదు. పార్లమెంట్ చర్చలకు వేదిక కాకుండా కుమ్ములాటలకు రంగస్థలం కావడంపై ప్రతిపక్షాల కంటే మోదీయే జవాబుదారీ కావల్సి ఉంటుంది. మోడీ ఇంతవరకు గట్టిగా నిలబడి ఏదేని సమస్యపై చర్చించిన దాఖలాలు లేవు. పార్లమెంట్‌లో చర్చలకు అవకాశం లేకుండా పోతున్నది. 2024లో దేశంలో దాదాపు పది సంవత్సరాల తర్వాత జాతీయ స్థాయిలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడడం, ఈ ప్రభుత్వంలో తెలుగుదేశం వంటి దక్షిణాది పార్టీ ప్రధాన భాగస్వామి కావడం, ప్రధాన రాజకీయ పార్టీలు రెండు ప్రధాన కూటములుగా ఏర్పడడం మరో ముఖ్యమైన పరిణామం అని చెప్పక తప్పదు. బీజేపీ, కాంగ్రెస్ కూటములకు చెందని ప్రాంతీయ పార్టీలు అస్తిత్వ పరీక్షను ఎదుర్కొంటున్నాయి. బీఆర్ఎస్, బీజేడి, వైసీపీ, ఆమ్‌ఆద్మీ పార్టీలు మనుగడకోసం కష్టపడు తున్నాయి. 2025 ఈ విషయంలో మరింత స్పష్టత నిస్తుందనడంలో సందేహం లేదు. అయితే మోడీ తన ఆర్థిక విధానాలను, పాలనా తీరును సమీక్షించుకోక తప్పదు. లేకుంటే మోడీ అస్తిత్వం కూడా ప్రశ్నార్థకం కాగలదు. దేశానికి దిశదశ చూపేలా రాజకీయాలు చేయాలి. ప్రజల బాటలో నడవాలి. అప్పుడే మోడీ నిలుస్తారు.

## టీమిండియా ఆటతీరుతో బేజార్
### తీవ్ర ఒత్తిడిలో హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్

న్యూఢిల్లీ : మెల్‌బోర్న్ టెస్టులో ఓటమి.. మరోవైపు డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరే అవకాశాలు పూర్తిగా సంక్లిష్టం.. ఈనేపథ్యంలో టీమ్‌ఇండియా డ్రెస్సింగ్ రూమ్‌లో వాతావరణం పూర్తిగా వేడెక్కినట్లు తెలుస్తోంది. మరోవైపు ఇటీవల టీమ్‌ఇండియా ఫలితాలతో తీవ్ర ఒత్తిడిలో ఉన్న హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఆటగాళ్లపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసినట్లు సమాచారం. బోర్డర్ గావస్కర్ ట్రోఫీలోని నాలుగో టెస్టులో తీవ్రంగా నిరాశపరిచిన స్టార్‌ప్లేయర్ల ఆటతీరుపై గంభీర్ ఫైర్ అయినట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయి. మెల్‌బోర్న్ టెస్టులో ఓటమి అనంతరం డ్రెస్సింగ్ రూమ్‌కు తిరిగివచ్చిన ఆటగాళ్లపై అతడు మండిపడినట్లు తెలుస్తోంది. ఇక చేసింది చాలు అని పేర్కొనట్లు సమాచారం. కొంతమంది ఆటగాళ్లు పేలవ షాట్లు ఆడి వికెట్లు కోల్పోవడంపై ఆగ్రహం వ్యక్తంచేసినట్లు తెలుస్తోంది. కోచ్‌గా బాధ్యతలు చేపట్టగానే.. ఆటగాళ్లు వారి మార్గాల్లోనే ఆడేందుకు గంభీర్ ఆరు నెలలు స్వేచ్ఛ ఇచ్చాడని.. కానీ ఇప్పుడు అదంతా ముగిసిందని పలువురు అంటున్నారు. ఇప్పటినుంచి జట్టు వ్యూహాలకనుగుణంగా ఆడనివారిపై వేటు వేసే దిశగా చర్యలు ఉంటాయని అతడు సంకేతాలు ఇచ్చినట్లు చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మ్యాచ్‌కనుగుణంగా గంభీర్ తీసుకుంటున్న వ్యూహాలకు.. మైదానంలో ప్లేయర్ల ఆటతీరుకు మధ్య పొంతన ఉండటం లేదనే దానిపై చర్చ నడుస్తోంది. ఇటీవల ముగిసిన టెస్టులో రిషభ్ పంత్ బాధ్యతారాహిత్యంగా ఆడి వికెట్ సమర్పించు కున్నాడు. అదే మ్యాచ్‌ను కోల్పోవడంలో కీలకంగా మారింది. మరోవైపు కోహ్లీ మరోసారి తన బలహీనతను చాటుకొని స్లిప్‌లో చిక్కాడు. ఇక రోహిత్ శర్మ ఏ స్థానంలో వచ్చినా.. రాణించలేకపోతున్నాడు. మెల్‌బోర్న్ టెస్టులో రెండో ఇన్నింగ్స్‌ను జాగ్రత్తగా ప్రారంభించినప్పటికీ.. చివరికీ తన పాత ఆటతీరునే కొనసాగించి విఫలమయ్యాడు. ఇలా సీనియర్ల ఆటతీరు గంభీర్‌ను బాధించిందని.. త్వరలోనే తీవ్రమైన చర్యలకు అతడు సిద్ధమవుతున్నట్లు సమాచారం. రాహుల్ ద్రవిడ్ అనంతరం హెడ్ కోచ్‌గా గంభీర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత.. టీమ్‌ఇండియాకు మిశ్రమ ఫలితాలే వస్తున్నాయి.

# అంతర్ముఖుల్లో ఆత్మ సౌందర్యాన్ని దర్శిద్దాం !

**(02 జనవరి "ప్రపంచ అంతర్ముఖుల దినం" సందర్భంగా)**

**"అంతర్ముఖులు లేదా ఇంట్రావర్ట్స్" అనే పదాన్ని నేటి పౌర సమాజం కొంత చులకన, హేళన, తక్కువ దృష్టి, మాట్లాడడానికి భయపడే వారని ఆక్షేపణ దృష్టి అపార్థం చూసుకోవడం చూస్తున్నాం. గలగల మాట్లాడే వారందరూ మంచి వారు కారు, తక్కువగా మాట్లాడే వారు సమర్థులు కారు. పౌర సమాజంలో 25 - 40 శాతం వరకు ప్రజలు అంతర్ముఖులుగానే జీవితాలను గడుపుతున్నట్లు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. అంతర్ముఖుల్లో ప్రముఖ శాస్త్రవేత్తలు, తత్త్వవేత్తలు, కళాకారులు, ఆలోచనాపరులు అనేకులు ఉన్నారని మరువరాదు. అంతర్ముఖులతో మాటకలిపితే వారి శక్తిసామర్థ్యాలు అవగతం అవుతాయని తెలుసు కోవాలి. సాధారణంగా బహిర్ముఖులు లేదా ఎక్స్‌ట్రావర్ట్స్ దృష్టిలో అంతర్ముఖులు చులకనగా చూడబడతారు.**




### అంతర్ముఖుల విలక్షణ సుగుణాలు:

నిజానికి అంతర్ముఖుల తెలివి తేటలు, గొప్ప లక్షణాలు, మేధో వికాసం, శక్తి సామర్థ్యాలు అపారంగా ఉంటూ, అద్భుతాలను సృష్టిస్తు ఉంటారు. అవసరమైతే తప్ప మాట్లాడని వారు, మొహమాట పడే వారు, వినడానికి ఆసక్తి చూపే వారు, ఒంటరిగా ఉండడానికి ఇష్టపడే వారు, ఇతరులతో గడపడానికి ఆసక్తి చూపని వారు, పార్టీలకు దూరంగా ఉండే ప్రయత్నాలు చేసే వారు అంతర్ముఖులుగా పేర్కొనబడతారు. అంతర్ముఖులు తక్కువగా మాట్లాడుతూ, ఓపికగా వినడానికి ఇష్టపడుతూ, సోషల్ మీడియాల్లో చురుగ్గా ఉంటూ, చుట్టు పక్కల నిశితంగా పరిశీలిస్తూ, మంచి స్నేహితులుగా ఉంటారు. నలుగురిలో ఉన్నపుడు నిశ్శబ్దంగా ఉండే వీరు నోరు జారే సందర్భాలు చాలా తక్కువ. వీరు నమ్మకమైన కొద్ది వ్యక్తులతోనే స్నేహం చేస్తారు. వీరు మంచి నాయకత్వ లక్షణాలను కలిగి, ఒత్తిడిలో సహితం సరైన నిర్ణయాలు తీసుకునే గుణాన్ని కలిగి ఉంటారు.

### అంతర్ముఖులు అసాధ్యులు:

అంతర్ముఖులు అంటే సిగ్గు పడేవారు లేదా అందరికీ దూరంగా ఉండేవారట అని మాత్రం కాదని వారి లోపల నిగూఢమైన శక్తి అపారంగా ఉంటుందని పౌర సమాజం గుర్తించాలని ప్రచారం చేయడానికి 2011 నుంచి ప్రతి ఏట 02 జనవరిన "ప్రపంచ అంతర్ముఖుల దినం లేదా వరల్డ్ ఇంట్రొవర్ట్ డే" పాటించడం ఆనవాయితీగా వస్తున్నది. నిశ్శబ్దాన్ని కోరుకునే అంతర్ముఖులకు సృజనశీలత, లోతైన విషయ పరిజ్ఞానం, ఒత్తిడిని తట్టుకుంటూ సమస్యల సాధనకు కృషి చేయడం లాంటి ప్రత్యేక లక్షణాలు అంతర్ముఖులకు స్వంతం అని ఆ వర్గం వారిని గుర్తించడం, ప్రోత్సహించడం, వారితో స్నేహం చేయడం లాంటి అంశాలను ప్రచారం చేయడానికి ప్రపంచ అంతర్ముఖుల దినం వేదికలు ఉపయోగపడతాయి.

### ప్రపంచ ప్రఖ్యాత అంతర్ముఖులు:

అంతర్ముఖుల జాబితాలో ప్రపంచ ప్రఖ్యాత దిగ్గజాలు అనేకులు ఉన్నారు. ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్తలు అల్బర్ట్ ఐన్‌స్టీన్, మేడమ్ క్యూరీ, చార్లెస్ డార్విన్, సర్ ఐజాక్ న్యూటన్‌లతో పాటు ఫేస్‌బుక్ వ్యవస్థాపకులు మార్క్ జుకెర్‌బర్గ్, భారత పితామహులు మహాత్మా గాంధీ, మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకులు బిల్ గేట్స్, అత్యంతసంపన్న వ్యాపారవేత్తలు వారెన్ బఫెట్, ఎలాన్ మస్క్, లారీ పేజ్‌లు, బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు మైఖేల్ జోర్డన్, సినీ దర్శకులు స్టీవ్ స్పిల్బర్గ్, అమెరికా మాజీ అధ్యక్షులు అబ్రహం లింకన్, బరాక్ ఒబామా మొదలగు వారందరూ ఉండడం గమనించదగిన అంశంగా చూడాలి.

అంతర్ముఖులను ఎగతాళిగా చూస్తే మనం త(ప)ప్పులో కాలు వేసినట్లే. వారిలోని విలక్షణ లక్షణాలను గుర్తించి, వారితో స్నేహం చేసి మన విజ్ఞానాన వివేకాలను పెంచుకుందాం, అంతర్ముఖుల అభిప్రాయాలకు పట్టం కడదాం.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

# న్యూ ఇయర్ వేడుకల్లో భారీగా ఆన్‌లైన్ బిజినెస్

**భారీగా ఆర్డర్ చేసిన కండోమ్స్..లో దుస్తులు ఫుడ్‌కు యధావిధిగానే పెరగిన డిమాండ్**

న్యూఢిల్లీ : భారత్ సహా ప్రపంచ దేశాలన్నీ 2025 సంవత్సరానికి ఆహ్వానం పలికాయి. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా భారత్‌లో ఏ వస్తువుల ఎక్కువగా ఆర్డర్ చేశారో తెలుసుకోవాలని చాలా మందికి ఆసక్తి ఉంటుంది. కొందరు ఫుడ్ ఆర్డరిస్తే, కొందరు డ్రింక్స్ పెడుతుంటారు. డిసెంబర్ 31న భారతీయులు ఎక్కువగా ఆర్డర్ చేసిన ఐటమ్స్ వివరాలను ప్రముఖ ఈ కామర్స్ దిగ్గజాలు బ్లింకిట్, స్విగ్గీ, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ షేర్ చేశాయి. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా అత్యంత ప్రజాదరణ పొందిన వస్తువుల వివరాలను నెటిజన్లతో షేర్ చేసుకున్నారు. ఊహించినట్లగానే కొత్త సంవత్సరంలో పార్టీలు బాగా జరిగాయి. దేశవ్యాప్తంగా ప్రజలు స్నాక్స్ ఎక్కువ బుక్ చేసుకున్నారు. రాత్రి 8 గంటల వరకే బ్లింకిట్‌లో 2.3 లక్షల ఆలూ భుజియా ప్యాకెట్లు డెలివరీ అయ్యాయి. స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో సైతం గత రాత్రి 7.30 గంటలకే నిమిషానికి 853 చిప్స్ ఆర్డర్‌లు వచ్చాయి. స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో అత్యధిక బుకింగ్స్ పాలు, చిప్స్,చాక్లెట్, ద్రాక్ష, పన్నీర్ ఐటమ్స్ ఉన్నాయని వెల్లడిరచింది. కూల్ డ్రింక్స్, ఐస్ క్యూబ్స్ కూడా భారీగా ఆర్డర్ చేశారు. మంగళవారం రాత్రి 8 గంటల వరకే బ్లింకిట్ ద్వారా డెలివరీ 6,834 ఐస్ క్యూబ్స్ ప్యాకెట్లు, అదే సమయానికి బిగ్ బాస్కెట్‌లో ఐస్ క్యూబ్‌ల ఆర్డర్‌లు 1290 శాతం పెరిగాయి. 7:41 గంటల సమయంలో 119 కిలోలు ఐస్ క్యూబ్స్ డెలివరీ అయ్యాయని స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ ట్వీట్ చేసింది. బిగ్‌బాస్కెట్‌లో నాన్ ఆల్కహాలిక్ డ్రింక్స్ విక్రయాలు 552 శాతం పెరిగాయి. డిస్పోజబుల్ కప్పులు, ప్లేట్‌ల ఆర్డర్స్ సైతం 325 శాతం పెరిగాయి. సోడా, మాక్‌టెయిల్ విక్రయాలు సైతం 200 శాతం పెరిగాయి. న్యూ ఇయర్ సందర్భంగా అత్యధిక విక్రయాలు జరిగిన మరో ఐటమ్ కండోమ్స్. డిసెంబర్ 31 మధ్యాహ్నం వరకే స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ 4,779 ప్యాక్‌ల కండోమ్స్ డెలివరీ చేసింది. సాయంత్రం తరువాత నిరోధ్‌ల విక్రయాలు మరింత పెరిగాయి. బ్లింకిట్‌లో సైతం కండోమ్ అమ్మకాలు భారీగా పెరిగాయి. 1.2 లక్షల కండోమ్‌ల ప్యాకెట్లు డెలివరీ చేశామని వెల్లడించారు.

# ప్రతిష్ఠాత్మకం... భారత రత్న పురస్కారం...
## జనవరి 2న... భారత రత్న ప్రారంభం

**భారతరత్న పురస్కారం భారతదేశంలో పౌరులకు అందే అత్యుత్తమ పురస్కారం. పురస్కారం కళ, సాహిత్య, విజ్ఞాన, క్రీడా రంగాలలో అత్యుత్తమ కృషికి ప్రదానం చేస్తారు. భారతరత్న పురస్కారం అత్యున్నత స్థాయిలో ప్రదర్శించిన కృషికి/చేసిన సేవకు గుర్తింపుగా ఎటువంటి జాతి, వృత్తి, స్థాయి, లింగ బేధాలను పాటించకుండా ప్రదానం చేయబడుతుంది. పురస్కారానికి ఎంపిక చేయాల్సిన జాబితాను ప్రధానమంత్రి రాష్ట్రపతికి సిఫారసు చేయవలసి ఉంటుంది. ఇది జనవరి 2, 1954లో భారతదేశ మొదటి రాష్ట్రపతి డా. రాజేంద్ర ప్రసాద్ చేత పారంభింప బడింది. 1954, జనవరి 2వ తేదీన రెండు పౌర పురస్కారాలను ప్రారంభిస్తున్నట్లు భారత రాష్ట్రపతి యొక్క కార్యదర్శి కార్యాలయం నుండి ఒక ప్రకటన జారీ అయ్యింది. వాటిలో మొదటిది అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న కాగా రెండవది దానికన్నా తక్కువ స్థాయి గల మూడంచెల పద్మవిభూషణ్ పురస్కారం. పద్మవిభూషణ్ పురస్కారం ప్రథమ, ద్వితీయ, తృతీయ వర్గాలుగా విభజించారు.**

### 1955, జనవరి 15న

పద్మవిభూషణ్ పురస్కారాన్ని పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ అనే మూడు వేర్వేరు పురస్కారాలుగా పునర్వర్గీకరించారు. భారత రత్న పురస్కారం ప్రకటించినట్లు ఎన్ని ప్రకటనలు వెలువడినా, కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ వారు ప్రచురించే గెజిట్లో అధికారికంగా ప్రకటించిన తర్వాతనే ఈ పురస్కారం అధికారికంగా లభించినట్లు భావిస్తారు. పురస్కార గ్రహీతలకు రాష్ట్రపతి తన సంతకంతో కూడిన ఒక "సనదు (పట్టా), ఒక పతకం ప్రదానం చేస్తాడు. 1954 నిర్దేశాలు ప్రకారం 1 3/8 ఇంచుల (35 మిల్లీ మీటర్ల) వ్యాసార్థం కలిగిన వృత్తాకార బంగారు పతకాన్ని ఈ పురస్కార సమయంలో బహూకరిస్తారు. పతకం ముఖ భాగంలో సూర్యుని బొమ్మ ఉండి, కింది భాగంలో వెండితో "భారత రత్న" అని దేవనాగరి లిపిలో రాసి ఉంటుంది. వెనకవైపు మధ్యభాగంలో ప్లాటినం లోహంలో భారత చిహ్నం, కింది భాగంలో వెండితో భారత జాతీయ నినాదం "సత్యమేవ జయతే" అని రాసి ఉంటుంది. ఏడాది తరువాత దీని రూపాన్ని మార్చారు. అప్పుడు మార్చిన దానినే ఇప్పటికీ వాడుతున్నారు. ఇప్పటి మోడల్ ప్రకారం రావి ఆకు ఆకారంలో ఉండి 2 5/16 ఇంచులు (59 మి.మీ.) పొడవు, 1 7/8 ఇంచుల (48 మి.మీ.) వెడల్పు ఘఅని 1/%8 ఇంచుల (మి.మీ.) మందం కలిగి ఉండి ప్లాటినం చట్రం కలిగి ఉంటుంది. పతకం ముందు భాగంలో మధ్యలో సూర్యుని బొమ్మ చిత్రీకరించబడి ఉంటుంది. ప్లాటినం లోహంతో తయారు చేసిన ఈ బొమ్మ 5/8 ఇంచుల (16 మి.మీ.) వ్యాసార్థం కలిగి ఉ ండి, సూర్యుని కేంద్ర బిందువు నుంచి 5/6 ఇంచులు (21 మి.మీ.) నుంచి 1/2 దాకా (13 మి.మీ.) కిరణాలు విస్తరించి ఉంటాయి. ముందుభాగంలో భారతరత్న అన్న పదాలు, వెనుక వైపు భారత జాతీయ చిహ్నం, నినాదం సత్యమేవ జయతే 1954 డిజైన్ లోనే ఉంచేశారు. మెడలో వేయడానికి వీలుగా 2 ఇంచ్




వెడల్పు, 51 ఎం.ఎం. గల తెలుపు రిబ్బన్ ను పతకానికి కడతారు. 1957లో, వెండి పూత మార్చి ఎండిన కాంస్యం వాడటం ప్రారంభించారు. భారత రత్న పతకాలను కలకత్తాలోని అలిపోర్ ప్రభుత్వ ముద్రణశాలలో ముద్రిస్తారు. పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ, పరమ వీర చక్ర, వంటి పౌర, సైనిక పురస్కారలకు ఇచ్చే పతకాలు కూడా ఇక్కడే ముద్రిస్తుంటారు. ఈ పురస్కారం క్రింద ఎలాంటి నగదు మంజూరు చేయరు. భారత రాజ్యాంగం యొక్క ఆర్టికల్ 18 (1) ప్రకారం ఈ పురస్కార గ్రహీతలెవ్వరూ తమ పేరు ముందు, వెనుక భారతరత్న అని పేర్కొనరాదు. భారతరత్న పొందిన పౌరులకు 7వ స్థాయి గౌరవం లభిస్తుంది (మొదటిది ఆరు – రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, రాష్ట్ర గవర్నర్లు, మాజీ రాష్ట్రపతులు, ఉపప్రధాన మంత్రి, ముఖ్య న్యాయాధీశులు). కానీ ఈ గౌరవం వలన ఎలాంటి అధికారాలు లేదా పేరు ముందు ప్రత్యేక బిరుదులూ రావు. సాధారణంగా భారతరత్న పురస్కార ప్రదాన సభ రాష్ట్రపతి భవన్, ఢిల్లీలో జరుగుతుంది.

### 1954 నాటి నిబంధనల ప్రకారం

ఈ పురస్కారం కళలు, సాహిత్యం, విజ్ఞానం, ప్రజాసేవ రంగాలలో కృషి చేసినవారికి ఇచ్చేవారు. 2011, డిసెంబరులో ఈ నిబంధనలను మార్చి "మానవజాతి పాటుపడే ఈ రంగానికైనా" అనే పదాన్ని చేర్చారు. 1954 నాటి నిబంధనలు మరణానంతరం ఈ పురస్కారం ప్రకటించడాన్ని అనుమతించేవి కావు. కానీ 1955 జనవరిలో ఈ నిబంధనను సడలించారు. భారతరత్న పురస్కారం కేవలం భారతీయులకే ప్రదానం చేయాలన్న నిబంధన ఏమీ లేదు. ఈ పురస్కారాన్ని భారత పౌరసత్వం స్వీకరించిన మదర్ థెరీసాకు 1980లో, మరో ఇద్దరు విదేశీయులు ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాను 1987లో, నెల్సన్ మండేలాకు 1990లో ప్రదానం చేశారు. ఈ పురస్కారం రెండుసార్లు రద్దు చేయబడింది. మొదటి సారి మొరార్జీ దేశాయ్ ప్రధానమంత్రిగా గద్దెనెక్కిన తర్వాత 1977, జూలై 13వ తేదీన అన్ని పౌరపురస్కారాలను రద్దుచేశారు. తరువాత ఈ పురస్కారాలు 1980, జనవరి 25న ఇందిరాగాంధీ ప్రధాన మంత్రి అయిన తర్వాత పునురుద్ధరించబడ్డాయి 1992లో ఈ పురస్కారాల "రాజ్యాంగ సాధికారత"ను సవాలు చేస్తూ కేరళ, మధ్యప్రదేశ్ హైకోర్టులలో రెండు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు కావడంతో ఈ పురస్కారాలను రెండవసారి రద్దు చేశారు. ఈ వ్యాజ్యాలకు ముగింపు పలుకుతూ 1995 డిసెంబరులో సుప్రీం కోర్టు ఈ పురస్కారాలను మళ్ళీ పునరుద్ధరించింది. లెజెండరీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ కు తన 40వ యేట ఈ పురస్కారం లభించింది. ఈ పురస్కారం లభించినవారిలో ఇతనే అతి పిన్నవయస్కుడు, మొట్టమొదటి క్రీడాకారుడు. కానీ 1958, ఏప్రిల్ 18వ తేదీన బొంబాయిలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ధొండొ కేశవ కర్వేకు అతని 100వ జన్మదినం సందర్భంగా ఈ పురస్కారాన్ని అందజేశారు. ఆయన జీవించి ఉండగా ఈ పురస్కారం అందుకున్నవారిలో అతి పెద్ద వయస్కుడు. 1966లో లాల్ బహదూర్ శాస్త్రి మొట్టమొదటి సారి మరణానంతరం ఈ పురస్కారాన్ని పొందాడు. ఈ పురస్కారానికి ప్రతిపాదనలు చేసే పద్ధతి లేనప్పటికీ, ప్రధానమంత్రి మాత్రమే రాష్ట్రపతికి ఏడాదికి గరిష్ఠంగా ముగ్గురిని మాత్రం సిఫారసు చేయవచ్చు. కానీ 1999లో ఈ పురస్కారాన్ని నలుగురు వ్యక్తులకు ప్రదానం చేశారు. భారత రత్న పొందిన వారిలో సర్వేపల్లి రాధాకృష్ణన్ 1954, చక్రవర్తుల రాజగోపాలాచారి 1954, డా.సి.వి. రామన్ 1954, డా. భగవాన్ దాస్ 1955, డా. మోక్షగుండం విశ్వేశ్వరయ్య 1955, జవహర్ లాల్ నెహ్రూ 1955, గోవింద్ వల్లభ్ పంత్ 957, ధొండొ కేశవ కార్వే 1958, డా. బీ.సీ.రాయ్ 1961, పురుషోత్తమ దాస్ టాండన్ 1961, రాజేంద్ర ప్రసాద్ 1962, డా. జాకీర్ హుస్సేన్ 1963, పాండురంగ వామన్ కానే, 1963, లాల్ బహదూర్ శాస్త్రి (మరణానంతరం) 1966, ఇందిరాగాంధీ 1971, వీ.వీ.గిరి 1975, కే. కామరాజు (మరణానంతరం) 1976, మదర్ థెరీసా 1980, ఆచార్య వినోబా భావే (మరణానంతరం)1983, ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ 1987, యం.జి.రామచంద్రన్ (మరణానంతరం)1988, బి.ఆర్. అంబేద్కర్ (మరణానంతరం)1990, నెల్సన్ మండేలా 1990, రాజీవ్ గాంధీ (మరణానంతరం) 1991, సర్దార్ వల్లభాయి పటేల్, (మరణానంతరం) 1991, మొరార్జీ దేశాయి 1991, మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ (మరణానంతరం) 1992, జే.ఆర్.డీ. టాటా (1904–1993) 1992, సత్యజిత్ రే 1992, సుభాష్ చంద్ర బోస్ (తరువాత ఉపసంహరించ బడినది) 1992 ఏ.పి.జె. అబ్దుల్ కలామ్ 1997 గుర్జారీలాల్ నందా 1997, అరుణా అసఫ్ అలీ (మరణానంతరం) 1997, ఎం.ఎస్. సుబ్బలక్ష్మి 1998. సి.సుబ్రమణ్యం 1998, జయప్రకాశ్ నారాయణ్ 1998, రవి శంకర్ 1999, అమర్త్య సేన్ 1999, గోపీనాథ్ బొర్డొలాయి 1999, లతా మంగేష్కర్ 2001, బిస్మిల్లా ఖాన్ 2001, భీమ్ సేన్ జోషి 2008, సచిన్ టెండూల్కర్ 2014, సి. ఎన్. ఆర్. రావు 2014, మదన్ మోహన్ మాలవ్య 2015, అటల్ బిహారీ వాజపేయి 2015, ప్రణబ్ ముఖర్జీ 2019, నానాజీ దేశముఖ్ 2019, హజారిక 2019 తదితరులు ఉన్నారు.

నినాదం



## దుర్గమ్మ దయతో కొత్త సంవత్సరంలో ప్రజలకు మేలు జరగాలి : చంద్రబాబు



**అమరావతి:** నూతన సంవత్సరంలో ఆ దుర్గమ్మ తల్లి దయతో అందరికీ మేలు జరగాలని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. చంద్రబాబు నాయుడు బుధవారం విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గమ్మను దర్శించుకు న్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆలయానికి వచ్చిన సీఎంకు ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజే శారు. టీటీడీ 2025 నూతన క్యాలెండర్‌ను, డైరీని అందజేశారు. ఈ సంద ర్భంగా చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో రాష్ట్రానికి మేలు జరుగాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. సీఎం రాక సంద ర్భంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం వెంట హెూం మంత్రి వంగలపుడి అనిత తదితరులున్నారు. నూతన సంవ త్సరం తొలిరోజు ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనా నికి సుమారు 4 గంటల సమయం పడుతుందని ఆలయ అధికారులు వివరించారు.

## న్యూఇయర్ వేడుకల్లో అపశృతి.. ఒకరి మృతి

**అమరావతి :** పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ సంతోషంగా కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వేడుకలు జరుపుకున్న ఆ కుటుంబంలో ఒక్కసారిగా విషాదం నెలకొంది. విశాఖపట్నం గాజువాక పట్టణంలో వడ్లపూడి రజకవీధిలో నిన్న రాత్రి న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌లో భాగంగా క్రాకర్ కాలుస్తుండగా ఒక్కసారిగా పేలి,సుద్దమళ్ల శివ అనే వ్యక్తి నుదుడిపై తీవ్రగాయమై అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే కూర్మన్నపాలెం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని నిర్ధారించడంతో స్నేహితులు, కుటుంబ సభ్యులు బోరున రోధించారు. బుధవారం ఘటనా స్థలాన్ని పరిశీలించిన దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం మత్తులో... కరెంట్ స్తంభం ఎక్కిన యువకుడు


### హాయిగా తీగల మీద నిద్ర.. ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆపేసిన స్థానికులు



**అమరావతి :** పీకలదాకా తాగిన తర్వాత మందుబాబులు వేసే చిందు లు అన్నీ ఇన్నీ కావు.. వాళ్లు చేసే చేష్టలు నభూతో న భవిష్యత్తు అనిపిం చేలా ఉంటాయి. న్యూఇయర్ వేళ ఓ మందు బాబు చేసిన పని కూడా ఇప్పుడు అలాగే ఉంది. డిసెంబర్ 31కి దావత్ అని ఫుల్లుగా తాగిన ఓ మందుబాబు ఏకంగా పోల్ ఎక్కి కరెంటు తీగలపైనే పడుకున్నాడు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం ఎం.సింగపురంలో మంగళవారం నాడు ఓ మందు బాబు హల్‌చల్ చేశాడు. డిసెంబర్ 31 అని పొద్దున్నే తాగేశాడు. అయినా చాలకపోవడంతో మందుకు డబ్బు కావాలని ఇంటికెళ్లి వాళ్ల అమ్మను అడిగాడు. కానీ ఆమె డబ్బులు ఇవ్వకపోవడంతో కోపంలో బయటకు వెళ్లిన అతను.. దగ్గరలో ఉన్న కరెంటు పోల్ ఎక్కేశాడు. మద్యం మత్తులో అతను విద్యుత్ స్తంభం ఎక్కడం చూసిన పలువురు అతని దగ్గరకు పరిగెత్తారు. కానీ వాళ్ల మాటలేమీ పట్టించుకోకుండా అతను పైకి ఎక్కేశాడు. దీంతో కరెంటు తీగలు ముట్టుకుంటాడేమో అన్న భయంతో స్థానికులు ట్రాన్స్‌ఫార్మర్ ఆపేశాడు.

## ఒంటినిండా బంగారంతో శ్రీవారిని దర్శించుకున్న భక్తుడు

### - సోషల్ మీడియాలో వీడియో వైరల్



**తిరుమల:**న్యూ ఇయర్ సందర్భంగా తిరుమల శ్రీవారిని ఓ భక్తుడు దర్శించు కోవడం ఇప్పుడు వైరల్‌గా మారింది. ఏడుకొండల వాడిని రోజుకు లక్షలాది మంది భక్తులు దర్శించుకుంటారు కదా.. అందులో వింత ఏముందని అనుకుంటున్నారా! వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడంలో వింత లేదు.. అయితే వచ్చిన భక్తుడు ఒంటి నిండా బంగారంతో రావడమే ఇప్పుడు అందర్నీ ఆకట్టుకుంటుంది. హైదరాబాద్‌కు చెందిన తెలంగాణ ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి కొండా విజయ్ కుమార్ మంగళవారం నాడు ఇంటి నిండా బంగారంతో తిరుమలకు వచ్చాడు. దాదాపు 5 కిలోల బంగారు ఆభరణాలను ధరించి అతను శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా క్యూలైన్‌లో వేచి ఉన్న విజయ్‌కుమార్ ధరించిన భారీ ఆభరణాలు.. మిగతా భక్తుల దృష్టిని ఆకర్షించాయి. మెడలో, చేతికి ఉన్న భారీ ఆభరణాలను భక్తులు ఆసక్తిగా పరిశీలించారు. అయితే బంగారంపై తనకు ఆసక్తి ఎక్కువ అని.. అందుకే ఇలా భారీ ఆభరణాలు చేయించుకుని, ధరిస్తున్నానని విజయ్‌కుమార్ తెలిపారు.

## విజయవాడలో రోడ్డు ప్రమాదం.. ముగ్గురి మృతి

**అమరావతి:** ఏపీలోని విజయవాడ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. విజయవాడలోని మార్టూరు మండలం దేగరమూడి సమీపంలో లారీ బైక్‌ను ఢీ కొట్టింది. బైక్‌పై వెళ్తున్న ముగ్గురు అక్కడికక్కడే చనిపోయారు. మృతుల వివరాలు ఇంకా తెలియరాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

### మృతి చెందిన భార్యాభర్తలు

**జగిత్యాల:**ధర్మపురి పట్టణంలోని జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి ఘోర ప్రమాదం జరిగింది. బ్కెక్‌పై వెళ్తున్న ఇద్దరు దంపతులను వేగంగా వచ్చిన ఓ కారు ఢీకొట్టింది. దీంతో బ్కెక్‌పై వెళ్తున్న భార్యాభర్తలిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. భర్త అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, భార్య ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతులను రామయ్యపల్లె గ్రామానికి చెందిన కూస చంద్రయ్య(60), కూస భాగ్యమ్మ(55)గా పోలీసులు గుర్తిం చారు. న్యూ ఇయర్ సందర్భంగా రాత్రి ధర్మపురి చర్చిలో ప్రార్థనల నిమిత్తం దంపతులిద్దరూ వెళ్లారు. ప్రార్థనల అనంతరం తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా జాతీయ రహదారిపై వారి బ్కెక్‌ను కారు ఢీకొట్టింది. మృతుల నివాసాల్లో విషాదఛాయలు అలుముకు న్నాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# వైజాగ్ సెంట్రల్ జైల్లో కలకలం

## సెల్‌ఫోన్లను పాతిపెట్టిన ఖైదీలు




**విశాఖపట్నం:**వైజాగ్ సెంట్రల్ జైల్లో మొబైల్ ఫోన్లు దొరకడం ఏపీ వ్యాప్తంగా కలకలం రేపుతోంది. రెగ్యులర్ తనిఖీల్లో భాగంగా పెన్నా బ్యారక్ సమీపంలో పోలీసులకు నాలుగు అడుగుల లోతులో పాతిపెట్టిన ఓ ప్యాకెట్ కనిపించింది. పెన్నా బ్యారక్ సమీపంలోని పూల కుండీల వద్ద భూమిలో 4 అడుగుల లోతులో ఈ ఫోన్లను కవర్‌లో పెట్టి పాతిపెట్టారు. వాటిపై రెండు రాళ్లు కప్పి పైన పూల కుండీని పెట్టారు. అనుమానాస్పదంగా కనిపిం చడంతో దాన్ని పరిశీలించగా అందులో రెండు సెల్‌ఫోన్లు, ఒక పవర్ బ్యాంక్, రెండు చార్జింగ్ వైర్లు, ఫోన్ బ్యాటరీ కనిపించాయి. సెల్‌ఫోన్లు దొరకడంతో పోలీసులు అప్రమత్తమై వాటిని స్వాధీనం చేసుకున్నారు. అయితే ఆ సెల్‌ఫోన్లలో సిమ్ కార్డులు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అయితే ఈ విషయం తెలియగానే వైజాగ్ సీపీ శంఖబ్రత బాగ్చీ రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. సిమ్ కార్డులు దొరికన పెన్నా బ్యారక్‌లో రౌడీ షీటర్ హేమంత్ కుమార్ ఉన్నట్లుగా తెలుస్తోంది. విశాఖ సెంట్రల్ జైలు వివాదాలపై మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ స్పందించారు. సెంట్రల్ జైల్లో పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. వ్యవస్థలు ఏ స్థాయిలో నిర్వీర్యమయ్యాయో అర్థమవుతోందని అన్నారు. జైల్లో గంజాయి, సెల్‌ఫోన్ల ఘటనపై సమగ్రంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## నాని అనుచరుడు కాళీకి పది వరకు రిమాండ్

### వైద్య పరీక్షల అనంతరం నెల్లూరు జైలుకు తరలింపు



**గుడివాడ:** మాజీ మంత్రి కొడాలి నాని ప్రధాన అనుచరుడు, కృష్ణా జిల్లా వైకాపా యువజన విభాగం అధ్యక్షుడు మెరుగుమాల కాళీకి న్యాయస్థానం రిమాండ్ విధించింది. గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం పోలీసులు ఆయన్ను గుడివాడ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చారు. ఈ నెల 10 వరకు కోర్టు ఆయనకు రిమాండ్ విధించింది. ఆ తర్వాత నిందితుడు కాళీని పోలీసులు నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించారు. వైకాపా అధికారంలో ఉండగా గుడివాడ తెదేపా కార్యాలయం, ఆ పార్టీ నేత రావి వెంకటేశ్వరరావుపై దాడి కేసులో కాళీ కీలక సూత్రధారి. 2022 డిసెంబరు 25న రాత్రి.. కాళీ తన అనుచరులతో కలిసి తెదేపా కార్యాలయం, రావిపై పెట్రోల్ ప్యాకెట్లతో దాడి చేశాడు. ఈ సంఘటనపై రావి వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేసినా నాటి అధికార పార్టీ ప్రోద్బలంతో నిందితులను అరెస్టు చేయలేదు. పైగా రావి వర్గీయులు, ఇతర తెదేపా నాయకులపై ఎదురు కేసులు నమోదు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సంఘటన వీడియోలను పోలీసులు పరిశీలించి హత్యాయత్నం సెక్షన్‌ను జోడించారు. ఈ క్రమంలో డిసెంబరు 4న పది మంది నిందితులను ఏకకాలంలో అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత మరో ముగ్గురిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ముఖ్య నిందితుడైన కాళీ.. అస్సాం రాష్ట్రంలో చేపల వ్యాపారం చేస్తున్నాడని గుర్తించి పక్కా ప్రణాళికతో మంగళవారం అదుపులోకి తీసుకుని గుడివాడకు తీసుకొచ్చారు. నేడు వైద్యపరీక్షల అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.

## మాజీ మంత్రి పేర్నినాని సతీమణికి మరోసారి నోటీసులు




**అమరావతి:** మచిలిపట్నం ప్రైవేట్ గోదాం నుంచి రేషన్ బియ్యం మాయం కేసులో వైసీపీకి చెందిన నాయకుడు, మాజీ మంత్రి పేర్నినాని సతీమణి జయసుధకు పోలీసులు మరోసారి నోటీసులు అందజేశారు. నిన్న రాత్రి పోలీసులు పేర్నినాని ఇంటికి వెళ్లగా ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో గోడకు నోటీసు అంటించి వెళ్లిపోయారు.బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు బందరులోని ఆర్.పేట పోలీష్ స్టేషన్‌కు రావాలని నోటీసులో పేర్కొన్నారు. ఇదే కేసులో పేర్ని జయసుధకు కోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చింది. బెయిల్ మంజూరు సందర్భం గా పోలీసుల విచారణకు సహకరించాలని జడ్జి ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే నలుగురిని విచారించి అదుపు లోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. నిన్న పేర్నినానిపై ఏ- 6 నిందితుడని పోలీసులు తాజాగా కేసు నమోదు చేయగా ఏపీ హైకో ర్టులో లంచ్ మోషన్‌లో పేర్నినాని ముందస్తు పిటిషన్ దాఖలు చేశారు. పరిశీలిం చిన కోర్టు ఈ కేసులో నానిపై వచ్చే సోమవారం ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

## చిత్తూరు జిల్లాలో జల్లికట్టు ప్రారంభం : ఒకరికి తీవ్రగాయాలు



**అమరావతి:** సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించే జల్లికట్టు సంబరాలు ఏపీలో ముందుగానే ప్రారంభమయ్యాయి. బుధవారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రారంభం కాగా నెలరోజుల పాటు కొనసాగ నున్నాయి. తమిళనాడు సంస్కృతిలో భాగమైన జల్లికట్టు సమీప జిల్లాల వాసులు కూడా కొన్నేళ్ల నుంచి జల్లికట్టు ప్రారంభించారు. ప్రతి యేట జనవరి 1వ తేదీన ఘనంగా నిర్వహించి ప్రతిరోజు సంబరాలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గ బైరెడ్డిపల్లి మండలం గౌనీతిమ్మేపల్లి గ్రామంలో కోడెద్దుల పరుగు పందెంను(జల్లికట్టు) తిలకించడానికి గ్రామస్థులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఎద్దులను పరుగుకు వదిలే ముందు వాటి కొమ్ములకు బహుమతులు కట్టి వదులుతారు. కొమ్ములకు కట్టిన బహుమతులను లాక్కోవడం కోసం ప్రాంగణంలో యువత పోటీ పడుతుంటారు. ఇందులో భాగంగా బుధవారం నిర్వహించిన జల్లికట్టులో ఎద్దులను ఆపే క్రీడల్లో భాగంగా ఒక యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందజేస్తున్నారు. ఈ సంబరాలకు నిర్వాహకులతో పాటు స్థానిక అధికారులు, పోలీసులు, ప్రభుత్వం కూడా అన్ని రకాల ఏర్పాట్లు చేసింది.

## కాణిపాకంలో భక్తుల రద్దీ.. బాదం పాలు, బిస్కెట్ల పంపిణీకి శ్రీకారం



**అమరావతి :** చిత్తూరు జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాణిపాకంలో ఆలయ అధికారులు భక్తుల కోసం వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. క్యూలైన్లలోని భక్తులకు బిస్కెట్లు, బాదంపాలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని నూతన సంవత్సరం సందర్భంగా ఆలయ ఈవో పెంచల కిషోర్ ప్రారంభించారు. ఇకపై ప్రతినిత్యం వీటిని పంపిణీ చేస్తామని ప్రకటించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు గంటల తరబడి క్యూ లైన్‌లలో నిలబడి అలసిపోయే అవకాశముందని, వారి సౌకర్యం కోసం నూతన విధానాన్ని ప్రారంభించామని ఈవో పేర్కొన్నారు. న్యూ ఇయర్ సందర్భంగా స్వామివారిని దర్శించుకోడానికి భక్తులు భారీగా తరలివచ్చారు. స్థానిక పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ స్వామివారిని దర్శించుకుని ఏర్పాట్లను పరిశీలించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఉచిత దర్శనంతో పాటు రూ.100, రూ.150 దర్శన క్యూలైన్లను ఏర్పాటు చేశామని ఈవో పేర్కొన్నారు.

## కూటమి ప్రభుత్వంతో

# భవిష్యత్‌పై భరోసా

- తప్పుచేసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టం
- 2024 చరిత్ర తిరగరాసిన సంవత్సరం
- అమరావతితో సినిమా రంగానికి మంచిరోజులు
- మీడియా ఇష్టాగోష్టిలో సిఎం చంద్రబాబు



**అమరావతి:** ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై మంచి అభిప్రాయం ఉంది. ప్రజల ఆలోచనలు, అవసరాల మేరకు పాలనా విధానాలను మార్చుకుం టున్నాం. అధికారులు కూడా ప్రజల ఆకాంక్షల మేరకు పనితీరు మార్చుకోవాలని సిఎం చంద్ర బాబు అన్నారు. 2024.. చరిత్ర తిరగరాసిన సంవత్సరమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నా రు. గత ఐదేళ్లు ప్రజలు పడిన ఇబ్బందులకు విముక్తి కలిగిందని, ఇదే సమయంలో మీడియా కూడా ఇబ్బంది పడిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అందరికీ భవిష్యత్తుపై భరోసా వచ్చిందని పేర్కొన్నారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాల యంలో మీడియా ప్రతినిధులతో చంద్రబాబు ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. కొందరు అధికారులు జగన్ మాటలు విని పనిచేశారని పేర్కొన్నారు. జగన్.. చివరకు అధికారులను కూడా గత ఐదేళ్లు బురద గుంతలో తోసేశారని విమర్శించారు.' ఎమ్మెల్యేలకు దశలవారీగా కౌన్సిలింగ్ ఇస్తున్నా. తప్పుడు పనులు చేయొద్దని వారిని పదేపదే హెచ్చరిస్తున్నా. సమాజానికి హానికరమైన వారిని మాత్రం వదిలేది లేదు. గతంలో రౌడీయిజం, మతకలహాలను అణచివేసినట్లే ఇప్పుడూ చేస్తాను. కొన్ని అంశాల్లో పార్టీ శ్రేణులు, నా అభిప్రాయాల్లో తేడా ఉంటోంది. కొందరు కార్యకర్తలు తమ అజెండాను నేను అమలు చేయాలని అనుకుం టున్నారు. జగన్ మాదిరిగా మేమూ తప్పులు చేస్తే ఎలా.. ప్రజలన్నీ గమనిస్తూనే ఉంటారు. నాకు నా ప్రజలే హైకమాండ్. తప్పు చేసిన ఏ ఒక్కరినీ వదిలి పెట్టేది లేదు. గత విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు శ్రమిస్తున్నాం అన్నా రు. కొత్త సంవత్సరం ప్రారంభంతోనే.. ప్రత్య ర్థులకు సరికొత్త వార్నింగ్ ఇచ్చారు. ఇక ఆట మొదలైందని.. ఎవరినీ వదిలిపెట్టబోనని స్పష్టమైన ప్రకటన చేశారు. బుధవారం నాడు మీడియాతో మాట్లాడిన సీఎం చంద్రబాబు.. తాను జైలు నుంచి బయటకు వచ్చిన వెంటనే కొంతమందికి మిసరబుల్ ట్రీట్‌మెంట్ ఉంటుందని అన్నానని గుర్తు చేశారు. ఆ మాటకు కట్టుబడి ఉన్నాన న్నారు. అయితే, తాను రాజకీయ కక్ష తీర్చుకో బోనని.. తప్పు చేసిన వారిని మాత్రం వదిలిపెట్టే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. 1995 సీఎంను త్వరలో మీరే చూస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. 'ఇక గేమ్ స్టార్ట్ అయ్యింది. సోషల్ మీడియా వ్యవహారంలో మీరు చూశారు కదా. మిగతా కేసులు కూడా అలానే డీల్ చేస్తాను. కేడర్ ఉద్దేశ్యం ఒకలాగా ఉంది. నా లక్ష్యం వేరుగా ఉంది. ఎందుకంటే.. నేను అందరి అభిప్రాయాలు తీసుకోవలి. అవతలి వాళ్లు చేసినట్లు నేను చేయను. చట్టం, న్యాయం ప్రకారం చేస్తాను. నేను ఎవరినీ వదిలి పెట్టే ప్రసక్తే లేదు.' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. 'మా కేడర్, నాయకులు లేదా అధికారులు ఎవరు తప్పు చేసినా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుంది. ఇప్పటికే ఎమ్మెల్యేలను పిలిచి అందరితో మాట్లాడుతున్నాను. అందరినీ కరెక్ట్ చేస్తాను. అలాగే కలిసి ముందుకు వెళ్తాను. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా టీడీపీ గెలిచేలా ఉండాలి. 2004 లో నన్ను ఎవరూ ఓడించలేరు. హైదరాబాద్‌ను ఎన్నడూ లేని విధంగా డెవలప్ చేశాను. కానీ, ప్రజలకు ఈ విషయాన్ని కమ్యూనికేట్ చేయలేకపోయాను. ఇప్పుడు ప్రజలకు చెప్పి మనం ముందుకు తీసుకెళ్లాలి.' సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. గతంలో మా పార్టీ నేతలను హతమార్చారు. జగన్ హయాంలో మా పార్టీ వాళ్ళు బాగా ఇబ్బంది పడ్డారు. అందరినీ మేము చాలావరకు సర్దుబాటు చేస్తున్నాము. అందరికీ పదవులు ఇవ్వలేం కదా. ఈ సారి జాగ్రత్తగా ఉన్నాము. అందరు అభిప్రాయాలు తీసుకుంటాను. నేను సభ్యత్వం, పదవులు పంపిణీ మీద అన్ని క్రాస్ చెక్ చేసుకుంటున్నాను. నా ఓన్ మెకానిజమ్ నాకు ఉంది. అందుకే ప్రతి విషయం క్రాస్ చేసుకుంటున్నాను. గంతలోలా నేను లేను. అన్ని విషయాలు నేను చూసుకుంటున్నాను.' అని సీఎం చంద్రబాబు తెలిపారు. దీపం, నాలుగు వేలు పెన్షన్ పథకాలను అమలు చేస్తున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు. 'కేంద్ర ప్రభుత్వానికి కూడా లిమిటేషన్స్ ఉంటాయి కదా. నేను ప్రజలను అభినందిస్తున్నాను. వాళ్లు ఇచ్చే సహకారం నేను మరువను. వాళ్లకు జరిగే దానిపై సంతృప్తి ఉంది. భవిష్యత్‌పై ఆశ ఉంది. వాళ్ల హోప్స్‌కి మేము రీచ్ కావాలి.' అని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రస్తుతం సినిమాలకు హైదరాబాద్ హబ్‌గా మారింది. తెదేపా ప్రభుత్వం కల్పించిన అవకాశాల కారణంగానే ఇదంతా సాధ్యమైంది. సినిమాలకు ఓవర్సీస్ మార్కెట్ బాగా పెరిగింది. అమరావతి నిర్మాణం పూర్తయితే.. సినిమాలన్నీ ఇక ఏపీలోనే నిర్మించేందుకు అవకాశం ఉంటుంది. అమరావతిలో సినిమాలకు మంచి మార్కెట్ ఉంటుంది' అని చంద్రబాబు తెలిపారు.

## శ్రీశైలంలో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం



**శ్రీశైలం:** శ్రీశైలం దేవస్థానం పరిధిలో రహదారి నిర్మాణ పనులు బుధవారం ప్రారంభం అయ్యాయి. దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం శ్రీనివాసరావు సంప్రదాయబద్ధంగా పూజాదికాలు జరిపి ఈ రహదారి పనులు ప్రారంభించారు. గంగాధర మండపం నుంచి నందిగుడి వరకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ప్రస్తుతం ఉన్న 30 అడుగుల రహదారిని ఇరు వైపులా 15 అడుగులు విస్తరించి మొత్తం 60 అడుగుల వెడల్పుతో ఈ రహదారి నిర్మిస్తున్నారు. ఈ రహదారి పనులు పూర్తికాగానే ఇరువైపులా ఫుట్‌పాత్‌లు నిర్మిస్తారు. వచ్చేనెలలో ప్రారంభమయ్యే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు, ఉగాది మహోత్సవాలలో జరిగే రథోత్సవాన్ని భక్తులు తిలకించేందుకు వీలుగా 60 అడుగుల విస్తీర్ణంతో ఈ రోడ్డు నిర్మిస్తున్నారు. రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కాగానే రహదారికి ఇరువైపులా సుందరీకరణ పనులు కూడా చేపడతారు. రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభ కార్యక్రమంలో స్వామివారి ఆలయ ప్రధానార్చకులు హెచ్. వీరయ్యస్వామి, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఎం. నరసింహారెడ్డి, ఇంచార్జి డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు పీ చంద్రశేఖరశాస్త్రి, సహాయ ఇంజనీరు సీతారమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సంపద బదులు..అప్పులు సృష్టిస్తున్నారు

### ట్విటర్‌లో కూటమిపై వైసీపీ ఆరోపణ



**అమరావతి:** ఏపీలో సంపదను సృష్టించి పేదవారికి పంచిపెడుతామని కూటమి ఇచ్చిన హామీపై వైసీపీ తీవ్ర విమర్శలు చేసింది. ఆరునెలల క్రితం చంద్రబాబు అధికార పగ్గాలు చేపట్టి సంపద బదులు అప్పులు మాత్రం సృష్టిస్తున్నారని ట్విటర్‌లో వైసీపీ ఆరోపించింది. ప్రతివారం అప్పు తెస్తే తప్ప పూట గడవని పరిస్థితికి రాష్ట్రాన్ని తీసుకొచ్చారని మండిపడింది. ఎడా పెడా అప్పులు చేస్తూ డబ్బును తమకు లాభం కలిగించే పనులకోసం మళ్లిస్తున్నారని, బాబును నమ్మి మోసం పోవడం ప్రజలకు ఇది నాలుగోసారని ఎద్దేవా చేసింది. అన్ని పథకాలనూ మింగేసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ కొండ చిలువలా సైలెంట్ గా ఉంటున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు కోట్లకు పడగలెత్తి ప్రజలను రోడ్డున పడేశారని ఆరోపించారు. ఆరు నెలలు గడిచిపోయాయి. సూపర్ సిక్స్ లో ఏ పథకం జాడలేదని వైసీపీ విమర్శించింది. విద్యాసంస్కరణల పేరుతో పేద పిల్లలకు ఇంగ్లీష్ మీడియం విద్యను దూరం చేస్తుందని మండిపడింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ఎత్తేస్తూ తెలుగు మీడియంలోనే బోధన కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించడం పేద పిల్లల పాలిట అశనిపాతంలా మారిందని వైసీపీ ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయం వల్ల ఇక డబ్బున్నోళ్లకే వైద్య విద్య అందుతుందని, పేదింటి బిడ్డలు డాక్టర్లు కాకుండా కుట్ర చేస్తుందని ఆరోపించింది.

# ప్రజాదరణ పొందిన పార్టీ కాంగ్రెస్

- నూతన ఒరవడితో ప్రజా సంక్షేమం
- జిల్లా మాజీ కాంగ్రెస్ నాయకులు గురజాల గోపి వెల్లడి





**మణుగూరు, జనవరి 1(నినాదం న్యూస్) :** గడిచిన ఏడాది కాలంలో తెలంగాణలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు దగ్గరవుతూ ప్రజాదరణ పొందిందని ఆ పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ కాంగ్రెస్ నాయకులు గురజాల గోపి స్పష్టం చేశారు. బుధవారం ఉదయం తన గృహంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకొని ఆ తర్వాత విలేకరులతో మాట్లాడుతూ....... రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత అత్యంత దమనీయ పరిస్థితుల్లో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని కైవసం చేసుకోవడం జరిగిందని ఆయన అన్నారు. ధనిక రాష్ట్రంగా పేరు ఉన్న తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం నిర్వహకంతో అప్పులు కుప్పలు తెప్పలుగా మిగిలిపోయాయని అని అన్నారు. ఇప్పుడిప్పుడే రేవంత్ రెడ్డి ప్రభుత్వము రాష్ట్రాన్ని గాడిలో పెట్టి ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు వ్యూహరచన చేస్తున్నారని ఆయన అన్నారు. అలాగే ఉమ్మడి రాష్ట్రం లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలను అభివృద్ధి దిశగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ దేనిని ఆయన అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాల అభివృద్ధి కోసం ప్రస్తుత రాజ్యసభ సభ్యురాలు, మాజీ కేంద్రమంత్రి రేణుక చౌదరి అలాగే జిల్లా డిసిసి అధ్యక్షులు రాష్ట్ర అటవీ సంక్షేమ శాఖ చైర్మన్ పొడెం వీరయ్య వారు చేసిన సేవలకు ముందుగా అభినందనలు తెలిపారు. ఇప్పటి కొత్తగూడెం జిల్లా పాల్వంచ ప్రాంతంలో అనేక సంవత్సరాలుగా ఉన్న స్పాంజి ఐరన్ ఫ్యాక్టరీని అప్పుడు కేంద్ర మంత్రిగా ఉన్న రేణుక చౌదరి ఎన్ఎండిసి లో కలిపి వందల మంది కార్మికులకు ఉపాధి కల్పించారని ఆయన అన్నారు. ఇప్పటికీ రెండు జిల్లాల్లో అనేక సమస్యలతో ఉన్నాయని సమాచారంతో ఆమె కఠోర దీక్ష చేసి రెండు జిల్లా వాసులకు న్యాయం చేసే విధంగా వ్యవహరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రేణుక చౌదరి చేసిన సేవలు శిరస్మరణీయంగా ఉన్నాయని ఈ రెండు జిల్లాల ప్రజలు ఆమె సేవలను మర్చిపోలేరని అని అన్నారు. అలాగే రెండు జిల్లాల్లో ఆమె మొదటి నుంచి ఫైర్ బ్రాండ్ గా పేరు తెచ్చుకున్నారని సమస్య ఉంటే కఠోర దీక్ష చేసిన సాధిస్తుందని ఆయన అన్నారు. ప్రజలకు ఏదైనా సమస్య వస్తే అది నెరవేర్చే వరకు ఆమె నిద్ర హారాలు మానేస్తుందని ఆమె పట్టుదల దీక్ష రెండు జిల్లాలు ప్రజలు మర్చిపోలేరని ఆయన అన్నారు. ముఖ్యంగా పినపాక నియోజకవర్గం లో అనేక సమస్యలు తిష్ట వేసి ఉన్నాయని వాటిని కూడా పరిష్కరించడంలో స్థానిక ఎంపీ బలరాం నాయక్ రేణుక చౌదరి ఆధ్వర్యంలో ఒక ప్రణాళికను సిద్ధం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే మణుగూరు మున్సిపాలిటీలో అనేక సంవత్సరాలుగా సమస్యలతో కొట్టుమిట్లు ఆడుతుందని ఆయన అన్నారు. 2005 సంవత్సరంలో మణుగూరు మేజర్ గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీగా అవతరించిందని ఆయన అన్నారు. కానీ 20 సంవత్సరాలు గడిచిపోతున్న వన్ ఆఫ్ సెవెంటీ యాక్ట్ పరిధిలో ఉన్న మణుగూరు కి ఎన్నికలు నిలుపుదల చేయమని గతంలో హైకోర్టు తీర్పు ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఆ తీర్పుతో ఇప్పటివరకు మణుగూరు మున్సిపాలిటీలో ఎన్నికలే జరగలేదని అని పేర్కొన్నారు. దీంతో మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రజలు స్థానిక సంస్థల్లో ఎన్నికల పోరు లో పాల్గొనకుండా అడ్డంకిగా మారి ఉన్నట్లు ఆయన అన్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని ఎంపీ బలరాం నాయక్ రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి దృష్టికి తీసుకొని వెళ్ళామని దీనికి త్వరలో శాశ్వత పరిష్కారం చూస్తామని హామీ ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. మణుగూరు మున్సిపాలిటీ నుంచి మేజర్ జీపీగా మారిస్తేనే ప్రజల ఆకాంక్ష నెరవేరుతుందని, దీంతో ప్రజలు కూడా అధిక భారం నుంచి ఉపశమనం కలుగుతుందని ఆయన అన్నారు.

## మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

- కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు ఇందుకుమార్



**ఆళ్లపల్లి, జనవరి 1 (నినాదం న్యూస్):** ఆళ్లపల్లి మండల ప్రజలకు ప్రజాప్రతి నిధులకు, అధికారులకు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ఓ ప్రకటనలో కాంగ్రెస్ పార్టీ మండల యువజన నాయకులు ఇనుముల ఇందు కుమార్ నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నూతన సంవత్సరంలో సంతోషంగా పిల్లాపాపలతో కుటుంబ సమేతంగా అందరూ నూతన సంవత్సర సంబరాలు జరుపుకోవాలని కోరారు.

## నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న మల్లిబాబు యాదవ్



**ఖమ్మం, జనవరి01( నినాదం న్యూస్):** ఖమ్మంలో రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయంలో కార్యాలయఇన్చార్జి తుంబూరు దయాకర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఏడాదిలో ప్రతి ఒక్కరి స్వప్నం సహకారం కావాలని, యువత, మహిళలు, రైతులు, నిరుద్యోగుల జీవితాల్లో కొత్త వెలుగులు రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఖమ్మం ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధిలో నూతన సంవత్సరంలో జిల్లాప్రజలందరికీ మంచి జరగాలని, సుఖ సంతోషాలతో జీవించాలని ఆయన అన్నారు. అనంతరం పండితాపురం గ్రామంలో కేక్ కట్ చేసి గ్రామ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపినారు. ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బానోత్ నరసింహ నాయక్ షేక్ పతే మహమ్మద్ ఒంటికొమ్ము శ్రీనివాసరెడ్డి మేకపోతుల మహేష్ గౌడ్ అంబడిపూడి సత్యనారాయణ. శీలం పుల్లయ్య. ధరావతులాలు బాదవుత నాగరాజు, గుగులోతు రవి. బండి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు

# నేలమట్టమైన కగార్ ఆపరేషన్ ?

- గత ఏడాది మావోలుకు కలిసి రాని కాలం
- వరుస ఎన్‌కౌంటర్లు, లొంగుబాటులతో భారీ నష్టం
- గిరిజనులకు దూరమైన మావోయిస్టులు



**మణుగూరు, జనవరి1(నినాదం న్యూస్) :** నాలుగు దశాబ్దాల కాలం సుదీర్ఘ పోరాటం చేసిన సిపిఐ మావోయిస్టు పార్టీ మనుగడ కోల్పోయి, వాళ్ళ కగార్ ఆపరేషన్ నేలమట్టమైంది. ఇప్పుడు వరకు పడి లేచే కెరటం లాగా కొనసాగిన మావోయిస్టు నక్సల్స్, ఆ పరిస్థితిని వీడిపోయినట్లు తెలుస్తుంది. నాలుగు దశాబ్దాల కాలం పోరాటంతో పోలిస్తే గత ఏడాది మావోయిస్టులకు కలిసి రాని కాలంగా మారింది. చత్తీస్గడ్ ఒరిస్సా తెలంగాణ రాష్ట్రంలో వరుస ఎన్కౌంటర్లో వందల మంది ప్రాణాలు కోల్పోయారు. ఇందులో కింది స్థాయి నుంచి అగ్రనేతుల వరకు ఉండటం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేస్తుంది. దీంతో మనుగడ కోల్పోయినట్లు గ్రహించిన కొంతమంది మావోయిస్టు నక్సల్స్ లొంగుబాట్లు బాట పట్టారు. దీంతో పార్టీకి ఆయువు పట్టు లాంటి డిసిసిలు డీసీఎంలు అగ్ర నేతలు వరకు కోల్పోవడం పార్టీ కోల్కొని దెబ్బ తగిలింది. ఇప్పటివరకు మూడు రాష్ట్రాల్లో దండకారణ్య గిరిజనుల ప్రాబల్యంతో అనేక కగార్ ఆపరేషన్లు మెరుపు దాడులు, క్లైమోర్ బాంబులు క్లస్టర్ బాంబులు రాకెట్ లాంచెస్ తో శత్రు సైన్యాన్ని దీటుగా ఎదుర్కొంది. ఇప్పుడు పరిస్థితి తారుమారు కావడంతో ఆయుధాలు కూడా ఉపయోగించ లేని పరిస్థితికి భద్రత బలగాలు మావోయిస్టులకు కంటిమీద కునుకు లేకుండా చేశాయి. ముఖ్యంగా చత్తీస్గడ్ దండకారణ్యంలో ప్రతి ఐదు కిలోమీటర్లకు పోలీస్ క్యాంపులను నిర్మించి మావోయిస్టులకు ఊపిరాడకుండా చేశారు. దీంతో గత ఏడాది సుమారు 200 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు చత్తీస్గఢ్ ప్రభుత్వ అధికారులు వెల్లడించారు. అక్కడ నుంచి సేఫ్ జోన్ గా ఎన్నుకున్న ఉత్తర తెలంగాణ జిల్లాలో కాలుమోపిన మావోయిస్టులకు భారీ ఎదురు దెబ్బ తగిలింది. ఇక్కడ కూడా లచ్చన్న దళం నరసన్న దళం మొత్తం ఎదురు కాల్పుల్లో మృతి చెందడం భారీ నష్టం జరిగింది. గతంలో రెండు రాష్ట్రాల్లో కూడా పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. అప్పట్లో ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న గిరిజనులు మావోయిస్టులను అక్కున చేర్చుకున్నారు. ఇప్పుడు మావోయిస్టులే పోలీసు ఫార్మర్లుగా భావించి అనేక మందిని కాల్చి చంపడం జరిగింది. దీంతో గిరిజనుల మద్దతును మావోయిస్టు పార్టీ కోల్పోయింది. పోలీసులు కూడా మావోయిస్టులు కనుగుణంగా గ్రే హౌండ్స్ బలగాలు సిఆర్పిఎఫ్ దళాలు ఆపరేషన్తో మావోయిస్టు పార్టీకి మనుగుడా లేకుండా చేశాయి. మావోయిస్టులు రెండు రాష్ట్రాల సరిహద్దు అడివి ప్రాంతాల్లో దాసి ఉంచిన డంపులను సైతం పోలీసులు అత్యంత చాకచక్యంగా నిర్వీరామము చేశారు. దీంతో ఉన్న మావోయిస్టు పార్టీ కార్యకర్తలకు ఆయుధ కొరత ఏర్పడింది. అలాగే మిలిటెంట్ వ్యవస్థ పై ఉక్కు పాదం మోపింది సహకరించేవాడు లేక ఉక్కిరిబిక్కిరే అయిపోతుంది. ఇది ఇలా ఉంటే మావోయిస్టు పార్టీలో సీనియర్ నాయకుల కు వయోభారం మీద పడడంతో అనేకమంది సేఫ్ జోన్లు తలలు దాచుకుంటున్నట్లు సమాచారం. కింది క్యాడర్లో సమన్వయం లేకపోవడంతో పోలీసు దాడుల్లో ప్రాణాలు కోల్పోతున్నట్లుసమాచారం. ముఖ్యంగా మావోయిస్టు పార్టీలో ఆదాయ మార్గాలపై పోలీసులు ఉక్కు పాదం మోపటంతో నిధులు లేని స్థితిలో పార్టీ కొట్టుమిట్లు ఆడుతున్నట్లు సమాచారం. ఇప్పటికే పోలీసులు రెండు రాష్ట్రాల్లో లొంగిపోయిన నక్సల్స్ కు భారీగా నజరానా ప్రకటిస్తూ వారికి ఉపాధి కల్పించడంతో, నక్సల్స్ పార్టీలో ఉన్న వారంతా పైనుంచి కిందికి వరకు ఆలోచనలో పడినట్లు సమాచారం. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం 2026 నాటికి దేశంలో మావోయిస్టు పార్టీని పూర్తిగా నిర్మూలిస్తామని ప్రకటించడం దీనికి ఆద్యం పోసినట్ల అవుతుంది. కాగా ఇప్పటికే మావోయిస్టు పార్టీలో అగ్ర నాయకులంతా అనేక రకాల వ్యాధులతో బాధపడుతున్నట్లు ఇంటిలిజెన్స్ వర్గాల సమాచారం బట్టి తెలుస్తుంది. కాగా 2026 నాటికి మావోయిస్టు పరిస్థితి ఏ విధంగా ఉంటుందో వేచి చూడాల్సిందే.

## మంత్రి తుమ్మల కృషితో మండలం రూ.500 కోట్లతో అభివృద్ధి

- తాగు, సాగునీటి కొరతకు శాశ్వత పరిష్కారం
- సంక్రాంతి తర్వాత మంచుకొండలో మంత్రి ప్రారంభోత్సవం
- వచ్చే పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి
- మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్





**ఖమ్మం, జనవరి01(నినాదం న్యూస్):** రాష్ట్రంలోనే రఘునాధపాలెం మండలాన్ని ముందంజలో ఉంచేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విశేష కృషి చేస్తున్నారని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మానుకొండ రాధా కిషోర్ అన్నారు.బుధవారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయుటకు ఖమ్మం లోని తన నివాసానికి మండల కాంగ్రెస్ నాయకులు తరలివచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కాంగ్రెస్ కుటుంబానికి తాను అండగా ఉంటానని, ఎవరు ఆందోళన చెందకుండా కాంగ్రెస్ పార్టీ కోసం కృషి చేయాలని అన్నారు.ఖమ్మం నుండి గెలుపొందిన తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర మంత్రిగా మనకి అందుబాటులో ఉన్నారనిఅన్నారు.అభివృద్ధి పనులు చేసే వ్యక్తిగా రాష్ట్రంలో పేరుపొందిన ఏకై వ్యక్తి తుమ్మల నాగేశ్వరావు అని అన్నారు. మన నియోజవర్గంలో ఒకే మండలం ఉందని, ఆ మండల అభివృద్ధికి ఇప్పటికే కోట్లాది రూపాయలు వచ్చిన అన్నారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించి సంవత్సరం పూర్తిందని,దీనిలో భాగంగామెడికల్ కాలేజీ,లిఫ్ట్ ఇరిగేషన్, గ్రామంలో మౌలిక వసతులు కు సుమారు 500 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని ఆయన గుర్తు చేశారు.మండలంలోతాగు, సాగునీటి కోసం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి మంచుకొండ గ్రామంలో లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయుటకు సనహాలు చేస్తున్నారని అని అన్నారు. ఈ పనుల ప్రారంభోత్సవానికి సంక్రాంతి తర్వాత రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తో కలిసి రావటం జరుగుతుందని అన్నారు. రైతులు వారి వారి పొలాల్లో పంటలు సాగు చేయుటకు వీలుగా, డొంక రోడ్లను కూడా డాంబరు లేదా సిసి రోడ్లు నిర్మించాలని మంత్రి తుమ్మల అధికారులుకు సూచించారని అన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్న తుమ్మల నాగేశ్వరరావు కు ప్రతి కాంగ్రెస్ కార్యకర్తఅండగా ఉండాలని అన్నారు. వచ్చే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రతి గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎదురెందుకు అందరూ సిద్ధంగా ఉండాలని అన్నారు. గ్రామాల్లో ఉండే కాంగ్రెస్ కార్యకర్తలు స్థానిక సమస్యలు గుర్తించాలని అన్నారు. ఆ విషయాలను మంత్రి దృష్టి తీసుకెళ్లి వాటిని అందరం కలిసి పరిష్కరించుకుందామని అన్నారు.

## మాజీ మంత్రి పువ్వాడకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



**ఖమ్మం, జనవరి01(నినాదం న్యూస్):** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మాజీ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కునాయకులు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం పువ్వాడ నివాసానికిరఘునాధపాలెంమండల టిఆర్ఎస్ నాయకులుపెద్ద మొత్తంలో తల్లి వచ్చారు. టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు అజ్మీర వీరు నాయక్ ఆధ్వర్యంలో మాజీ మంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



**ఆళ్లపల్లి, జనవరి 1 (నినాదం న్యూస్):** నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం అర్ధరాత్రి వరకు క్రైస్తవ భక్తులందరూ సిఎస్ఐ, ఆర్సిఎం చర్చిలతో పాటుగా పెంతుకోస్తు చర్చిలలో పరిశుద్ధ మరియమ్మ మాతృత్వవేడుకను, ఏసుప్రభుకు నామకరణం చేసినరోజును, నూతన సంవత్సర వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందని, ఆర్.సి.యం పునీత పౌల్, పేతురు దేవాలయ విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ కూరపాటి యాకోబు, సిఎస్ఐ పాస్టర్ గుజ్జర్లపూడి ఏసుపాదం అన్నారు. ఈ వేడుకలకు క్రైస్తవ భక్తులు నెలరోజులపాటు తమఇళ్లను సుందరీ కరణంగా తీర్చిదిద్దుతూ, నూతన దుస్తులను, పిండివంటలను తయారు చేసుకుంటూ, పేదలకు, అభాగ్యులకు, అనాధలకు, ఆర్థిక సాయం చేస్తూ, పుణ్యకార్యాలను చేయడంతో, వారి కుటుంబానికి మేలులు కలుగుతుందని, తలుస్తూ, దానధర్మాల మూలాన పుణ్యం వస్తుందని, ప్రత్యేక పూజలు నిర్వహించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఎస్ సిస్టర్స్ మేరీశాంతాల్, దామరిస్, మహిత, జ్యోతిర్మయి యానిమేటర్ పరమ ప్రభాకర్, సంఘ నాయకులు రాంబాబు, నాగేష్, రామ్మూర్తి, కన్నయ్య, సుధాకర్, చిరంజీవి, పరమ స్వామిదాస్, ప్రసాద్, బాబు, కర్కపల్లి చంటి, జ్ఞానానందం, శేఖర్, దాసు, లాజర్, బబ్లు, శ్రీనివాస్, యాకోబు, మరియు దళం మహిళా నాయకులు సులోచన, రుక్మిణి, రాజీ, మంగ, సునీత, అన్నపూర్ణ, లలిత, మమతా సునీత, మణెమ్మ, కౌసల్య, బాయమ్మ చిట్టెమ్మ విజ్జమ్మ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు అందుబాటులో ఉంటా..

- మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మానుకొండ



**ఖమ్మం, జనవరి01(నినాదం న్యూస్):** కాంగ్రెస్ పార్టీ కోసం కష్టించి పని చేసే ప్రతి కాంగ్రెస్ కుటుంబానికి తాను అందుబాటులో ఉండి, వారిని అన్ని విధాల ఆదుకుంటానని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మానుకోట రాధా కిషోర్ అన్నారు.బుధవారం ఖమ్మం నియోజవర్గ పరిధిలోని రఘునాధపాలెం మండల కాంగ్రెస్ నాయకులు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని వారి నివాసానికి వెళ్లి శుభాకాంక్షలును తెలియజేశారు. శుభాకాంక్షలు చెప్పిన వారిలో నాయకులు డీప్లా నాయక్,బండి నాగేశ్వరరావు,కోటేష్,తదితరులు ఉన్నారు.

## అయ్యప్పనామంతో మార్మోగిన కోదండ రామాలయం





**వైరా, జనవరి 01 (నినాదం న్యూస్):** వైరా నియోజకవర్గ కేంద్రంలోని శ్రీ కోదండరామ స్వామి దేవాలయంలో నూతన సంవత్సరం పర్వదినం సందర్భంగా అయ్యప్ప స్వామి పీఠం ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తులు అయ్యప్ప స్వామి కి సామూహిక సహస్రనామాలు వ్రతాలు అభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి శ్రీనివాసరావు మాట్లాడుతూ మాల ధరించిన అయ్యప్ప భక్తులు అయ్యప్ప స్వామికి వ్రతపూజలు సహస్రనామార్చన అభిషేకపూజలు నిర్వహించటం వలన మంచి శుభ ఫలితాలు అందుతాయని అన్నారు ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో గురుస్వాములు శ్రీరామనేని శ్రీనివాసరావు బాసాటి రామారావు అయ్యప్ప భక్తులు స్థానికులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత మాసోత్సవాలను ప్రారంభించిన ఎంవిఐ వరప్రసాద్




**వైరా, జనవరి 01 (నినాదం న్యూస్):** ప్రమాదాల నివారణకు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి రోడ్డు భద్రత మాసోత్సవాలను వైరాలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కార్యాలయం నందు ఎంవిఐ వరప్రసాద్ ప్రారంభించారు ఈ సందర్భంగా వాహన డ్రైవర్లకు ఆయన భద్రత వారోత్సవాల నేపథ్యంలో పలు సూచనలు చేసి అవగాహన ఏర్పాటు చేశారు. ప్రతి వాహనదారుడు వాహనాన్ని అతివేగంగా నడపవద్దని, ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలి, మద్యం సేవించి వాహనాల నడపవద్దని వాహనాలను ఓవర్టేక్ చేసే ముందు ఎదురుగా వస్తున్న వాహనాలను గమనించాలని ద్విచక్ర వాహనాలపై వెళ్లేటప్పుడు ఎలిమెంట్స్ కార్లు తోలేటప్పుడు షీట్ బెల్ట్ ను తప్పకుండా ఉపయోగించాలని మైనర్లు వాహనాలను తోలొద్దని ఆయన సూచించారు రోడ్డు భద్రత మాసోత్సవాల్లో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు ప్రమాదాలను అరికట్టేందుకు చేపట్టవలసిన జాగ్రత్తలను ఎంవిఐ వరప్రసాద్ వివరించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కార్యాలయం సిబ్బంది మరియు వాహనాల డ్రైవర్లు ఓనర్లు లారీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# విద్యా రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

• నర్సంపేట ఎమ్మెల్యే దొంతి



**నర్సంపేట, జనవరి 1(నినాదం) :** తెలంగాణా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగానికి పెద్ద పీట వేస్తుందని నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి తెలిపారు. చెన్నారావు పేట మండలం లోని అమీనాబాద్ గ్రామంలో నిర్మాణం చేయనున్న తెలంగాణా ఇంటిగ్రెటెడ్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం స్థలాలను అధికారులతో కలిసి ఎమ్మెల్యే దొంతి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ తర్వాత వరంగల్ లో ఐటీ ఇండస్ట్రీ అభివృద్ధికి అన్ని అనుకూలతలు ఉన్నట్టుగా నేషనల్ అసోసియేషన్ అఫ్ సాఫ్ట్ వేర్ అండ్ సర్వీస్ కంపెనీ (నాస్కమ్ )వెల్లడించిందన్నారు. నర్సంపేటలో ఇప్పటికే మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం నర్సంపేట లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నూతన సంహోత్సరం సందర్భంగా ఎమ్మెల్యే మాధవరెడ్డి ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నవతెలంగాణ, న్యూస్ 99 పత్రిక ల నూతన సంహోత్సరం క్యాలెండరు లను ఎమ్మెల్యే దొంతి ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమం లో పీసీసీ సభ్యులు పెండెం రామానంద్, నెక్కొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి,మొగిలి వెంకట్ రెడ్డి, యాకయ్య గౌడ్, తుమ్మల సందీప్, పురుషోత్తం నరేష్, నర్సంపేట, చెన్నారావుపేట, నల్లబెల్లి మండలాల అధ్యక్షులు బోనోత్ లక్ష్మణ్ నాయక్,గోపాల్ నాయక్, చిట్యాల తిరుపతి రెడ్డి,జిల్లా కార్యదర్శి మాలోతు రమేష్, నెక్కొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్,హింగే జర్నలిస్ట్ లు బూర వేణు గౌడ్, మహాదేవుని, హింగే చిరంజీవి పాల్గొన్నారు.

## మహాత్మా జ్యోతిబా పూలే నేషనల్ అవార్డు గ్రహీత ముంజాల రాజేందర్ గౌడ్‌కు ఘనంగా సన్మానం



**నర్సంపేట డిసెంబరు 31 (నినాదం న్యూస్ ) :** గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో నర్సంపేట లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సెంటర్ లో మంగళవారం మహబూబాబాద్ మోకు దెబ్బ జిల్లా అధ్యక్షులు బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కార్యదర్శి తెలంగాణ ఉద్యమ కారుడు మహాత్మా జ్యోతి బా పూలె నేషనల్ అవార్డు గ్రహీత ముంజాల రాజేందర్ గౌడ్ ను ఘనంగా సన్మానించారు. న్యూ ఢిల్లీ లో బహుజన సాహిత్య జాతీయ అకాడమీ వారు మహాత్మా జ్యోతి బా పూలె నేషనల్ అవార్డు ముంజాల రాజేందర్ గౌడ్ కు న్యూ ఢిల్లీ లో అవార్డు ఇవ్వడం జరిగింది. అవార్డు తీసుకున్నందున రాజేందర్ గౌడ్ కు మోకు దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్, వరంగల్ జిల్లా అధ్యక్షులు గోపగాని వెంకట్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బుడిగే మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ సన్మాన కార్యక్రమం లో మోకు దెబ్బ రాష్ట్ర నాయకులు మద్దెల సాంబయ్య గౌడ్ , సొల్తీ సారయ్య గౌడ్, మచ్చిక రాజు గౌడ్, గోడిశాల సదానందం గౌడ్, శీలం వీరన్న గౌడ్, కొండి రాము గౌడ్, ముంజాల సంజీవగౌడ్ , హన్మకొండ జిల్లా అధ్యక్షులు తోటకూరి రాందాస్ గౌడ్ , వరంగల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పంజాలా వెంకట్ గౌడ్, కందుల శ్రీనివాస్ గౌడ్, బూర హేమచేందర్ గౌడ్, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మండల నాయకులు పాల్గొన్నారు

## 38వ రోజుకు చెరిన నిత్య అన్నప్రసాద కార్యక్రమం



**చౌటుప్పల్ జనవరి 1(నినాదం న్యూస్) :** దండు మల్కాపురం గ్రామంలో శ్రీ కంఠమహేశ్వర స్వామి దేవాలయం వద్ద అయ్యప్ప స్వాములకు నిత్య అన్నదాన కార్యక్రమం మీసాలరవి,నెల్లికంటి, హరిప్రసాద్,దేప శ్యాంసుందర్ ముదిరాజ్ ముదిగొండ మహేష్ చే నిర్వహించడం జరిగింది. బుధవారం 38వ రోజు అయ్యప్పస్వామి భక్తులు కు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా శ్యాంసుందర్ మాట్లాడుతూ 2025 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఇరు తెలుగు రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సరం సందర్భంగా దేప శ్యాంసుందర్ కి అయ్యప్ప స్వాములు ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆకుల ఉప్పలయ్య,గౌడ్,గుర్రం పోచయ్య ఊదరి లింగస్వామి, ముదిగొండ వెంకటేష్,పల్లెకాడు దర్శన్,శ్రీపతి కేశవులు,దోనూరి మల్లారెడ్డి,దౌడి లింగస్వామి,బుర్ర శివ కుమార్ మహంకళి రాజేష్ ఖన్నా,ఊదరి తిరమలేష్ పిల్లి లింగస్వామి, గురువయ్య, బ్రహ్మయ్య, సోమరాజు, చింటుకుమార్,మహేష్,ప్రకాష్,మణి, సాయి,శశి తదితర అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

## మోకుదెబ్బ నూతన సంవత్సర క్యాలెండరర్ ఆవిష్కరణ



**నర్సంపేట, డిసెంబరు31 (నినాదం న్యూస్ ) :** వరంగల్ జిల్లా నర్సంపేట పట్టంలోని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం వద్ద గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ నూతన సంవత్సరం 2025-26 క్యాలెండరు ను మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ మంగళవారం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ గౌడ కులస్తుల ఐక్యత కోసం మోకుదెబ్బ సంఘం కృషి చేస్తుందన్నారు. రాజకీయాలకు అతీతంగా ఆర్థిక, రాజకీయంగా గౌడ్ లు ఎదిగేందుకు పాటుపడుతుందన్నారు. రాబోయే స్థానిక సంస్థలలో గౌడ కులస్తులు పోటీ చేసి తమ సత్తా చాటాలని రమేష్ గౌడ్ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం సొల్తీ సారయ్య గౌడ్, మోకుదెబ్బ రాష్ట్ర ప్రచార కార్యదర్శి గోడిశాల సదానందం గౌడ్, వరంగల్, హన్మకొండ మహబూబాబాద్ జిల్లా ల అధ్యక్షులు గోపగాని వెంకట్ గౌడ్, తోటకూరి రాందాస్ గౌడ్, ముంజాల రాజేందర్ గౌడ్,రాష్ట్ర నాయకులు రామగోని సుధాకర్ గౌడ్ , శీలం వీరన్న గౌడ్ , మద్దెల సాంబయ్య గౌడ్, మచ్చిక రాజు గౌడ్, రడం శ్రీనివాస్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు బుడిగే మల్లేశం గౌడ్, కొండి రాము గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పంజాల వెంకట్ గౌడ్, జేఏసీ నాయకులు వేముల రవి గౌడ్ , వల్లుల రవీందర్ గౌడ్ , జిల్లా కోశాధికారి మర్ద గణేష్ గౌడ్, యూత్ అధ్యక్షులు మర్ద సతీష్ గౌడ్, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాంపల్లి వెంకట్ గౌడ్, చెన్నారావుపేట, దుగ్గొండి అధ్యక్షులు గోడిశాల మల్లయ్య గౌడ్ , తడుక కొమురయ్య గౌడ్, ముంజాల సంజీవ్ గౌడ్ , సోషల్ మీడియా మండలం అధ్యక్షులు తాళ్లపెల్లి రాము గౌడ్ , సొల్తీ సాంబయ్య గౌడ్, గుండెబోయిన శివకోటి గౌడ్ , నాగరాజు గౌడ్ , గోడిశాల గిరినాద్ గౌడ్ , ఊడ్గుల సునిల్ గౌడ్, రాకేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య


• విద్య ద్వారానే సమాజంలో మార్పు
• విద్యార్థులతో మంత్రి ఉత్తమ్ ముఖాముఖి.. అనంతరం వారితో కలిసి భోజనం
• మైనార్టీ పాఠశాలలో పలు మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు






**కోదాడ, జనవరి 1 ( నినాదం న్యూస్):** పేద వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధానమైన లక్ష్యం అని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు....బుధవారం కోదాడ లోని ముస్లిం మైనార్టీ బాలికల పాఠశాలను కోదాడ శాసన సభ్యురాలు నల్లమాద పద్మావతి రెడ్డి, రాష్ట్ర పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి లతో కలిసి రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకి అంతర్జాతీయ స్థాయిలో విద్యను అందించటం ప్రజా ప్రభుత్వం లక్ష్యం అన్నారు. పాఠశాలలో వాస్తవ పరిస్థితులు తెలుసుకునేందుకు ఇక్కడికి రావటం జరిగిందని సమాజం లో విద్య ద్వారానే గుర్తింపు వస్తుంది కాబట్టి మా ప్రజా ప్రభుత్వం విద్య పై ప్రత్యేక శ్రద్ధ పెట్టినాము అని ప్రతి నియోజకవర్గం లో 200-300 కోట్ల రూపాయలతో అంతర్జాతీయ స్థాయి లో యంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామని, స్కిల్ యూనివర్సిటీ తో పాటు స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని రాబోయే కాలంలో తెలంగాణ రాష్ట్ర అక్షరాస్యత 100 శాతానికి చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. మా ప్రభుత్వం లో సాంఘీక న్యాయం చేకూర్చేందుకు అన్ని వర్గాలకు లబ్ది చేకూర్చుతున్నామని తెలిపారు. ఈ నూతన సంవత్సరం విద్యార్థులతో జరుపుకోవటం చాలా ఆనందంగా ఉందని, గత రాత్రి హుజూర్ నగర్ ఎస్ సి సంక్షేమ బాలుర పాఠశాల విద్యార్థులతో భోజనం చేసానని, ఉదయం హుజూర్ నగర్ సబ్ జైలు ఖైదీలను కలిసి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నానన్ని అలాగే మధ్యాహ్నం మైనారిటీ బాలికల పాఠశాలకి వచ్చి విద్యార్థులతో ముఖాముఖీ అవుతు భోజనం చేయటం చాలా ఆనందంగా ఉందని మంత్రి తెలిపారు. రాష్టంలోని ఎస్ సి, ఎస్టీ,బిసి, మైనార్టీ లకి చెందిన 6 లక్షల మంది విద్యార్థుల సంక్షేమం కొరకు వారిలో విద్య ప్రమాణాలు, పోషకాలు పెంచేందుకు ప్రభుత్వం పై 600 కోట్ల భారం పడిన 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచామని తెలిపారు. రేపటి దేశ భవిష్యత్ నేటి విద్యార్థులపైననే ఆధారపడి ఉంటుంది కాబట్టి వారికి నాణ్యమైన విద్య అందించి తెలంగాణ విద్యార్థులకి ప్రపంచంలో గుర్తింపు తెచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ మందికి లబ్ది చేకూర్చేలా త్వరలో అందరికి సన్న బియ్యం అందించేందుకు కృషి చేస్తున్నామని, పాఠశాలలకి పౌర సరఫరాల శాఖ ద్వారా సప్లై చేసిన బియ్యం నాణ్యత బాగుందని తెలిపారు. గుడిబండ కి చెందిన పదవ తరగతి విద్యార్థిని ఆయేష సిద్దిక మాట్లాడుతూ ఈ పాఠశాలలో నేను ఐదవ తరగతి లో చేరినానని అప్పుడు ఉన్న చదువు,ఆహారం లో నాణ్యత కంటే ఇప్పుడు చాలా బాగుందని, ఉపాధ్యాయులు మా మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టి చదివిస్తున్నారని తెలిపారు. అలాగె పదవ తరగతి కి చెందిన విద్యార్థిని మైతిన్ మాట్లాడుతూ డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచి నాణ్యమైన భోజనం అందించటంతో మాకు ఆరోగ్యం బాగుండి మంచిగా చదువుకుంటున్నాం అని మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచినందుకు మంత్రి కి ధన్యవాదములు తెలిపారు. రాత్రి పాఠశాల లోకి దోమలు రాకుండా మెస్ డోర్లు, ఐ ఐ టి, నీట్ లాంటి పరీక్షలకి సిద్ధం అయ్యేందుకు పుస్తకాలు, మినరల్ వాటర్ కొరకు ఆర్వో ప్లాంట్, డిజిటల్ క్లాస్ లకి ప్రొజెక్టర్ కావాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు మంత్రి దృష్టి తీసుకొని రాగా మెస్ డోర్లకి 2 లక్షలు, ఆర్వో ప్లాంట్ కి 2 లక్షలు, ఐ ఐ టి నీట్ పరీక్షలకి బుక్స్,ప్రొజెక్టర్ మంజూరు చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి,రాష్ట్ర పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఆర్ డి ఓ సూర్యనారాయణ, జిల్లా మైనార్టీ అధికారి జగదీశ్వర్ రెడ్డి,తహసీల్దార్ వాజీద్, ఎం ఈ ఓ సలీం షరీఫ్, ప్రిన్సిపల్ మాధురి శర్మ, ఆర్ ఐ రాజేష్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆలోచన చేసిండ్రు.. ఆచరణలో పెట్టిండ్రు

• పల్లె ప్రకృతి వనంలో ఔషధమొక్కల పెంపకం







**మహాముత్తారం, జనవరి 1 (నినాదం న్యూస్):** ఒక ఆలోచన వస్తే దాన్ని ఆచరణలో పెట్టడం అందరితో సాధ్యం కాదు..కేవలం ఆలోచన చెప్తారే కానీ దాన్ని ఆచరించమంటే వెనుకడుగు వేసేవారు ఉంటారు. అయితే జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారంలో ప్రకృతి ప్రేమికులు తమ ఆలోచనను ఆచరణలో పెట్టి చూపించారు. గత ప్రభుత్వం ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. అయితే వాటి సంరక్షణ చూసేవారు లేక పోవడంతో ప్రకృతి వనంలో మొక్కలు ఎండిపోయాయి. ఈ క్రమంలో ప్రకృతి ప్రేమికులు గొప్పగా ఆలోచన చేసి ముందు భవిష్యత్ తరాల కోసం ఏకంగా ఔషధ మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండల కేంద్రంలో ప్రకృతి ప్రేమికులు పల్లె ప్రకృతి వనంలో ఔషధ మొక్కల పెంపకం కార్యక్రమం ప్రారంభించారు. 2021లో ఫారెస్ట్ అధికారులు ప్రభుత్వానికి కేటాయించిన స్థలంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పల్లె ప్రకృతి వనం ఏర్పాటుచేసి పలు రకాల మొక్కలు నాటారు. అయితే మూడేళ్లుగా మొక్కల సంరక్షణపై సరైన చర్యలు చేపట్టకపోవడంతో మొక్కలు ఎండిపోయాయి. మహాముత్తారం మండలానికి చెందిన ప్రకృతి ప్రేమికుల మిత్ర బృందం గొప్పగా ఆలోచన చేసి పల్లె ప్రకృతి వనంలో మొక్కలు నాటాలని నిర్ణయించారు. ఈ క్రమంలో ప్రకృతి ప్రేమికులకు కొంత మంది దాతలు చేయూతనందించడం ప్రారంభించారు. అలాగే గ్రామస్తులు సైతం సహకారం అందించడంతో ఏకంగా ఔషద మొక్కలను నాటేందుకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు అందరికి ఆరోగ్యాన్నిచ్చే అన్ని రకాల ఔషధ మొక్కల్ని తీసుకొచ్చి పల్లె ప్రకృతి వనంలో నాటారు. మొక్కలు నాటాలి సంరక్షణ బాధ్యతలు చేపట్టాలనే ప్రచారానికే పరిమితం అవుతున్న క్రమంలో ప్రకృతి ప్రేమికుల ఆలోచన అందరిని ఆలోచింప జేస్తుంది. కాగా గ్రామానికి చెందిన బానోతు రాజునాయక్, అజ్మీరా డాకు నాయక్, పెరుమాండ్ల సురేష్, చంద్రగిరి రవి, రంగు శ్రీనివాస్, ఆలోత్ ప్రతాప్ లు మొక్కల సంరక్షణ బాధ్యతను తీసుకున్నారు. ప్రస్తుతం రావి, వేప, ఉసిరి, మారేడు, నేరేడు, జమ్మి, మర్రి, పనస, ఎలక, అల్లనేరేడు, పాల, మోదుగ, మామిడితో పాటు పూల మొక్కలను నాటారు.

## ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారదిగా పత్రికలు పనిచేయాలి

• మాజీ ఎమ్మెల్యే పెద్ది




**నర్సంపేట, జనవరి1 (నినాదం):** ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఒక వారది ల పత్రికలు పనిచేయాలని నర్సంపేట మాజీ శాసన సభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి తెలిపారు. నల్లబెల్లి మండల కేంద్రం లోని బిఆర్ ఎస్ పార్టీ కార్యాలయం లో దిశ పత్రిక నూతన సంహోత్సరం 2025 క్యాలెండరు ను పెద్ది బుధవారం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పెద్ది మాట్లాడుతూ డిజిటల్ రంగంలో దిశ పత్రిక నూతన పద్ధతులు అవలంబిస్తూ దూసుకుపోతున్నదన్నారు. వార్తలను ఎప్పటికప్పుడు స్వల్ప వ్యవదిలో పాఠకులకు అందిస్తు ప్రజల మన్ననలు పొందిందని పేర్కొన్నారు. అనంతరం బి ఎస్ ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయ కులు, కార్యకర్తలు పెద్ది సుదర్శన్ రెడ్డి కి నూతన సంహోత్సరం శుభాకాంక్షలు తెలిపారు. దిశ రిపోర్టర్ నాంపల్లి మురళి, ఖానాపురం మాజీ ఎంపీపీ ప్రకాష్ రావు, మునిగాల వెంకట్ రెడ్డి, రాయిడి రవీందర్ రెడ్డి, నాగేల్లి వెంకట్ నారాయణ గౌడ్, శాన బోయిన రాజు కుమార్ పాల్గొన్నారు.

## ఉత్తమ సేవ పతకాలకు పోలీసు అధికారుల ఎంపిక

**ములుగు ప్రతినిధి, (నినాదం):** పోలీసు శాఖలో ఉత్తమ సేవలు అందించిన వారికి నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి సేవా పథకం, ఉత్తమ సేవా పథకం, కఠిన సేవా పథకాలకు పలువురిని ఎంపిక చేశారు. ములుగు జిల్లాలోని విధులు నిర్వహిస్తున్న రాజేష్ ఏఆర్ పిసి, బీడీ టీం, స్పెషల్ పార్టీ నుంచి బి కన్నయ్య ఏఆర్ పిసి, జె సురేష్ ఏఆర్ పిసి, పి అన్వేష్ పిసి లను కఠిన సేవా పతకం, డీసీఆర్బీ నుంచి బి శంకరయ్య ఏఎస్ఐ, ఎం విజయకర్ రావు హెచ్ సిలకు ఉత్తమ సేవ పతకం, హెడ్ క్వార్టర్స్ నుంచి పి వెంకట్ రెడ్డి ఏఆర్ ఎస్ ఐ, ఎండి నజీముద్దీన్ ఏఆర్ ఎస్ ఐ, జే రాములు ఏఆర్ హెచ్ సి, బి జనార్ధన్ ఏఆర్ హెచ్ సి, ఎండి మధు అలీ ఏఆర్ హెచ్ సి, ఎస్ రాజు ఏఆర్ హెచ్ సి, టి నవీన్ కుమార్ ఏఆర్ హెచ్ సిలను సేవ పతకానికి ఎంపిక చేశారు. వివిధ విభాగాల్లో ఉత్తమ సేవ పతకాలను ఎంపికైన అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ప్రత్యేకంగా అభినిందించి ప్రశంసలు తెలిపారు.

## మండల ప్రజలందరూ సంతోషంగా ఉండాలి

• ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గుడిమెట్ల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఇరుగు వెంకటేశ్వర్లు



**కోదాడ/అనంతగిరి, జనవరి1 (నినాదం న్యూస్):** అనంతగిరి మండల ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గుడిమెట్ల రామకృష్ణ ,ప్రధాన కార్యదర్శి ఇరుగు వెంకటేశ్వర్లు అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని బుధవారం మండల ప్రజలకు ప్రతినిధులకు అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు . ఈ సంవత్సరంలో అధికారులు ప్రజా ప్రతినిధులు చేపట్టే పనుల్లో విజయాలు కలగాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరంలో నూతన ప్రభుత్వంలో జర్నలిస్టుల కల నెరవేరుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామీణ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామన్నారు. నిత్యం సవాళ్లతో కూడుకున్న జర్నలిజం వృత్తిలో ఏరోజుకారోజు కొత్త రకమైన సమస్యలు ఎదురవుతాయని, వాటిని అధిగమించి రిపోర్టింగ్ చేయవలసి ఉంటుందన్నారు. జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా వారికి వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని వారు హామీ ఇచ్చారు.

## మాదాపూర్ ఐటి కంపెనీలో అగ్నిప్రమాదం

**హైదరాబాద్, జనవరి1(నినాదం న్యూస్):** మాదాపూర్ అయ్యప్ప సొసైటీలోని ఓ వాణిజ్య సముదాయంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. భవనం ఐదో అంతస్తులోని నిపున్ ఐటీ సొల్యూషన్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో మంటలు చెలరేగాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని రెండు్గ రిరజన్లతో మంటలు ఆర్పివేశారు. అగ్ని ప్రమాదంలో కార్యాలయంలోని సామగ్రి, ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిబూడిదయ్యాయి. వాణిజ్య సముదాయంలో మంటలు చెలరేగడంతో సిబ్బంది ఒక్కసారిగా బయటకు పరుగులు తీశారు.

## షరతుల పేరుతో రైతుల నోట్లో మట్టికొట్టే యత్నం

• రైతుభరోసాపై హరీష్ రావు విమర్శలు



**సంగారెడ్డి,జనవరి1(నినాదం న్యూస్):** షరతుల పేరిట రైతుల నోట్లో మట్టికొట్టే ప్రయత్నం చేస్తున్నారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. బుధవారం సంగారెడ్డిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'పత్తి, చెరకు, పసుపు పంటలకు ఒకసారి మాత్రమే రైతు భరోసా ఇస్తామంటున్నారు. కొండలు, గుట్టలు సాగు చేసే వారికి రైతు భరోసా రాదని చెబుతున్నారు. ఇప్పుడు రైతు భరోసాకు కూడా షరతులు పెడుతున్నారు. రైతు భరోసా కోసం రైతుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకుంటారంట. బడా కంపెనీలు, కార్పొరేట్ వ్యాపారులకు మాత్రం ఎలాంటి షరతులు ఉండవు. రైతులను దోషిగా నిలబెట్టే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారు? రైతులను మళ్లీ కార్యాలయాల చుట్టూ తిప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఏ దరఖాస్తు లేకుండా భారాస ప్రభుత్వం రైతుబంధు ఇచ్చింది. కాంగ్రెస్ నాయకుల చుట్టూ రైతులు తిరగాలని ఈ ప్రభుత్వం చూస్తోంది. వరంగల్ డిక్లరేషన్‌లో చెప్పినట్టు ఎకరానికి రూ.15వేల చొప్పున ఇవ్వాలి. వానాకాలం, యాసంగి పంటలకు కలిపి ఒకేసారి రూ.15వేల చొప్పున ఇవ్వాలి' అని హరీశ్‌రావు డిమాండ్

## గంజాయి సరఫరా చేస్తున్న ఇరువురి అరెస్ట్

• రైల్వే పోలీసుల వెల్లడి

**హైదరాబాద్, జనవరి1 (నినాదం న్యూస్):** ఒడిశాలో కొనుగోలు చేసిన గంజాయిని సికింద్రాబాద్ విరీదుగా మహారాష్ట్రకు రైలులో సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేయగా మరొకరు పరారీలో ఉన్నారని సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ జావీద్ తెలిపారు. మంగళవారం సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జావీద్, రైల్వే పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్‌లు వివరాలను వెల్లడిరచారు. ఒడిశా(క్షటతిబరజీ)లోని గాజపాటి జిల్లా ఘూసాపాద గ్రామానికి చెందిన సర్బన్ నాయక్ (29) ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తాడు. అదే గ్రామానికి చెందిన తఫాన్ బిషోయో (27)తో పాటు మానస్ ఒడిశాలో రూ.1.22 లక్షల విలువ చేసే 4.9 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. అక్కడినుంచి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలు(ఐనీనిజీసీ ఇలూస?బబ బిసజీతిని)లో సరఫరా చేస్తుండగా మంళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో బెర్తు కింద ఉన్న లగేజీలను పరిశీలించగా అందులో గంజాయి సరుకు ఉందని తెలుసుకున్న పోలీసులు ముందుగా సర్బన్ నాయక్, తఫాన్ బిషోయోలను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులను గమనించిన మానస్ అక్కడి నుంచి పారిపోయాడు. గంజారుని స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సమస్యల పరిష్కారం కోసం వస్తారు.. ఓట్లు మాత్రం వేయరు..

• నవ నిర్మాణ సేన చీఫ్ రాజ్ ఠాక్రే

**ముంబ్కై,జనవరి1(నినాదం న్యూస్):** ప్రజలు సమస్యలు వచ్చినప్పుడు పరిష్కారంకోసం తమ పార్టీ వైపు చూస్తారని, ఎన్నికల్లో ఓటింగ్ సమయంలో మాత్రం విస్మరిస్తున్నారని మహారాష్ట్ర నవ నిర్మాణ సేన చీఫ్ రాజ్ ఠాక్రే అన్నారు. మహారాష్ట్ర ప్రజలకు వరుస ట్వీట్లలో ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలను ప్రస్తావించారు. ముంబ్కైలో గత 25 ఏళ్లుగా మార్పులు వచ్చినప్పటికీ ఇప్పటికీ ఉద్యోగావకాశాలు లేవనే అభద్రతా భావంతో ప్రజలు ఉన్నారని రాజ్ ఠాక్రే చెప్పారు. యువకులకు చేసేందుకు పని లేదని, ఇదే సమయంలో రాష్ట్రం బయట నుంచి వచ్చిన వారికి ఉద్యోగావకావశాలు లభిస్తున్నాయని అన్నారు. కార్మికుల నుంచి రైతులు, పేదల వరకు చుక్కలనంటుతున్న ధరలతో కుదేలవుతున్నారని అన్నారు. ఇలాంటి సందర్భాల్లోనూ, ఇతర సమస్యలు వచ్చినప్పుడు ప్రజలకు మహారాష్ట్ర నవనిర్మాణ సేవ గుర్తొస్తుందని, కానీ ఎన్నికల్లో ఓటింగ్ సమయంలో మాత్రం పార్టీని విస్మరిస్తున్నారని అన్నారు. రీష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ఇప్పటికీ తాము విశ్లేషించు కుంటున్నామని, త్వరలోనే పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కార్యకర్తలకు దిశానిర్దేశర చేస్తామని చెప్పారు. ఇటీవల జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 125 మంది అభ్యర్థులను ఎంఎన్ఎస్ పోటీకి దింపింది. అయితే ఒక్క సీటు కూడా పార్టీ గెలుచుకోలేదు. 1.55 శాతం ఓటింగ్ షేర్ రాబట్టుకుంది. మహిం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రాజ్ ఠాక్రే కుమారుడు అమిత్ తొలిసారి ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ కేవలం మూడో స్థానంలో నిలిచాడు. ఎన్నికల ఫలితాలు నమ్మశక్యంగా లేవని రాజ్ ఠాక్రే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎంఎన్ఎస్ 2009 అసెంబ్లీ ఎన్నికల్లో 13 సీట్లు గెలుచుకుంది. 2014, 2019 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం ఒక్కో స్థానం దక్కించుకుంది. ఈసారి ఖాతా కూడా తెరవలేదు.

# ఉత్తర హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు లైన్‌క్లియర్

● ఫలించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కృషి



**అల్వాల్, జనవరి 1 (నినాదం న్యూస్):** ఉత్తర హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు కు లైన్ క్లియర్ అయింది.తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి శ్రీ రేవంత్ రెడ్డి , బుధవారం సంబంధిత ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ప్యారడైజ్ నుండి మేడ్చల్, మరియు అల్వాల్ మీదుగా శామీర్ పేట వరకు మెట్రో రైలు ప్రాజెక్టు కు మోక్షం లభిస్తుందని మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు.ఇటీవల మల్కాజిగిరి శాసన సభ్యులు శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి శాసన సభలో డిసెంబర్ 20 వ తేదీన 2 ఫేస్ ఉత్తర హైదరాబాద్ లో మెట్రో కనెక్టివిటీ పై ప్రశ్న అడిగారు. అదే విధంగా గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారిని ప్రత్యేకంగా కలసి ఈ ప్రాజెక్టు ఆవశ్యకతను వివరించి వినతి పత్రం సమర్పించారు. ఆ సందర్భంగా గౌరవ ముఖ్య మంత్రి శ్రీ రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని దరిమిలా ఈ ఉత్తర హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు మార్గం సుగమమైంది అని మర్రి రాజశేఖర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాంత ప్రజల సౌర్యార్థం సానుకూలంగా స్పందించి త్వరగా ఆదేశాలు ఇచ్చిన గౌరవ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

● కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, జనవరి 1 (నినాదం న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అన్ని వర్గాల ప్రజలు నూతన సంవత్సరం సందర్భంగా గాజులరామారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తో నియోజవర్గం ప్రజలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, సంక్షేమ సంఘాల నాయకులు, అభిమానులు, పలువురు కలిసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ ప్రజలు అందరూ కొత్త సంవత్సరంలో సుఖసంతోషాలతో, సుబిక్షంగా ఉండాలన్నారు. ప్రజాపాలనలో రాష్ట్ర ప్రభుత్వ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు గరీబోళ్ల గడపకు చేరేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



**మహేశ్వరం, జనవరి 1 (నినాదం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. అచ్చంపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణకు స్థానికులు మర్యాదపూర్వకంగా కలిసి పులుమానులు వేసి శాలువాతో ఘనంగా సత్కరిస్తూ ఆంగ్ల నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. నూతన సంవత్సరం సందర్భముగా ప్రజలందరూ కలిసిమెలిసి దినదిన అభివృద్ధి చెందాలని స్వామివారికి కోరినట్లు ఆకాంక్షించారు. ప్రజలందరూ ఆనందంగా సంతోషంగా ఆయురారోగ్యాలతో అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లపు శ్రీను, చింతల శ్యాం మాదిగ, గుద్దటి బాలరాజు, సౌట గణేష్, ముప్పల బిట్టు పాల్గొన్నారు.

## కొలను హనుమంత రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన నియోజకవర్గ నేతలు





**కుత్బుల్లాపూర్, జనవరి 1 (నినాదం న్యూస్):** నూతన సంవత్సర సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని పలువురు పార్టీ నేతలు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొలను హనుమంత రెడ్డిని కలిసిన వారిలో డివిజన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, మహిళ నాయకురాళ్లు, ఐఎన్‌టియుసి నాయకులు, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం హనుమంత రెడ్డి మాట్లాడుతు నియోజకవర్గ ప్రజలు నూతనోత్సా హంతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలకాలని, ఆశలు, ఆశయాలూ తీర్చే బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నానన్నారు. నియోజకవర్గ ప్రజలు, అందరికి నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## కేఎం ప్రతాప్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన అభిమానులు





**కుత్బుల్లాపూర్, జనవరి 1 (నినాదం న్యూస్):** నూతన సంవత్సరం సందర్భంగా,రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె.యం.ప్రతాప్‌కు పలువురు పార్టీ నేతలు అభిమానులు కలిసి శాలువాలు కప్పి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ కాల నీలా, బస్తీలా సంక్షేమ సంఘం అధ్యక్షులు, ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, కార్మిక నాయకులు, అభిమానులు తెలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు అందజేశారు. ఈ సందర్భంగా కే యం ప్రతాప్ మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. నూతన సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలని భగవంతుని కోరుకున్నానన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలకు, అందుబాటులో ఉంటూ, తన వంతు సహాయ సహకారాలను ఎల్లప్పుడూ అందిస్తానని ఏం ప్రతాప్ భరోసా ఇచ్చారు.

## రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన దశరథ్ నాయక్

**మహేశ్వరం, జనవరి 1 (నినాదం న్యూస్):** ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ కడ్తాల్ మండల కేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి కేక్ కట్ చేసి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైసీపీ ఆనంద్ డైరెక్టర్ వీరయ్య మాజీ సర్పంచ్ హరిచంద్ నాయక్ డైరెక్టర్ సేవ్య నాయక్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ నాయకులు మంగళపల్లి నరసింహ పాండు నాయక్ శ్రీను నాయక్ భీమన్ శ్రీను రాజు శ్రీకాంత్ సక్రు మోతిలాల్ వినోద్ రతన్ లక్ష్మణ్ చందర్ నాయకులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధితో యువత రాణించాలి






● ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ అండ్ టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

**మహేశ్వరం, జనవరి 1 (నినాదం న్యూస్):** ఉద్యోగుల కోసం నిరీక్షించకుండ స్వయం ఉపాధి రంగాలను ఎంచుకుని రాణించాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ అండ్ టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు, బుధవారం కల్వకుర్తి హైవే అమనగల్ పరిధిలోని ప్రధాన రహదారిపై నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ చాయ్ బెల్లం టీ స్టాల్‌ను అమనగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ యాట నరసింహ ముదిరాజ్, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షులు జగన్, సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, రచ్చ రాములు, మల్లయ్య, ఖాదర్, శివలింగం, ఖాదర్, చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు మంగ్లీ రాములు, సోదరుడు నరసింహ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ అండ్ టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు, అనంతరం నిర్వాహకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు వేసి శాలువతో ఘనంగా సత్కరిస్తూ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ...నాణ్యమైన అన్ని రకాల టీ స్టాల్‌లో ప్రత్యేకత ఉండాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన వెరైటీలను అందించి ప్రజల మన్ననలు పొందాలని నిర్వాహకులకు సూచించారు. ప్రత్యేకంగా టీ ప్రజలకు అందించాలన్నారు. పరిశుభ్రతమైన నాణ్యత గల జాగ్రత్త పాటించాలన్నారు. అభివృద్ధి చేందలంటే మారుతున్న కాలానుగుణంగా కష్టపడి పురోగతి చెంది వినియోగదారులకు మంచి సేవలు అందించినప్పుడే వినియగదారుల ఎల్లప్పుడూ మీ సేవ సౌకర్యాలు అందుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు అమర్ సింగ్, ఈశ్వర్ నాయక్, యువజన కాంగ్రెస్ నాయకులు రఘు, దినేష్, కొండల్ రెడ్డి, మహేష్ అభిమానులు పెద్దలు కార్యకర్తలు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కండక్టర్ నుంచి కంట్రోలర్‌గా నరసింహ రెడ్డి



**కొడంగల్, జనవరి 1 (నినాదం న్యూస్):** ఆర్టీసీ కండక్టర్‌గా విధులు నిర్వహించే పెట్లోళ్ళ నరసింహ రెడ్డి కంట్రోలర్‌గా ప్రమోషన్ పొందడంతో కొడంగల్ వాసులు ఆయనకు ఘనంగా సన్మానించారు. గత కొన్నేళ్లుగా కండక్టర్‌గా కొనసాగిన ఆయన, ఇటీవల జరిగిన జరిగిన పదోన్నతుల్లో కంట్రోలర్ గా ఎదగడంతో పట్టణవాసులు, ఆయన మిత్రులు ఆనందాన్ని పంచుకొన్నారు. ఇకనుంచి కొడంగల్ ఆర్టీసీ కంట్రోలర్‌గా విధులు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి కంట్రోలర్ రాములు, బొంకూరు నరేష్ కుమార్, అరిగే ఓంప్రకాశ్, లక్ష్మీ పల్లి పవన్ కుమార్, హనుమంతు, వెంకటయ్య, గోపిసింగ్, తదితరులు నరసింహ రెడ్డిని శాలువా, పూలదండలతో సత్కరించి మిఠాయిలు తినిపించారు.

## మహార్‌ల పోరాటం మరువలేనిది



**చేవెళ్ల, జనవరి 01(నినాదం న్యూస్):** హైదరాబాదులోని, లోయర్ ట్యాంక్ బండ్ అంబేద్కర్ గారి విగ్రహం వద్ద సమతా సైనిక్ ఆధ్వర్యంలో భీమా కోరేగావ్ మహర్ యుద్ధ వీరులకు ఘన నివాళులు అర్పించారు. అనంతరం సమతా సైనిక్ దళ్ నాయకులు ఏర్పుల మల్లేష్, మాచనపల్లి రామస్వామి మాట్లాడుతూ భీమాకోరేగావ్ యుద్ధం జనవరి ఒకటవ తేదీన 1818 సంవత్సరంలో 500 వందల మంది మహర్ రెజిమెంట్ సైనికులు, 28వేల మంది పీశ్వాసైన్యం పై చేసిన యుద్ధంలో మహార్ సైనికులు విజయం సాధించిన సందర్భంగా మహారాష్ట్ర లో పూనే నగరం లో భీమానది వడ్డున నిర్మించిన మహర్ యుద్ధ వీరుల ద్వారానే అంటరాని కులాలకు విద్య అభ్యాసించే అవకాశం కలిగింది.మహర్ ల పోరాటాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మాచనపల్లి రామచందర్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి మహేష్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బేగరి ప్రభాకర్, చేవెళ్ల మండల అధ్యక్షులు మల్లెపల్లి శ్రీనివాస్, ఆలూర్ గ్రామ జై భీమ్ యువజన సంఘం అధ్యక్షులు ఎల్లకొండ నర్సింలు,పూలపల్లి ప్రవీణ్ కుమార్,పూలపల్లి తరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హరీశ్ రావుకు విషెస్ చెప్పిన శశిపాల్



**చేవెళ్ల, జనవరి 01(నినాదం న్యూస్):** మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావుకు చేవెళ్ల మండలం దుద్దాగు గ్రామానికి చెందిన బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి కోనపురం శశిపాల్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు . బుధవారం బీఆర్ఎస్వీ నేతలతో కలిసి హైదరాబాద్లోని హరీశ్రావు నివాసానికి వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా బొకే ఇచ్చి న్యూ ఇయర్ విషెస్ చెప్పారు. అనంతరం శశిపాల్ ఆధ్వర్యంలో రూపొందించిన బీఆర్ఎస్వీ నూతన సంవత్సర క్యాలెండర్ను హరీశ్రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. గత ఏడాదిలో జరిగిన మంచి, చెడులను బేరీజు వేసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నవాబుపేట మండల వైస్ ప్రెసిడెంట్ శాంతి కుమార్, సీనియర్ నేత విష్ణు, బీఆర్ఎస్వీ నేతలు నందు, కార్తిక్, శ్రీనివాస్ తదతరులు పాల్గొన్నారు.

## మేయర్ దంపతులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఆగం పాండు

**కుత్బుల్లాపూర్, జనవరి 1 (నినాదం న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దంపతులు కోలన్ నీలా గోపాల్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేటర్ ఆగం పాండు ముదిరాజ్,16వ డివిజన్ రాజీవ్ గాంధీ నగర్ కాలనీ సీనియర్ నాయకులు.ఈ సందర్భంగా మేయర్ దంపతులు నాయకులకు, అభిమానులకు, ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో 16వ డివిజన్ సీనియర్ నాయకులు ఖాదరయ్య,మహేందర్,యాదయ్య, శంకర్,12వ డివిజన్ సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ఎండి సిరాజ్ జన్మదిన వేడుకలు



**మహేశ్వరం, జనవరి 1 (నినాదం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ, నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట తాలూకా చారకొండ మండలం పరిధిలోని తెలంగాణ ఉద్యమకారుడు ఎండి సిరాజ్ తన స్వగృహంలో జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఉపసర్పంచ్ తెలంగాణ ఉద్యమ నాయకులు జగపతి ఆధ్వర్యంలో ఆయనకు పూలమాలలు వేసి శాలువతో ఘనంగా సత్కరిస్తూ, కార్యకర్తలు అభిమానులు సభ్యులు యువకులు పెద్దలు నాయకులతో కలిసి ఆయనకు ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో కేక్ కట్ చేయించి తినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అందరి మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పెద్దలు స్నేహితులు బంధువులు స్థానిక నాయకులు అభిమానులు నాయకులు చిన్నలు పెద్దలు కే శ్రీనివాస్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షల వెల్లువ





**కుత్బుల్లాపూర్, జనవరి 1 (నినాదం న్యూస్):** కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, మహిళా ప్రజాప్రతినిధులు, నాయకులు, సంక్షేమ సంఘాల సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ మర్యాదపూర్వకంగా కలిసి ఆంగ్ల నామ సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. గాజుల రామారం డివిజన్ బాలయ్య నగర్ బస్తికి చెందిన అసోసియేషన్ అధ్యక్షులు నగేష్, ఈ పార్వతుల ఆధ్వర్యంలో భారీ గజమాలను తీసుకువెళ్లి ఎమ్మెల్యే కేపీ వివేకానందుకు గజమాలతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ ఈ నూతన ఆంగ్లనామ సంవత్సరంలో ప్రజలంతా నూతన ఉత్తేజంతో ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో తులతూగాలన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



**అల్వాల్, జనవరి 1(నినాదం న్యూస్):** ఆంగ్ల నూతన సంవత్సరం పురస్కరించుకొని పలు దేవాలయాలు భక్తులచే కిక్కిరిసిపోయాయి. శ్రేయోభిలాషులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ ఈ కొత్త సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, ప్రతి ఒక్కరూ సంతోషంగా గడపాలని ,అందరూ బాగుండాలని, దేవాలయాలలో పూజలు నిర్వహించారు. శ్రీ.బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నుండి భక్తుల సందడి కొన సాగింది. శ్రీ ఉమా చంద్రమౌళీశ్వర ఆలయంలో భక్తులతో కీటకిటలాడాయి ఈ కార్యక్రమంలో అర్చకులు రఘు పంతులు. వంశీ పంతులు, శ్రీనివాస్ పంతులు, రాపర్తి చంద్రశేఖర్, రాజు. భక్తులు పాల్గొన్నారు.

## మరకత లక్ష్మిగణపతికి ప్రత్యేకపూజలు



**అల్వాల్, జనవరి 1 (నినాదం న్యూస్):** అల్వాల్ పట్టణంలోని కానాజిగూడ డైరీ ఫామ్ రోడ్డులో వెలిసిన ప్రసిద్ధ మరకత శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో ఆంగ్ల నూతన సంవత్సర పురస్కరించుకొని శ్రీ లక్ష్మీ గణపతి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన డాక్టర్ మోత్కూరు సత్యనారాయణ శాస్త్రి. బుధవారం సుప్రభాత సేవ వస్త్రాలంకరణ సేవ ప్రత్యేక హోమాలు అర్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు ఆలయ అభివృద్ధికి భక్తుల సహాయము ఎంతైనా ఉందని అభివృద్ధికి పాటుపడాలని భక్తులను కోరారు.

# ఉచిత సివిల్స్ కోచింగ్ సెంటర్ ప్రారంభించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు



**కరీంనగర్, జనవరి 1(నినాదం న్యూస్) :** జన్నారంలో స్లేట్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో 6వ తరగతి నుండి 10వ తరగతి పిల్లలకు సివిల్స్ ఉచిత కోచింగ్ క్లాసులు ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ట్రస్మా స్టేట్ చీఫ్ అడ్వైజర్ ఎమ్మెల్సీ పట్టభద్రుల ఇండిపెండెంట్ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు ఈ కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ, ఇప్పటివరకు హైదరాబాద్, ఢిల్లీ ,బెంగళూరు లాంటి మహానగరాలలో మాత్రమే కోచింగ్ అనేది ఇస్తున్నారని దీనివల్ల మధ్యతరగతి కుటుంబాలకు సివిల్స్ అనేది అందని ద్రాక్ష గానే మిగిలిపోయిందని, ఇప్పుడు మారుమూల ప్రాంతమైన జన్నారం మండల కేంద్రంలో సివిల్స్ కోచింగ్ ప్రారంభించడం ఎంతో శుభ పరిణామమని అన్నారు. ఎవరైతే కోచింగ్ తీసుకుంటున్న పిల్లలు ఉన్నారో వాళ్ళ తల్లిదండ్రులు పిల్లల చదువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ, వారి ఉన్నతమైన ఆశయ సాధనకు ప్రోత్సాహం అందించాలని పేర్కొన్నారు. పిల్లలు కూడా శ్రద్ధతో చదువుకొని వారు అనుకున్న లక్ష్యాలు చేరుకోవాలని ఆశిస్తూ అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బరావత్ ప్రకాష్ నాయక్, కోశాధికారి ప్రకాష నాయక్, సంపూర్ణ మద్దతును ప్రకటించారు. అనంతరం పద్మనాయక వెలమ సంక్షేమ సంఘము మండలం జన్నారం దస్తురాబాద్ నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వాళ్ల అశోక్ రావు గౌరవాధ్యక్షులు, రామడుగు రమేష్ రావు అధ్యక్షులు,మాదాడి సరోజన ఉపాధ్యక్షులు, మేనేని ఆగమ రావు ఉపాధ్యక్షులు, గుండవరపు మధుసూదన్ రావు ప్రధాన కార్యదర్శి, నెమరుకొమ్ముల అంజిత్ రావు కోశాధికారి మాదాడి, హనుమంతరావు జాయింట్ సెక్రెటరీ, కార్యవర్గ సభ్యులు

## పార్టీలకు అతీతంగా బీసీలు తరలిరావాలి



**జమ్మికుంట, జనవరి1 (నినాదం న్యూస్) :** స్థానిక సంస్థలలో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు సాధనకై బీసీ మహాసభ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో జనవరి మూడో తేదీన జరగనున్నఈ సభకు పార్టీలకతీతంగా బీసీలు కదలి రావాలని కరీంనగర్ ఉమ్మడి జిల్లా బీసీ సంఘం బాధ్యులు సాయి కృష్ణ పిలుపునిచ్చారు. హుజరాబాద్ పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ మహాసభ పోస్టర్ను రిలీజ్ చేశారు ఈ సందర్భంగా సాయికృష్ణ మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ వెళ్ళినట్లయితే బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలుగా మేము ఊరుకునేది లేదు హెచ్చరించారు. బీసీలుగా మేము సమగ్ర కులగణన సర్వే ప్రకారం మేము 60% ఉన్నందున స్థానిక సంస్థల్లో బిసిలమైన మేము అన్యాయానికి గురవుతున్నందున కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని అమలు పరచాలని బీసీ మహాసభ నిర్వహిస్తున్నాము తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలుపరచలేని పక్షంలో బీసీ మహాసభ ద్వారా జాగృతమై కాంగ్రెస్ పార్టీ పై బీసీలందరం ఏకమై బీసీ ల యుద్ధం ప్రకటిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో జిల్లా బాధ్యులు తులసి లక్ష్మణమూర్తి, చిలుక మారి శ్రీనివాస్, గడ్డం రమేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.


## కరీంనగర్ రూరల్ నూతన ఏసీపీగా శుభం ప్రకాష్ బాధ్యతల స్వీకరణ



**కరీంనగర్, జనవరి 1(నినాదం న్యూస్) :** కరీంనగర్ కమిషనరేట్ లోని రూరల్ డివిజన్ ఏసీపీ గా, ఏ.ఎస్.పి. శుభం ప్రకాష్. ఐపీఎస్. బుధవారంనాడు బాధ్యతలు స్వీకరించారు. మహారాష్ట్ర, వార్ధ జిల్లా కి చెందిన శుభం ప్రకాష్ ఐ.ఐ.టి. ఖరగ్ పూర్ నుండి కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఇంజనీరింగ్ పట్టా పొందారు. 2022 బ్యాచ్ తెలంగాణ క్యాడర్ ఐపీఎస్ గా ఎంపికయ్యారు. ప్రస్తుతం గ్రేహౌండ్స్ నందు అస్సాల్ట్ కమాండర్ గా విధులు నిర్వహించిన ఆయన గడిచిన సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఐపీఎస్ లకు కేటాయించిన పోస్టింగుల్లో కరీంనగర్ రూరల్ ఏసీపీ గా కేటాయించ బడ్డారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఏ.ఎస్.పి. కరీంనగర్ రూరల్ డివిజన్ పరిధిలోని ఎస్ హెచ్ ఓ. లు సర్కిల్ ఇన్స్పెక్టర్లతో సమావేశమయ్యారు. పరిధిలో జరిగే నేరాలపై చర్చించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- కోరపల్లి గ్రామంలో అలుముకున్న విషాదఛాయలు



**జమ్మికుంట, జనవరి1 (నినాదం న్యూస్) :** జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామానికి చెందిన తీగల రవికిరణ్(30) అనే యువకుడు ప్రమాదవశాత్తు వరికుప్పలను తప్పించబోయి ఓదెల కొలనూరు గ్రామాల మధ్య మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం రవి కిరణ్ కొద్ది సంవత్సరాల క్రితం కొలనూరు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో క్యాషియర్ గా పనిచేస్తున్నాడు. పని నిమిత్తం ఓదెలకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో కొలనూరు గ్రామ శివారులో ఎదురుగా ఉన్న వరికుప్పలను గమనించక వాటిని తప్పించే ప్రయత్నం చేయగా ద్విచక్ర వాహనం నుండి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతనిని ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు. మృతునికి భార్య మౌనిక తో పాటు రెండు సంవత్సరాల కుమార్తె 4 నెలల బాబు ఉన్నాడు. రవి కిరణ్ మృతితో కోరపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రోడ్లపై వడ్లను ఆరబెట్టవద్దని అధికారులు పలుమార్లు రైతులకు సూచించినప్పటికీ కొంతమంది రైతులు మారడం లేదు. రోడ్లపై వరికుప్పలను వరి ధాన్యాన్ని ఆరబోస్తే ఇలాంటి ప్రమాదాలు జరిగి గతంలో ఎంతో మంది చనిపోయారు. ఒక సమయంలో హైకోర్టు కూడా రోడ్లపై ధాన్యం ఆరబోసిన రైతులపై కేసులు నమోదు చేయాలని తెలిపినప్పటికీ రైతులలో మార్పు రావడం లేదు. వారు చేసిన పొరపాటుకు ఎంతో భవిష్యత్తు ఉన్న ఒక నిండు జీవితం బలైపోయింది. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్లపై దాన్యం ఆరబోయకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ప్రజలు కోరుతున్నారు.

## అట్టహాసంగా సోమశేఖర చిట్ ఫండ్స్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

- కస్టమర్ల సంక్షేమమే మాకు ముఖ్యం
- ఖాతాదారుల ఆశీస్సుల తోనే పదో వసంతం లోకి
- ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఎండి దూడం సదానందం





జమ్మికుంట, జనవరి 1 (నినాదం న్యూస్) : కస్టమర్ల ఆశీస్సులు ప్రజల దీవెనలతో సోమశేఖర చిట్ ఫండ్ కంపెనీ 9 వసంతాలు పూర్తిచేసుకుని పదో వసంతంలోకి అడుగుపెట్టడం సంతోషంగా ఉందని సంస్థ ఎండి దూడం సదానందం తెలిపారు. బుధవారం నూతన సంవత్సరం ప్రారంభోత్సవం సందర్భంగా పట్టణంలోని సోమశేఖర చిట్ ఫండ్ కార్యాలయంలో ఖాతాదారులు కార్యాలయ సిబ్బందితో కలిసి ఆయన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ, గత తొమ్మిది సంవత్సరాలుగా మా ఖాతాదారులకు నమ్మకమైన సేవలను అందిస్తూ నమ్మకమే పెట్టుబడిగా ముందుకు కొనసాగు తున్నామని భవిష్యత్తులో కూడా ఇదే తరహా సేవలను అందిస్తూ మా కస్టమర్ల అభిప్రాయాల మేరకు సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తుందని ఆయన అన్నారు. తొమ్మిది సంవత్సరాలుగా మాపై నమ్మకంతో మాకు అండగా నిలిచిన మా కస్టమర్లకు ఏజెంట్ మిత్రులకు కార్యాలయ సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. క్యాలెండర్ డైరీ ఆవిష్కరణ అనంతరం కార్యాలయంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన ఏజెంట్లు కస్టమర్లు మాట్లాడుతూ, గత తొమ్మిది సంవత్సరాలుగా సోమశేఖర చిట్ఫండ్ సంవత్సర నాణ్యమైన సేవలు అందించారని ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందిస్తూ నమ్మకాన్ని చూర గొన్నారని వారు తెలిపారు. భవిష్యత్తులో కూడా వారి సేవలు ఇలాగే కొనసాగాలని మరింత అభివృద్ధి చెందుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ అరెల్లి వెంకటేష్ గౌడ్, సిబ్బంది కపిల్ శేఖర్ రాజేష్ తో పాటు పలువురు ఏజెంట్ లు ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

## స్పందన అనాధాశ్రమంలో ఘనంగా నూతన సంవత్సరం వేడుకలు

- అనాధ పిల్లల కళ్ళల్లో ఆనందం చూడడమమే మా లక్ష్యం
- సామాజిక కార్యకర్త అంబాల రజనీకాంత్




**జమ్మికుంట, జనవరి 1 (నినాదం న్యూస్) :** జమ్మికుంట పట్టణంలోని కొత్తపల్లి లో 2025 నూతన సంవత్సరం సందర్భంగా...సామాజిక కార్యకర్త, ఫెర్టిలైజర్ ప్రైవేట్ ఎంప్లాయిస్ యూనియన్ మండల అధ్యక్షుడు అంబాల రజనీకాంత్ ఆధ్వర్యంలో,ఫెర్టిలైజర్ ప్రైవేట్ ఎంప్లాయిస్ యూనియన్,అలాగే అగ్రికల్చర్ ఫర్టిలైజర్ సభ్యులతో తన మిత్రులతో కలిసి బుదవారం స్పందన పిల్లల అనాధాశ్రమంలో పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అనంతరం పిల్లలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి, ఫ్రూట్స్ అందజేసి, ఈ సందర్భంగా అంబాల రజనీకాంత్ పిల్లలను ఉద్దేశించి పిల్లలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉంటూ మంచిగా చదువుకోవాలని వారికి సూచించారు. గత 15 సంవత్సరాలుగా అనాధ పిల్లల మధ్య నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని ఆయన తెలిపారు. కల్మషం లేని పిల్లల మధ్య వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉంటుందని వారు కూడా మాకు అందరూ ఉన్నారు అనే భావన కలిగి భవిష్యత్తులో మేము అనాథలం కాదు అన్న ధైర్యంతో ముందుకు సాగుతారని రజనీకాంత్ తెలిపారు. నూతన సంవత్సర వేడుకలు పిల్లలతో జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తపరిచారు ,ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట మండల ఫర్టిలైజర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గోపాల్ రావు,జక్కే బాలరాజు, వంతడుపుల ప్రశాంత్,ఆకారపు చిరంజీవి, మహంకాళి శివ, దొడ్డె రాజు, మ్యాడగని సురేష్, శ్రీకాంత్, అనిల్ , మిడిదొడ్డి సాయిరాం, రాకేష్ అరుణ్ పాల్గొన్నారు

## నగర బిఆర్ఎస్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు




**కరీంనగర్, జనవరి 1(నినాదం న్యూస్) :** బిఆర్ఎస్ పార్టీ నగర కార్యాలయం లో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని నాయకులు కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరిపిన బిఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్ అనంతరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపిన కరీంనగర్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నగర మైనార్టీ అధ్యక్షులు షౌకాత్, బిఆర్ఎస్ పార్టీ నగర యూత్ ప్రధాన కార్యదర్శి బోనకుర్తి సాయికృష్ణ, బిఆర్ఎస్ పార్టీ నగర మైనారిటీ ప్రధాన కార్యదర్శి వాజిద్, బిఆర్ఎస్ పార్టీ టౌన్ కమిటీ బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు,బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. నూతన సంవత్సర సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్ మిత్రులకు, బిఆర్ఎస్ పార్టీనాయకులకు కార్యకర్తలకు, శ్రేయోభిలాషులకు, నగర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అందరు సుఖ సంతోషాలతో ఆయు రారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో ఉండాలని కోరారు.

## వాసవి వనిత క్లబ్ సేవలు అభినందనీయం

- అట్టహాసంగా వాసవి వనిత క్లబ్ సభ్యుల ప్రమాణ స్వీకారం
- క్లబ్ ఆధ్వర్యంలో విస్తృత సేవలు అందిస్తాం
- వాసవి వనిత క్లబ్ నూతన కమిటీ
- మొదటి రోజు మహిళలకు చీరల పంపిణీ





**జమ్మికుంట, జనవరి1 (నినాదం న్యూస్) :** సేవే పరమావధిగా వాసవి వనిత క్లబ్ ముందుకు కొనసాగాలని సమాజ సేవలో క్లబ్ సభ్యులు ముందు వరుసలో ఉండాలని వాసవి వనిత క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ అకిరాల శ్రీనివాస్ అన్నారు. బుధవారం జమ్మికుంట పట్టణంలోని మయూరి ఫంక్షన్ హాల్ లో జమ్మికుంట పట్టణ వాసవి వనిత క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆయన ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా వాసవి క్లబ్ వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఎంతో మంది నిరుపేదలకు సేవలో అందిస్తున్నామని అన్ని రంగాల్లో క్లబ్ సేవలు అందిస్తూ క్లబ్ సభ్యులు ముందుకు కొనసాగుతున్నారని ఆయన అన్నారు. గతంలో ఎన్నుకోబడిన వాసవి వనిత క్లబ్ పదవీకాలం డిసెంబర్ నెలతో ముగియడంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొని ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన అన్నారు. జమ్మికుంట వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలుగా స్వామి శెట్టి అఖిలాండం ప్రధాన కార్యదర్శిగా నూక సంధ్య కోశాధికారిగా దోమ కుంట్ల జ్యోతిని ఎన్నుకోవడం జరిగిందని వారు తెలిపారు. వాసవి వనిత క్లబ్ రీజనల్ చైర్ పర్సన్ అయిత రమాదేవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం హర్షించదగ్గ విషయమని వారు పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు వనిత క్లబ్ సేవలను విస్తృతంగా అందించాలని వీలైనంతవరకు ఎక్కువ మంది సభ్యులను తీసుకొని అందరి సహకారంతో ముందుకు పోవాలని వారికి సూచించారు. అనంతరం వాసవి మాత చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నూతన కమిటీ చేత ఇంటర్నేషనల్ సభ్యులు ప్రమాణ స్వీకారోత్సవం జరిపించారు.

**వనిత క్లబ్ ద్వారా విస్తృత సేవలు అందిస్తాం.**

వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలిగా ఎన్నికైన స్వామి శెట్టి అఖిలాండం మాట్లాడుతూ, మాపై నమ్మకంతో మాకు అవకాశాన్ని కల్పించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఆమె అన్నారు. ప్రధాన కార్యదర్శి సంధ్య కోశాధికారి దోమ కుంట్ల జ్యోతి క్లబ్ సభ్యుల సహకారంతో క్లబ్బును ముందుకు తీసుకెళ్తామని వారు తెలిపారు. ప్రమాణ స్వీకారం రోజున ముగ్గురు నిరుపేద మహిళలకు వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో నూతన వస్త్రాలను అందించడం జరిగిందని వారు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూడా వాసవి వనిత క్లబ్ ద్వారా విస్తృత సేవలు అందిస్తామని ఈ కార్యక్రమానికి వచ్చి విజయవంతం కావడానికి సహకరించిన మాజీ అధ్యక్షురాలు మురికి పూర్ణిమకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి వనిత క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షురాలు గర్రెపల్లి అరుణాదేవి ని వారు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ తంగళ్ళపల్లి రాజభాస్కర్ రీజినల్ సెక్రెటరీ అయిత రమాదేవి జిల్లా నాయకులు అకినపల్లి శ్రీనివాస్ వాసవివంత క్లబ్ మాజీ అధ్యక్షులు రావికంటి నీలకంఠం పలువురు మహిళలు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన సూడా ఛైర్మన్



**కరీంనగర్, జనవరి 1(నినాదం న్యూస్) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన సూడా చైర్మన్ కోమిటి రెడ్డి నరేందర్ రెడ్డి జూబ్లీహిల్స్ లోని సిఎం ఇంటివద్ద కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన సుడా చైర్మన్ ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లాలోని పలు అభివృద్ధి పనుల గురించి మాట్లాడారు.కరీంనగర్ లో సిఎం పర్యటించాలని కోరారు. దానికి సిఎం సానుకూలంగా హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## వాకర్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు



**కరీంనగర్, జనవరి 1(నినాదం న్యూస్) :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియం లో వాకర్ ఇంటర్నేషనల్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు.కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకొన్నారు.ఈ కొత్త సంవత్సరంలో అందరు ఆరోగ్యంగా ఆనందంగా ఉండాలని ప్రతి ఒక్కరూ శారీరక, వ్యాయామం చేసుకుంటూ ప్రతి ఒక్కరూ రోజు 30 నిమిషాల నుంచి 45 నిమిషాల వరకు వాకింగ్ చేసుకుంటూ, ఏటువంటి అనారోగ్య సమస్యలు లేకుండా ఆరోగ్యంగా జీవించాలని కోరుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు గుడిపాటి రమణారెడ్డి, గొట్టిముక్కుల రవీందర్, బూర జగదీశ్వర్ గౌడ్, పెంచాలా కిషన్ రావు, ఆడెపు కమలాకర్, శ్రీధర్ రెడ్డి, దాసరి అశోక్, వెలుపుల వెంకటేష్, పోలీస్ సత్తన్న, తోడుపునూరి శ్రీనివాస్,పెద్ది శ్రీనివాస్, వాకర్ అసోసియేషన్ సభ్యులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## 3న జరిగే బీసీల మహాసభను విజయవంతం చేయండి

- బీసీ కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు గుంజపడుగు హరిప్రసాద్



**కరీంనగర్, జనవరి 1(నినాదం న్యూస్) :** జనవరి మూడవ తారీకు హైదరాబాద్ లో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఇందిరా పార్కు వద్ద భారత జాగృతి అధ్యక్షురాలు శాసనమండలి సభ్యురాలు కల్వకుంట్ల కవితక్క గారి నాయకత్వంలో జరిగే బీసీల మహాసభను పెద్దఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని బీసీ కుల సంఘాలను రాష్ట్ర నాయకులు గుంజపడుగు హరిప్రసాద్ కోరడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలోకి రాకముందు కామారెడ్డి లో చేసిన డిక్లరేషన్ ప్రకారంగా సంపూర్ణ బీసీ కుల గణన జరిగిన తర్వాత బీసీల లెక్కలు తేట తెల్లం అయ్యాక అప్పుడు వచ్చిన లెక్కల ఆధారంగా బీసీ రిజర్వేషన్ కల్పించి స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ తో సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని మహాసభను ఏర్పాటు చేయడం జరిగింది మరి ఈ సభకు కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుండి పెద్ద ఎత్తున బీసీ కుల సంఘాల నాయకులు బీసీ సంఘాల నాయకులు, బీసీ ఉద్యోగులు, బీసీ మేధావులు, బిసి విద్యార్థులు కదిలి వచ్చి ఈ మహాసభను విజయవంతం చేయాలని బీసీ కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు గుంజపడుగు హరిప్రసాద్ కోరారు.

## షార్ట్ సర్క్యూట్‌తో వరి గడ్డి కట్టలు దగ్ధం


- మంటలను ఆర్పిన ఫైర్ సిబ్బంది
- 50వేల నష్టం జరిగిందన్న బాధితులు



జమ్మికుంట, జనవరి 1 (నినాదం న్యూస్) : జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మోతులగూడెం గ్రామానికి చెందిన బిట్ల చంద్రమోహన్ కవిత లకు చెందిన 800 గడ్డి కట్టలు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో కాళీ బూడిద అయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం పాడి గేదెల కోసం ఉంచిన గడ్డి కట్టలు ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో పూర్తిగా గడ్డి కట్టలన్ని కూడా కాలిపోయాయని మోత్కులగూడెం గ్రామానికి చెందిన బిట్ల చంద్రమోహన్ కవిత దంపతులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి సకాలంలో ఫైర్ సిబ్బంది స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది.గడ్డి కట్టల విలువ దాదాపు 50 వేల వరకు ఉంటుందని నిరుపేద కుటుంబానికి చెందిన పాడి రైతును ప్రభుత్వం అధికారులు చొరవ తీసుకుని తగిన న్యాయం చేయాలని స్థానికులు కోరారు.

## కురుమ సంఘం జిల్లా అడహాక్ కమిటి ఎన్నిక

- జిల్లా అధ్యక్షుడిగా కడారి ఐలయ్య, ప్రధాన కార్యదర్శిగా కర్రె రాజు ఎన్నిక



**కరీంనగర్, జనవరి 1(నినాదం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం కరీంనగర్ జిల్లా అడహాక్ కమిటి సమావేశము కరీంనగర్ ఐ టి టవర్ ప్రక్కన గల జిల్లా కురుమ సంఘం భవనములో రాష్ట్ర కార్యదర్శి ఎల్కపెల్లి లచ్చయ్య కురుమ అధ్యక్షతన జరిగినది. ఇట్టి సమావేశములో రాష్ట్ర అధ్యక్షులు యం ఎల్ సి యెగ్గె మల్లేశం కురుమ అనుమతితో అడహాక్ కమిటి జిల్లా అధ్యక్షులుగా కడారి అయిలయ్య కురుమ, ప్రధాన కార్యదర్శిగా కర్రె రాజు కురుమలను ఏకగ్రీవముగా ఎన్నుకోవడము జరిగినది. ఈ సంధర్భంగా కడారి అయిలయ్య కురుమ మాట్లాడుతూ త్వరలో కరీంనగర్ జిల్లాలోని అన్ని మండలాలలో మండల కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో అవకాశమున్న అన్ని గ్రామాలలో కురుమలను పోటీ చేయడానికి ప్రణాళిక తయారు చేయనున్నా మన్నారు. అధిక జనాభా గల కురుమలు రాజకీయముగా చాలా వెనుకబడివున్నామన్నారు. ప్రస్తుతం. రాజకీయాలకు దూరంగా ఉండడం వలన విద్యా, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక మొదలగు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నామన్నారు. 2025లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రత్యక్షముగా పాల్గొని జనాభా ప్రాతిపదికన మనకు రావల్సిన వాటా మనం సాధించుకోవల్సిన అవసరమున్నదన్నారు. జిల్లాలోని కురుమలను సమీకరించి, బోధించి ఐక్య ఉద్యమాతో మా హక్కులను సాధించకపోవడానికి పోరాటాలు చేస్తామన్నారు. ఈ సమావేశములో రాష్ట్ర ఉపాధ్యక్షులు బీర్ల బీరయ్య కురుమ, జిల్లా సలహాదారులు చెట్కూరి రాములు కురుమ, జిల్లా ఉపాధ్యక్షులు కర్రె ప్రవీణ్ కుమార్ కురుమ, యేగుర్ల అశోక్ కురుమ, జల్లా జాయింట్ సెక్రటరీ ఎగిత రవిందర్ కురుమ, జిల్లా సహాయ కార్యదర్శులు మేకల నర్సయ్య కురుమ, జూలపెల్లి రఘునందన్ కురుమ, కోశాధికారి ఎనుగుల కొమురయ్య కురుమ, జిల్లా కార్యవర్గ సభ్యులు పోలె గట్టయ్య కురుమ, బైరి మల్లయ్య కురుమ, నీల పద్మ - కుమారస్వామి కురుమ, పెద్ది రజిత - భీమ రాజ్ కుమార్ కురుమ తదితర నాయకులు పాల్గొన్నారు. ఇందుకు సహకరించిన వారందరికి అధ్యక్షలు కడారి అయిలయ్య కురుమ, ప్రధాన కార్యదర్శి కర్రె రాజు కురుమ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ జేయడమైనది.

# టీతో వీటిని తినకండి

మనదేశంలో ఎక్కువ మంది తాగే డ్రింక్ టీ. కాఫీ కన్నా కూడా టీని తాగే వారి సంఖ్యే ఎక్కువ. ఇండియాలో టీ కి ఉన్న క్రేజ్ ఇంతా అంతా కాదు. ఉదయం, సాయంత్రం ఒక కప్పు టీ తాగితే తప్ప కొందరికి రోజు గడవదు. చాలామంది టీతో పాటూ కొన్ని రకాల స్నాక్స్ తింటూ ఉంటారు. అలా తింటే వారికి మజాగా అనిపిస్తుంది. అయితే టీతో పాటూ కొన్ని రకాల స్నాక్స్ తినడం వల్ల శరీరానికి ఎంతో హాని జరిగుతుంది. టీ తాగేటప్పుడు తినకూడని పదార్థాలు కొన్ని ఉన్నాయి.



టీతో తినకూడని స్నాక్స్
వేడి వేడి టీతో స్నాక్స్ తినడం చాలా సాధారణం. టీతో కొన్ని రకాల స్నాక్స్ తినడం ఆరోగ్యానికి మంచిది కాదు. ఈ ఆహార పదార్థాలను టీతో తినడం ద్వారా, కెఫిన్ శోషణ మందగిస్తుంది, ఇది ఆరోగ్యానికి హానికరం.

గుడ్డు వంటకాలు
కొంతమంది ఉదయం అల్పాహారంలో ఆమ్లెట్ లేదా గుడ్డుతో చేసిన స్నాక్స్ తింటూ టీ తాగుతూ ఉంటారు. మీరు వారిలో ఒకరైతే%% ఆ తప్పును చేయకండి. వాస్తవానికి, గుడ్లు లేదా ఆమ్లెట్ వంటివి టీ కలిపి తినడం పూర్తిగా మానేయండి. ఇది జీర్ణించుకోవడం చాలా కష్టమవుతుంది. పొట్ట సమస్యలు ఉన్నవారు ఈ కాంబినేషన్ పూర్తిగా మానేయాలి.

టీ తయారీలో పాలను ఉపయోగించినప్పటికీ, పాలతో తయారు చేసిన ఉత్పత్తులను టీతో తినకూడదు. జున్ను, పెరుగు, క్రీమ్ వంటి పాల ఉత్పత్తులను టీతో తినడం వల్ల టీలో కనిపించే పాలీఫెనాల్స్ ప్రభావాన్ని తొలగిస్తుంది.

స్వీట్లు, కేకులు
తీపి బిస్కెట్లు, చాక్లెట్లు, స్వీట్లు, కేకులు వంటి తీపి పదార్థాలను టీతో తినడం మానుకోండి. ఈ పదార్థాలను టీతో తినడానికి రుచికరంగా అనిపించవచ్చు, కానీ ఆరోగ్యానికి మాత్రం హానికరం. నిజానికి వీటిని టీతో కలిపి తినడం వల్ల బ్లడ్ షుగర్ లెవెల్స్ వేగంగా పెరిగి శరీరంలో ఎనర్జీ లెవల్స్ తగ్గుతాయి. దీనితో పాటు, ఇది అనేక ఇతర నష్టాలను కూడా కలిగి ఉంటుంది. ముఖ్యంగా డయాబెటిస్ పేషెంట్లకు తీపి పదార్థాలను టీతో కలపడం విషంతో సమానం.

బజ్జీలు
ప్రతి ఒక్కరూ వేడి వేడి టీతో వేడివేడి బజ్జీలు తినడానికి ఇష్టపడతారు. అవి తినడానికి చాలా రుచికరంగా అనిపిస్తాయి. అయితే ఈ కాంబినేషన్ ఆరోగ్యానికి చాలా హానికరం. టీ తాగేటప్పుడు నూనెలో వేయించిన వస్తువులను జీర్ణం చేయడం కొంచెం కష్టం. అటువంటి పరిస్థితిలో, వాటిని టీతో కలిపి తినేటప్పుడు, ఈ కలయిక జీర్ణవ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది.

# ప్రతిరోజూ బ్రేక్‌ఫాస్ట్‌గా ఆపిల్ తింటే..



ఆపిల్ పండ్లను ఆరోగ్యానికి ఔషధంగా చెప్పుకుంటారు. రోజుకో ఆపిల్ పండు తింటే చాలు వైద్యుల వద్దకు వెళ్లాల్సిన అవసరమే లేదని చెప్పుకుంటారు. అది నిజమేనని ఎన్నో అధ్యయనాలు కూడా తేల్చాయి. మన రోగనిరోధక శక్తిని బలపరిచే విటమిన్ సి ఆపిల్ పండులో పుష్కలంగా ఉంటుంది. ఇందులో ఉండే ఫైబర్ కంటెంట్ జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా యాపిల్స్ లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మన కణాలను దెబ్బతినకుండా కాపాడతాయి. నెల రోజుల పాటు ప్రతిరోజూ అల్పాహారంగా ఆపిల్ తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలేంటో ఇప్పుడు చూద్దాం.
ఆపిల్ పండ్లలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఫైబర్ మీ పొట్టను ఎక్కువసేపు నిండుగా ఉంచుతుంది. తద్వారా మీకు మళ్లీ మళ్లీ ఏదైనా తినాలన్న కోరిక ఉండదు. దీని వల్ల మీరు అధిక కేలరీలు తీసుకోరు. బరువు తగ్గడానికి సహాయపడుతుంది.
కేలరీలు తక్కువ: ఆపిల్ లో తక్కువ క్యాలరీ కంటెంట్ ఉంటుంది. మీరు ఎటువంటి ఆందోళన లేకుండా మీ రోజువారీ అల్పాహారంలో ఆపిల్స్ ను తినవచ్చు.
మెటబాలిజంను పెంచుతుంది: ఆపిల్ లో ఉండే కొన్ని పదార్థాలు మీ మెటబాలిజంను పెంచడానికి సహాయపడతాయి. ఇది మీ శరీరం కేలరీలను బర్న్ చేయడానికి సహాయపడుతుంది, దీనివల్ల మీరు బరువు తగ్గుతారు.

బ్లడ్ షుగర్ ను రెగ్యులేట్ చేస్తుంది: ఆపిల్ శరీరంలో ఇన్సులిన్ లెవల్స్ ను కంట్రోల్ లో ఉంచుతుంది. బరువు పెరిగే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. దీని వల్ల మధుమేహం ఉన్నవారు ఆపిల్ తింటే ఎంతో ఆరోగ్యం. రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి.
ఆపిల్స్‌లో ఉండే కరిగే ఫైబర్ పెక్టిన్ మీ రక్తంలో చెడు కొలెస్ట్రాల్ (ఎల్ డీఎల్) ను తగ్గించడంలో సహాయపడుతుంది. దీని వల్ల మీ గుండె ఆరోగ్యంగా ఉంటుంది.
రక్తపోటును నియంత్రిస్తుంది: ఆపిల్స్ లో ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది.

హార్ట్ ఎటాక్ నివారణ: యాపిల్స్ లో ఉండే యాంటీ ఆక్సిడెంట్స్ ఫ్రీరాడికల్స్ తో పోరాడి గుండెను డ్యామేజ్ చేసి హార్ట్ ఎటాక్ రిస్క్ ను తగ్గిస్తాయి.

# అంజీర వాటర్‌తో ఆరోగ్యం





అంజీర్ పండు, దీనిని అత్తి పండు అని కూడా అంటారు. ఇది ఒక తియ్యటి, రుచికరమైన పండు. ఇది మధ్యధరా ప్రాంతానికి చెందినది, కానీ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా సాగు చేస్తున్నారు. అంజీర్ పండులో అనేక పోషకాలు ఉన్నాయి మరియు ఇది ఆరోగ్యానికి చాలా మంచిది. అంతే కాకుండా ప్రతిరోజూ ఉదయం అంజీర్ నీరు తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఇది పోషకాలతో నిండిన ఒక అద్భుతమైన పండు. దీనిని నీటిలో నానబెట్టి ఉదయాన్నే ఆ నీటిని తాగడం వల్ల శరీరం అనేక విధాలుగా లాభపడుతుంది.

**అంజీర్ పోషక విలువలు:**
అంజీర్‌లో విటమిన్లు (విటమిన్ ఎ, విటమిన్ బి, విటమిన్ కె), ఖనిజాలు (కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, ఐరన్), ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.

**అంజీర్ నీటి ప్రయోజనాలు:**

జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది:
అంజీర్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది మలబద్ధకాన్ని నివారిస్తుంది . జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఉదయాన్నే అంజీర్ నీరు తాగడం వల్ల ప్రేగు కదలికలు సులభమవుతాయి . కడుపు ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలు తగ్గుతాయి.

**గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది**
అంజీర్‌లో పొటాషియం ఉంటుంది, ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అంజీర్‌లో ఒమేగా 3 , ఒమేగా 6 ఫ్యాటీ యాసిడ్స్ కూడా ఉంటాయి, ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.


**చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది**
అంజీర్‌లో ఉండే ఫైబర్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది డయాబెటిస్ ఉన్నవారికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. అయితే, డయాబెటిస్ ఉన్నవారు అంజీర్ తీసుకునే ముందు వైద్యుల సలహా తీసుకోవడం మంచిది.

**బరువు తగ్గడానికి ..**




అంజీర్‌లో కేలరీలు తక్కువగా ఉంటాయి . ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది కడుపు నిండిన భావనను కలిగిస్తుంది, దీనివల్ల అతిగా తినడం తగ్గుతుంది . బరువు నియంత్రణలో ఉంటుంది. ఉదయాన్నే అంజీర్ నీరు తాగడం వల్ల జీవక్రియ కూడా మెరుగుపడుతుంది, ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది.

**ఎముకలను బలపరుస్తుంది..**



**అంజీర్‌లో కాల్షియం, మెగ్నీషియం, ఫాస్పరస్ ఉంటాయి, ఇవి ఎముకల ఆరోగ్యానికి చాలా ముఖ్యం. ఉదయాన్నే అంజీర్ నీరు తాగడం వల్ల ఎముకలు బలపడతాయి. ఆస్టియోపోరోసిస్ ప్రమాదం తగ్గుతుంది.**



**అంజీర్ నీటిని ఎలా తయారు చేయాలి..**
2-3 అంజీర్ పండ్లను రాత్రంతా ఒక గ్లాసు నీటిలో నానబెట్టండి. ఉదయాన్నే ఆ నీటిని వడగట్టి తాగండి. నానబెట్టిన అంజీర్ పండ్లను కూడా తినవచ్చు. ఉదయాన్నే ఖాళీ కడుపుతో అంజీర్ నీరు తాగడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి.



**రోగనిరోధక శక్తిని పెంచుతుంది**
అంజీర్‌లో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టాన్ని నివారిస్తాయి మరియు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఉదయాన్నే అంజీర్ నీరు తాగడం వల్ల శరీరం రోగాలతో పోరాడటానికి సిద్ధంగా ఉంటుంది.

**చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది**
అంజీర్‌లో ఉండే విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఇది చర్మాన్ని తేమగా ఉంచుతుంది . వృద్ధాప్య ఛాయలను తగ్గిస్తుంది. అంజీర్ నీరు తాగడం వల్ల చర్మం కాంతివంతంగా మారుతుంది.

**శక్తిని అందిస్తుంది:** అంజీర్ సహజ చక్కెరలకు మంచి మూలం. ఉదయాన్నే అంజీర్ నీరు తాగడం వల్ల శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది . రోజంతా ఉత్సాహంగా ఉంటారు.

**జాగ్రత్తలు**
అంజీర్ నీరు ఒక ఆరోగ్యకరమైన పానీయం. దీనిని ప్రతిరోజూ ఉదయం తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. కొంతమందికి అంజీర్ వల్ల అలర్జీలు వచ్చే అవకాశం ఉంది. అలాంటివారు అంజీర్ తీసుకోకపోవడం మంచిది. డయాబెటిస్ ఉన్నవారు అంజీర్ తీసుకునే ముందు వైద్యుల సలహా తీసుకోవడం మంచిది. అధిక మోతాదులో అంజీర్ తీసుకోవడం వల్ల కడుపు నొప్పి, విరేచనాలు వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అయితే, ఏదైనా ఆరోగ్య సమస్య ఉంటే వైద్యుల సలహా తీసుకోవడం ఉత్తమం.

నినాదం మార్కెట్

డిసెంబర్‌లో దూసుకుపోయిన

# మారుతి సుజుకి

భారతదేశపు ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి ఇండియా 2024 డిసెంబర్లో దేశీయ మార్కెట్లో 130,117 ప్యాసింజర్ వాహనాలను విక్రయించింది. ఇది గత సంవత్సరం డిసెంబర్లో విక్రయించిన 104,778 యూనిట్లతో పోలిస్తే 24.1 శాతం ఎక్కువ. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, 2024-25 ఆర్థిక సంవత్సరంలో, కంపెనీ ఇప్పటి వంకు 1,275,634 యూనిట్లను విక్రయించింది. ఇది గత సంవత్సరం ఇదే కాలంలో కంపెనీ విక్రయించిన యూనిట్లతో పోలిస్తే స్వల్పంగా తక్కువ.

**ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు**
మారుతి సుజుకి 2023-24 ఆర్థిక సంవత్సరంలో 2023 డిసెంబర్ చివరి వరకు 1,280,090 యూనిట్ల ప్యాసింజర్ వాహనాలను విక్రయించింది. ఎగుమతుల పరంగా కంపెనీ 2024 డిసెంబర్లో 39.1 శాతం వృద్ధిని నమోదు చేసింది. గత సంవత్సరం 26,884 యూనిట్ తో పోలిస్తే 2024 డిసెంబర్లో 37,419 యూనిట్ల వాహనాల ఎగుమతులు జరిగాయి. ఆసక్తికరంగా, 2024 డిసెంబర్లో మారుతి సుజుకి అన్ని విభాగాల్లో వృద్ధిని నమోదు చేసింది. మారుతి సుజుకి స్విఫ్ట్, డిజైర్, సియాజ్, ఇతర మోడల్స్ తో సహా దేశీయ మార్కెట్లో కంపెనీ 62,788 యూనిట్ల ప్యాసింజర్ కార్లను విక్రయించింది. మారుతి సుజుకి బ్రెజ్జా, గ్రాండ్ విటారా, జిమ్నీ, ఎక్స్ఎల్ 6 వంటి మోడళ్లు 2024 డిసెంబర్లో 55,651 యూనిట్లు అమ్ముడయ్యాయి.

**మారుతి సుజుకి ఇ విటారా..**
కార్ల తయారీ సంస్థ ఇప్పుడు తన నూతన ఉత్పత్తి మారుతి సుజుకి ఇ విటారాతో ప్యాసింజర్ ఎలక్ట్రిక్ వాహన మార్కెట్లోకి ప్రవేశించడానికి సిద్ధంగా ఉంది. ఇ విటారా 2025 భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్ పోలో అరంగేట్రం



చేయనుంది. మారుతి సుజుకి ఇ విటారాను హార్ట్ టెక్-ఇ అనే ప్లాట్ఫామ్పై నిర్మించారు. దీనిని బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాల కోసం ప్రత్యేకంగా రూపొం దించారు. ఈ ప్లాట్ ఫాం అధిక-వోల్టేజ్ రక్షణ, కాంపాక్ట్ ఓవర్ హాంగ్ ను కలిగి ఉన్న తేలికపాటి ఫ్రేమ్ వర్క్ ను కలిగి ఉంది. ఇందులో బ్యాటరీ సామర్థ్యాన్ని ఆప్టిమైజ్ చేసే వ్యవస్థ ఉన్నట్లు సుజుకి నొక్కి చెప్పింది.

**మారుతి సుజుకి ఇ విటారా స్పెసిఫికేషన్లు**
మారుతి సుజుకి ఇ విటారా ప్రపంచవ్యాప్తంగా రెండు బ్యాటరీ ప్యాక్ ఎంపికలతో లభిస్తుంది. అవి 49 కిలోవాట్, 61 కిలోవాట్. భారతీయ వినియోగదారులకు ఈ రెండు ఆప్షన్లు అందుబాటులో ఉంటాయో, లేదో ఇంకా నిర్ధారణ కాలేదు. ఈ కారు ఒక్కసారి ఛార్జ్ చేస్తే 400 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని భావిస్తున్నారు. 49 కిలోవాట్ల బ్యాటరీ (%ఎఫ్‌వతీఎ%) 142బిహెచ్ పి పవర్, 189ఎన్ఎమ్ టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది. 2 డబ్ల్యుడి మోడల్ లో 61 కిలోవాట్ల బ్యాటరీ 172 బిహెచ్ పి పవర్, 189 ఎన్ఎమ్ టార్క్ ను ఉత్పత్తి చేస్తుంది. లిథియం ఐరన్-ఫాస్ఫేట్ బ్యాటరీలతో పాటు మోటారు, ఇన్వర్టర్లను అనుసంధానించే అత్యంత సమర్థవంతమైన ఇ ఆక్సిల్ తో ఈ పవర్ట్రెయిన్ తయారైందని మారుతి సుజుకి తెలిపింది.

# ఈజీ మై ట్రిప్ సీఈఓ నిషాంత్ పిట్టి రాజీనామా..

**సోదరుడు రికాంత్‌కు బాధ్యతలు..!**




విమానం, రైలు, బస్సు ప్రయాణాల కోసం ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకునేందుకు తీసుకొచ్చిన ఈజీ మై ట్రిప్ అనే సంస్థ కో-ఫౌండర్ నిషాంత్ పిట్టి.. కంపెనీ సీఈఓగా వైదొలిగారు. వ్యక్తిగత కారణాల రీత్యా ఆయన వైదొలిగారని, ఈ నిర్ణయం జనవరి ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తుందని ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో ఈజీ మై ట్రిప్ తెలిపింది. ప్రస్తుతం సంస్థ సీఎఫ్ఓగా ఉన్న మరో కో-పౌండర్ నిషాంత్ పిట్టి సోదరుడు రికాంత్ పిట్టిని తక్షణం సీఈఓగా నియమిస్తున్నట్లు కంపెనీ పేర్కొంది. కంపెనీ సీఈఓగా రికాంత్ పిట్టి.. సంస్థ స్ట్రాటర్జిక్ ఇన్షియేటివ్స్, డ్రైవ్ ఇన్నోవేషన్, కస్టమర్ ఎక్స్ పీరియన్స్ పెంచుతూ ఈజీ మై ట్రిప్ స్థానాన్ని బలోపేతం చేస్తారని ఎక్స్ఛేంజ్ ఫైలింగ్ లో వెల్లడించింది.

ఇంతకు ముందు నిషాంత్ పిట్టి.. సంస్థలో తన వాటాను విక్రయిస్తున్నట్లు వార్తలొచ్చాయి. 2024 డిసెంబర్ 31న సంస్థలోని ఆయన షేర్లు బ్లాక్ ట్రేడ్ ద్వారా రూ.78,32 కోట్లకు విక్రయించారు. 4.99 కోట్ల షేర్లు (1.41 శాతం వాటా) అప్ లోడ్ చేశారు. ఈజీ మై ట్రిప్ బ్రాండ్ మాతృసంస్థ ఈజీ ట్రిప్ ప్లానర్. తాజా నిర్ణయంతో కంపెనీలో పిట్టి యాజమాన్యం వాటా 12.8 శాతానికి, కంబైన్డ్ ప్రమోటర్ వాటా 50.38 నుంచి 48.97 శాతానికి పడిపోయింది. గత సెప్టెంబర్ నెలలో కంపెనీలో 14 శాతం వాటాను రూ.920 కోట్లకు విక్రయించారు.

# దేశీయ రూట్లలో వై-ఫై సేవలు..

**ఎయిర్ ఇండియా విమానాల్లో ఫస్ట్..!**



టాటా సన్స్ ఆధీనంలోని ఎయిర్ ఇండియా కీలక నిర్ణయం తీసుకున్నది. తన దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసుల్లో వై-ఫై ఇంటర్నెట్ కనెక్టివిటీ సర్వీసులు అందిస్తున్నట్లు బుధవారం ప్రకటించింది. తన ఎయిర్ బస్ ఏ350, బోయింగ్ 787-9, సెలెక్ట్ ఎయిర్ బస్ ఏ321 నియో విమానాల్లో వై-ఫై కనెక్టివిటీ అందిస్తున్నట్లు తెలిపింది. దేశీయంగా విమానాల్లో ఇన్-ఫ్లైట్ వై-ఫై ఇంటర్నెట్ కనెక్టివిటీ ఆఫర్ చేస్తున్న తొలి సంస్థగా టాటా సన్స్ ' ఎయిర్ ఇండియా నిలిచింది.గతేడాది జూలైలో అంతర్జాతీయ రూట్లలో నడిచే విమానాల్లో వై-ఫై సర్వీస్ ఆఫర్ చేసింది విస్తారా ఎయిర్ లైన్స్. అయితే, నవంబర్‌లో ఎయిర్ ఇండియాలో విస్తారా ఎయిర్ లైన్స్ విలీనమైంది. విమాన ప్రయాణికులకు మొబైల్ ఫోన్లు, లాప్‌టాప్‌ల వంటి ఎలక్ట్రానిక్ పరికరాల్లో వై-ఫై ద్వారా ఇంటర్నెట్ సేవలు ఉపయోగించుకునేందుకు వెసులుబాటు కల్పించాలని టెలికం శాఖ గత నవంబర్ నెలలో ప్రకటించింది. 10 వేల అడుగుల ఎత్తున ప్రయాణిస్తున్న విమానంలో ఈ వై-ఫై సేవలు అందుబాటులోకి తేవాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో దేశీయ రూట్లలో ప్రయాణించే విమాన సర్వీసుల్లో వై-ఫై కనెక్టివిటీ తెస్తున్నట్లు ఎయిర్ ఇండియా తెలిపింది. న్యూయార్క్, లండన్, పారిస్, సింగపూర్ వంటి అంతర్జాతీయ రూట్లలో నడిచే ఎయిర్ బస్ ఏ350, సెలెక్ట్ ఎయిర్ బస్ ఏ321 నియో, బోయింగ్ బీ787-9 విమానాల్లో ఎయిర్ ఇండియా తెలిపింది. ఇంట్రడ్యూసరీ పీరియడ్‌లో భాగంగా దేశీయ సర్వీసుల్లో వై-ఫై సేవలు కాంప్లిమెంటరీగా అందిస్తారు. 'వై-ఫై సేవలు అందుబాటులోకి రావడంతో ప్రయాణికులు విమానంలో ప్రయాణిస్తున్నప్పుడు ఒకటి కంటే ఎక్కువ పరికరాలతో ఇంటర్నెట్ తో కనెక్ట్ కావచ్చు. నెట్ బ్రౌజింగ్, సోషల్ మీడియాలో చాటింగ్ చేయొచ్చు. బంధు మిత్రులకు టెక్ట్స్ మెసేజ్‌లు పంపొచ్చు' అని ఎయిర్ ఇండియా తెలిపింది.

# ఆటో.. ఫైనాన్సియల్స్ దన్నుతో తొలిరోజూ లాభాలతో శుభారంభం

అంతర్జాతీయ మార్కెట్లలో పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉన్నా దేశీయ స్టాక్ మార్కెట్లు 2025లో తొలి రోజుబుధవారం లాభాలతో శుభారంభాన్ని అందుకున్నాయి. బీఎస్ఈ -30 ఇండెక్స్ సెన్సెక్స్ 368.40 పాయిం ట్ల లబ్ధితో 78,507.41 పాయింట్ల వద్ద ముగిసింది. అంతర్గత ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 78,756.49 పాయింట్ల నుంచి 77,898. 30 పాయింట్ల మధ్య తచ్చాడింది. మరోవైపు, ఎన్ఎస్ఈ-50 సూచీ నిఫ్టీ 98.10 పాయింట్ల లాభంతో 23,742.90 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 23,562.80 పాయింట్ల కనిష్ట స్థాయి నుంచి 23,822.80 పాయింట్ల గరిష్టానికి దూసుకెళ్లాయి. ఫారెక్స్ మార్కెట్లో అమెరికా డాలర్ మీద రూపాయి మారకం విలువ రూ.85.64 వద్ద ముగిసింది. ఆటోమొబైల్, కన్జూమర్ డ్యూరబుల్స్, ఫైనాన్సియల్స్, ఎఫ్ఎంసీజీ స్టాక్స్ లాభ పడ్డాయి.
ఎన్ఎస్ఈ-50లో 37 స్టాక్స్ లాభాల్లోనే ముగిశాయి. మారుతి సుజుకి ఇండియా, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, లార్సెన్ అండ్ టర్బో, టాటా మోటార్స్ తదితర సంస్థలు 3.01 శాతం లాభ పడ్డాయి. మరోవైపు డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, హిందాల్కో, అదానీ పోర్ట్స్, ఓఎన్జీసీ, టాటా స్టీల్ సహా 13 స్టాక్స్ 1.40 శాతం వరకూ నష్టపోయాయి. బ్రాడర్ మార్కెట్లు నిఫ్టీ మిడ్ క్యాప్-100 0.44 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్ 1.02 శాతం లాభ పడ్డాయి. నిఫ్టీలో రియాల్టీ, ఫార్మా మినహా అన్ని సెక్టార్లు లాభాలతో ముగిశాయి. నిఫ్టీ



ఆటో గరిష్టంగా 1.34 శాతం లాభ పడింది.
బీఎస్ఈ సెన్సెక్స్‌లో 30 స్టాక్స్ కు గాను 23 స్టాక్స్ లాభాలతో స్థిర పడ్డాయి. మారుతి సుజుకి, మహీంద్రా అండ్ మహీంద్రా, లార్సెన్ అండ్ టర్బో, టాటా మోటార్స్, ఇండస్ఇండ్ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, పవర్ గ్రిడ్, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్ సహా లాభ పడ్డాయి. మరోవైపు హిందూస్థాన్ యూనీ లివర్, టెక్ మహీంద్రా, హెచ్ సీఎల్ టెక్, జొమాటో, టాటా స్టీల్, అదానీ పోర్ట్స్ నష్టాలతో ముగిశాయి. సుజ్లాన్, రిలయన్స్ ఇన్ ఫ్రా, జీఎంఆర్ పవర్, సీక్వెంట్, రిలయన్స్ పవర్ సహా 317 స్టాక్స్ అప్పర్ సర్క్యూట్ తాకాయి. బీఎస్ఈ స్మాల్ క్యాప్-100 సూచీ 1.03, బీఎస్ఈ మిడ్ క్యాప్-100 సూచీ 0.50 శాతం లాభ పడ్డాయి.

# పెరిక సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించిన కందుల

- పెరిక సంఘం రాష్ట్ర మహిళా నాయకురాలు కందుల సంధ్యారాణి





**గోదావరిఖని జనవరి 01 (నినాదం న్యూస్):** కుక్కలగూడూర్ గ్రామంలోని శివరామ పురిగరి క్షత్రీయ పెరిక సంఘం ఆద్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని గణం చేపట్టారు.. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పెరిక సంఘం మహిళా నాయకురాలు కందుల సంధ్యారాణి హాజరై, క్యాలెండర్ ని ఆవిష్కరించడం జరిగింది.. ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ..పాత సంవత్సరపు చేదు, తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ... కొత్త ఆశలతో కొత్త సంవత్సరంలో.. అడుగిడుతున్న సందర్భంగా పెరిక కుల బంధు వులకి ఆంగ్ల నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలియజేసారు.. పెరిక కులం గౌరవం, ఐక్యత, సంస్కృతి పరిరక్షణకు సంఘం చేస్తున్న కృషిని ఈ సందర్భంగా అభినందించారు. క్యాలెండర్ రూపకల్పనలో ప్రతీ అంశం కుల సంప్రదాయాలను ప్రతిబింబిస్తోందని, ఈ ప్రయత్నం భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు..సంఘ అభివృద్ధికోసం ప్రతీ ఒక్కరూ కృషి చెయ్యాలని,మా వంతు సహయ సహకారాలు ఎల్లవేలలా ఉంటాయన్నారు.. ఈ కార్యక్రమంలో పెరిక సంఘం గౌరవ అధ్యక్షులు బోడకుంటి సత్తయ్య,అధ్యక్షులు బోడకుంటి తిరుపతి,వైస్ ప్రెసిడెంట్ మేడం తిరుపతి,ప్రధాన కార్యదర్శి నలిమెల సాగర్,చెల్ల శ్రీనివాస్,కందుల శ్రీనివాస్,బొడ్డు రాజేశం, రామన్న, సుధాకర్, విఠల్, మల్లయ్య, పోచన్న, బాపన్న, శంకరయ్య, రంజీత్, సాయికుమార్, సతీష్, శంకరయ్య, మహేష్, గోపాల్, రవి, మొండయ్య, లచ్చన్న,మల్లేష్,గంగారాం,రవి తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఉజ్జీవంతో ముందుకు సాగాలి - రెవరెండ్ వల్లూరి ప్రభాకర్



**మంథని టౌన్ జనవరి 01 (నినాదం న్యూస్) :** కొత్త సంవత్సరంలో నూతన ఆలోచనలు చేస్తూ నూతన ఉజ్జీవముతో ముందుకు సాగాలని రెవరెండ్ వల్లూరి ప్రభాకర్ అన్నారు. బుధవారం మంథని పట్టణంలోని సీయోను ప్రార్థన మందిరంలో నూతన సంవత్సరం ప్రత్యేక ఆరాధన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో దేవుడు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చే విధంగా ప్రతిరోజు బైబిల్ చదువుతూ ప్రార్థనలు చేస్తూ రోజురోజుకు ఆత్మీయంగా ఎదగాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర వాగ్దానాలను ప్రార్ధనాపూర్వకంగా స్వీకరించారు. నూతన సంవత్సర కేకును కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం సహా పంక్తి భోజనాలు చేసి ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుంటూ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు దూడ మహేష్, మంథని మార్క్, అజ్మీరా దయారాజ్, కలువల సమూయేలు, గద్దల రాజేష్, సంఘ పెద్దలు అంకరి కుమార్, ఎంకే జోసఫ్, మంథని ప్రసాద్, అందే రమేష్, చింతకుంట్ల ప్రేమ్ కుమార్, ఈర్ల సదానందం, దాసరి సదానందం, రామగిరి కుమార్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## మాదిగ వర్గీకరణకు నిరుద్యోగ బీసీ కళాకారుల మద్దతు

**పెద్దపల్లి, జనవరి1 (నినాదం) :** మాదిగ ఉపకులాల వర్గీకరణకు తెలంగాణా ఉద్యమ నిరుద్యోగ బి.సి. కళాకారుల సంఘం మద్దతు తెలిపింది.ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర నాయకులు దరువు వెంకటస్వామి మాట్లాడుతూ, తెలంగాణా ఉద్యమంలో పాల్గొన్న కళాకారులను బి.ఆర్.ఎస్.ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందని,వారికి సంబందించిన 550 మందికి ఉద్యోగాలు ఇచ్చి,నిజమైన కళాకారులను ముంచిందని ఆరోపించారు.కనీసం కాంగ్రెస్ ప్రభుత్వంలో అయినా న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.వెయ్యి గొంతులు,లక్ష డప్పుల పేరుతో జనవరి 27న హైదరాబాదులో మందక్రిష్ణ మాదిగ చేపట్టిన మహా ప్రదర్శనకు దళితులు పెద్ద ఎత్తున తరలిరావాలని వెంకటస్వామి పిలుపునిచ్చారు.భారత ప్రధాని నరేంద్రమోదీ సైతం వర్గీకరణకు మద్దతుగా నిలవడం గొప్ప విషయమన్నారు.కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్లను అమలు పరిచి తన నిజాయతిని చాటుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బి.సి.నిరుద్యోగ కళాకారులు నకిరెకంటి కిరణ్,పూసాల రమాణాచారి,నిట్టూరి స్వరూప, కలవేన రాణి,దబ్బెట పుష్పలత, ఎమ్మార్పిస్ నాయకులు ముంజం వెంకటస్వామి,మంథని చందు, రేణుగుంట సాగర్,దాసరి కిషన్,పల్లె బాపు,కాసిపేట రాజయ్య,దశరథం, సైనీష్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో మహిళ మృతి



**మంథని జనవరి 1( నినాదం న్యూస్):** మంథని మండలం అడవిసోమన్ పల్లి గ్రామానికి చెందిన కడారి లక్ష్మి ( 51) బుధవారం విద్యుత్ షాక్ తో మృతి చెందినట్లు మంథని ఎస్ఐ రమేష్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం తన వ్యవసాయ పొలం వద్ద ఒడ్డుపై గల గడ్డి కోస్తున్నా క్రమంలో ఒడ్డు పై ఉన్న బోరు వైరును ప్రమాదవశాత్తు చూడకుండా కోయగా కరెంటు వైర్ తెగి విద్యుత్ షాకు తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఆమె కూతురు సదిరం రాజేశ్వరి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

**గరిడేపల్లి, జనవరి01 (నినాదం న్యూస్):** గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల అప్పనపేట గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది ఎస్ఐ చలికంటి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం అడుక్కుంటూ జీవనం సాగిస్తున్న భిక్షం సుమారు (50)అనే వ్యక్తి పది రోజుల క్రితం అనారోగ్యంతో క్రింద పడిపోగా స్థానికులు గుర్తించి అంబులెన్స్ లో హుజూర్ నగర్ ప్రభుత్వ హాస్పిటల్ కి తరలించారు.ట్రీట్మెంట్ జరుగుతున్న క్రమంలో చనిపోయినట్లు తెలిపారు.6 అడుగుల ఎత్తు ఉంటాడని, మృతిని వివరాలు తెలిసిన వారు గరిడేపల్లి ఎస్ఐ నెంబర్. 87126 86053 కి సంప్రదించాలని ఎస్సై నరేష్ తెలిపారు.

## ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోడీ



**న్యూఢల్లీ, జనవరి1 (నినాదం న్యూస్):** నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం ఎక్స్ లో పోస్టు చేశారు. ఈ సంవత్సరం కొత్త అవకాశాలు, విజయాలు, అంతులేని ఆనందాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు. 'హ్యాపీ 2025! ఈ సంవత్సరం ప్రతి ఒక్కరికీ కొత్త అవకాశాలు, విజయాలు మరియు అంతులేని ఆనందం తీసుకురావాలి. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం, శ్రేయస్సుతో ఆశీర్వదించబడాలి' అని ఆయన ఎక్స్ లో పేర్కొన్నారు.

# ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రమాద రహిత మాసోత్సవాలు



**మంథని టౌన్, జనవరి01 (నినాదం న్యూస్) :** మంథని పట్టణంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో బుధవారం నుండి ఈనెల 31 వరకు ప్రమాద రహిత మాసొత్సవాలు నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ వి.శ్రవణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బస్ డిపో లో ప్రారంభించిన ఈ కార్యక్రమానికి పెద్దపల్లి అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వంశీకృష్ణ హాజరై డ్రైవర్ల కు ప్రమాదాలు జరగకుండా విలువైన సలహాలు ,సూచనలను తెలియజేశారు. డిపో మేనేజర్ సైతం డ్రైవింగ్ చేసే సమయంలో డ్రైవర్లు అజాగ్రత్త వహించకుండా చాకచక్యంగా వ్యవహరిస్తూ డ్రైవింగ్ చేయాలని సూచిస్తూ ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అలాగే మంథని డిపో యాక్సిడెంట్లో ఇప్పటివరకు జీరో స్టేజిలో ఉందని అందుకు సహకరించిన డ్రైవర్లను, సిబ్బందిని డిపో మేనేజర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎల్ హెచ్ శ్రీనివాస్ . ఆర్ హెచ్ సి వెంకటేశ్వర్లు.ఎస్ డి ఐ.గోపాల్, డ్రైవర్లు.,మెకానిక్ లు.కండక్టర్ లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సింగరేణిలో పని వేళలు పాత పద్ధతిలోనే కొనసాగించాలని సీఎండీకి వినతి

- ఆర్జీ3 ఓసీ1 కార్మికులు
- ఐఎన్టీయూసీ కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతియాదవ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ
- గని ప్రాజెక్ట్ అధికారి, మేనేజర్‌లకు వినతిపత్రం అందజేత



**8 ఇంక్లైన్ కాలనీ, జనవరి 1, నినాదం న్యూస్ :** సింగరేణిలో పనిచేస్తున్న కార్మికుల పని వేళల్లో మార్పుల గురించి ఆలోచన చేసి మార్చే ప్రయత్నం క్రమంలో గని కార్మికులు గెలిచిన సంఘం ఐఎన్టియూసి నాయకులతో ప్రస్తుత పని వేళలు మా కుటుంబాలకు అనుకూలంగానే ఉండి మాకు ఆరోగ్యపరంగా ఉందని ప్రస్తుత పనివేళలే కొనసాగించాలని కోరడముతో సింగరేణి ఆర్జీ3 ఓసి1 సైట్ ఆఫీసులో ఐఎన్టియుసి కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్ ఆధ్వర్యంలో వినతి పత్రంపై కార్మికుల సంతకాల సేకరించి గని ప్రాజెక్ట్ అధికారి రాజశేఖర్ మరియు గని మేనేజరు ఉదయ్ హరిజనులకు సంయుక్తంగా కలిసి కార్మికుల సమక్షంలో ఆ వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గని పిట్ కార్యదర్శి వెంకట స్వామిలతో పాటు నాయకులు ఏం ప్రభాకర్ రెడ్డి, ఆనంద్, సంజీవయ్య, కనకసేనారెడ్డి, బాలాంకుస్, రాజిరెడ్డి, సమ్మిరెడ్డి, సాంబయ్య, వెంకటస్వామి గని ఉద్యోగులు పాల్గొన్నారు.

# వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు





**సుల్తానాబాద్, జనవరి 01(నినాదం న్యూస్):** వాకర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవ త్సర వేడుకలుఘనంగానిర్వహించారు.బుధవా రం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నూతన సంవ త్సర వేడుకలను పురస్కరించుకుని వాకర్ అసో సియేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపి ణీ చేశారు.ఈ సందర్భంగా కొత్త సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితాల్లో ఎన్నో ఆనందాలుతీసుకురావా లని,హ్యాపీ న్యూ ఇయర్ అనే నినాదంతో కేకలు వేస్తూఒకరికొకరుశుభాకాంక్షలు తెలుపుకున్నారు. అదేవిధంగా ఆరోగ్యమేమహాభాగ్యంఅనే నినాదా న్ని అనుసరించి అన్నింటికీ నడకే శ్రీరామరక్ష అని, పట్టణ ప్రజలు ప్రతిరోజు నడక వ్యాయామం పై ఆ సక్తి పెంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ ఐలరమేష్,అధ్యక్షుడు బైర గొ నిరవీందర్ గౌడ్,ప్రధాన కార్యదర్శి మంద శ్రీనివాస్ గౌడ్,క్యాషియర్ కామని శ్రీకాంత్,చొప్పరిసుమన్ తోపాటు కొమురవెల్లి భాస్కర్,అజయ్,రాజేంద్ర ప్ర సాద్,తిరుపతి,నిట్టూరి శ్రీనివాస్,లింగ మూర్తి, మ ల్లేశం, రవీందర్, కుమార్, రాజలింగు,లచ్చన్న,రామ కృష్ణ,వెంకన్న, వేణు, శ్రీనివాస్,సురేష్,ఎల్లయ్య, రా మచంద్రం,ప్రశాంత్,కాశీం,పరశు రాం అధిక సంఖ్య లో వాకర్స్ పాల్గొన్నారు.

# సిద్ధి వినాయక ఆలయంలో హరీశ్‌రావు పూజలు





**సంగారెడ్డి, జనవరి1(నినాదం న్యూస్):** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గతంలో స్వయంభూ సిద్ధివినాయక ఆలయాన్ని ఎంతో అభివృద్ధి చేశారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా రేజింత్‌లో స్వయంభూ సిద్ధివినాయక 225వ జయంతి ఉత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ పాలక మండలి ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ..స్వయంభూ సిద్ధి వినాయక జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. సిద్ధి వినాయకుడు దినదినము ఆకారం పెంచుకుంటూ ఇక్కడికి వచ్చే భక్తుల కోరికలు నెరవేరుస్తూ వస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక మహారాష్ట్ర, ఆస్ట్రేలియా నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఇక్కడికి వచ్చి స్వామి దర్శనం చేసుకుంటున్నారని తెలిపారు. ప్రతి సంవత్సరం సిద్ధి వినాయక జయంతి ఉత్సవాలు గొప్పగా జరగడం సంతోషకరమైన విషయం. స్వామివారి పుష్పార్చన కార్యక్రమంలో పాల్గొనడం మరింత సంతోన్ని చ్చిందన్నారు. ఇలాంటి విశిష్టత ఉన్న సిద్ధి వినాయకుడిని మరెక్కడా మనం చూసి ఉండమన్నారు. నూతన సంవత్సర సందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ సుఖ, సంతోషాలతో ఉండాలని ఆ భగవంతుడిని ప్రార్థించానన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నేతలు, తదితరులు ఉన్నారు.

# ఎయిర్ ఇండియా విమానాల్లో వైఫై సౌకర్యం

- అందుబాటులోకి తెచ్చిన టాటా గ్రూపు

**న్యూఢల్లీ, జనవరి1(నినాదం న్యూస్):** టాటా గ్రూప్‌నకు చెందిన విమానయాన సంస్థ ఎయిరిండియా వైఫై ఇంటర్నెట్ సర్వీసులకు శ్రీకారం చుట్టింది. దేశీయ, విదేశీ విమాన సర్వీసుల్లో ఈ సేవలు అందుబాటులోకి తెచ్చింది. ఎయిర్‌బస్ ఏ350, బోయింగ్ 787-9తో పాటు ఎంపిక చేసిన ఏ321 నియో విమానాల్లో ఈ సేవలు లభిస్తాయి. దేశీయంగా ఈ తరహా సేవలందిస్తున్న తొలి విమాన సంస్థ తమదేనని ఎయిరిండియా ఓ ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం న్యూయార్క్, లండన్, పారిస్, సింగపూర్ వంటి అంతర్జాతీయ మార్గాల్లో నడుస్తున్న ఎయిర్‌బస్ ఏ350, ఎయిర్‌బస్ ఏ321 నియో, బోయింగ్ బి787-9 ఎయిర్ క్రాఫ్ట్‌లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఎయిరిండియా వైఫై సేవలను అందిస్తోంది. దీనికి కొనసాగింపుగా దేశీయంగానూ ఈ సేవలను ప్రారంభించినట్లు తెలిపింది. ల్యాప్‌టాప్, ట్యాబెట్లు, ఐఓఎస్, ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్ వంటి డివైజుల్లో ఈ వైఫై సేవలను ఆనందించొచ్చు. విమానం 10 వేల అడుగుల ఎత్తుకు చేరాక ఈ సేవలు లభిస్తాయి. ఒకేసారి పలు డివైజులను వైఫైకి కనెక్ట్ చేయొచ్చు. తొలుత కాంప్లిమెంటరీగా ఈ సేవలు లభిస్తాయని, త్వరలో మరిన్ని విమానాల్లోనూ ఈ సేవలను ప్రారంభించనున్నట్లు ఎయిరిండియా తెలిపింది.

# ప్రతీ మనిషికి భగవద్గీత ఒక సంజీవని

- విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి సత్యం



**పెద్దపల్లి, జనవరి01(నినాదం) :** ఆధునిక యుగంలో,హడావుడి జీవనానికి అలవాటుపడిన ప్రతీ మనిషికి భగవద్గీత సంజీవని వంటిదని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి నాగులమల్యాల సత్యం అన్నారు.బుదవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సత్యం మాట్లాడుతూ, భగవద్గీత పట్ల ఆసక్తి గలవారికోసం ప్రతీ గురువారం శ్రీలక్ష్మీ గణపతి దేవాలయంలో సాయంత్రం 6గంటల నుండి సామూహిక భగవద్గీత పారాయణం చేపట్టినట్లు తెలిపారు. భగవద్గీత పారాయణం వల్ల జీవితంలో ఎదురయ్యే సవాళ్ళను ధైర్యంగా పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా జీవితంలో విజయాలు సాధించన వారి జీవితాల్లో భగవద్గీత చూపిన ప్రభావాన్ని సత్యం ఈ సందర్భంగా గుర్తు చేశారు. పారాయణంలో పాల్గొనదలచిన వారు 8978991377 నంబరులో సంప్రదించవచ్చునని తెలిపారు.

## హమాలి కూలి రేట్ల జీవోను వెంటనే విడుదల చేయాలి

- ఏఐటీయూసీ నాయకుడు మైలారం తిరుపతి




**సుల్తానాబాద్, జనవరి 01 (నినాదం న్యూస్):** హమాలి కూలి రేట్ల జీవోను వెంటనే విడుదల చే యాలని ఏఐటియుసి హమాలీ సంఘం నాయకు డు మైలారం తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చే శారు. బుధవారం సుల్తానాబాద్ మండల కేంద్రం లోని సివిల్ సప్లై గోదాం వద్ద నిరవధిక సమ్మె లో భాగంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పెంచిన సివిల్ సప్లై హమాలీ కూలి రేట్ల జీవోను వెంటనే విడుదల చేయాలని కోరుతూ సుల్తానాబాద్ పట్టణ సివిల్ సప్లయ్ గోదాంలో పనిచేస్తున్న హమాలీ కార్మికు లు నిరవధిక సమ్మె చేపట్టామని అన్నారు. ప్రభు త్వం పెంచిన కూలీ రెట్లను అమలు చేసే వరకు సమ్మె కొనసాగుతుందని ఏఐటీయూసీ హమాలీ సంఘం నాయకుడు మైలారం తిరుపతి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



**జనవరి 1 (నినాదం న్యూస్) :** మంథని మండలం బిట్టుపల్లి, ధర్మారం గ్రామంలోని సీయోను ప్రార్థన మందిరంలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఈ కార్యక్రమంలో స్థానిక పాస్టర్ సంఘ పెద్దలు కొయ్యల కృష్ణస్వామి, మంథని సది,మంథని వెంకటేష్, కొయ్యల హనుమంతు కొయ్యల దేవేందర్, రాజేష్‌లతో పాటు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ



**సుల్తానాబాద్, జనవరి 01 (నినాదం న్యూస్):** సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని శాస్త్రి నగర్ లో గల అభయాంజనేయ స్వామి దేవాలయం లోని అయ్యప్ప వీరిది లో బుధవారం అయ్య ప్ప స్వాములకు పట్టణానికి చెందిన సీనియర్ జర్న లిస్ట్ కందుకూరి పద్మ ప్రకాష్ రావు దంపతులు అ న్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గత 15 సంవత్సరాలుగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్,మాజీ సర్పంచ్ గురు స్వామి సాయిరి పద్మ మహేందర్ ల ఆధ్వర్యంలో గురు స్వామి మిట్టప ల్లి మురళి సమక్షంలో పూజలు ఘనంగా నిర్వహి స్తున్నారు. గత 45 రోజులుగా నిత్య అన్న దాన ప్రసాదం కార్యక్రమం నేటికీ చివరి రోజున కావడం తో ప్రకాష్ రావు పెద్దన్న దంపతులు ప్రత్యేక పూజ లు నిర్వహించి అన్న ప్రసాద చేశారు. ఈ కార్యక్ర మంలో అయ్యప్ప స్వామి ప్రముఖ రైస్ మిల్లర్ జై పాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్‌కి శుభాకాంక్షలు తెలిపిన తుమ్మేటి ప్రవీణ్ రెడ్డి



**జమ్మికుంట, జనవరి1 (నినాదం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని జమ్మికుంట మాజీ మార్కెట్ చైర్మన్ దివంగత నేత తుమ్మేటి సమ్మిరెడ్డి తనయుడు తుమ్మేటి ప్రవీణ్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క ని అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.. ఈ సందర్భంగా తుమ్మేటి ప్రవీణ్ రెడ్డి ని మంత్రి పొన్నం ప్రభాకర్ దీవిస్తూ భవిష్యత్ లో ఉన్నత పదవులు పొంది నియోజకవర్గ ప్రజలకు సేవలందిస్తూ తండ్రికి తగ్గ తనయుడు గా ఎదగాలని ఆశీర్వదించారు..అనంతరం హుజురాబాద్ నియోజకవర్గంలోనీ రైతులకు నూతన సంవత్సర లో పంటలు మంచిగా పండాలని అందరి కుటుంబాల్లో వెలుగులు నింపాలని ఆ భగవంతున్ని మనస్ఫూర్తిగా కోరుకుంటూ నూతన సంవత్సర శు భాకాంక్షలు ప్రవీణ్ రెడ్డి తెలిపారు.

## మోహన్ భగవత్‌కు కేజ్రీవాల్ లేఖ



**న్యూఢల్లీ, జనవరి1(నినాదం న్యూస్):** దేశ రాజధాని ఢల్లీలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), బీజేపీ మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో బీజేపీ సైద్ధాంతిక మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌కు ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ లేఖ రాశారు. కొత్త ఏడాది ఆరంభమైన బుధవారం, బీజేపీ రాజకీయాలకు సంబంధించి పలు ప్రశ్నలు సంధించారు. బీజేపీ తప్పులకు ఆర్‌ఎస్‌ఎస్ మద్దతిస్తుందా? అని కేజ్రీవాల్ నిలదీశారు. 'బీజేపీ నేతలు బహిరంగంగా డబ్బులు పంచుతున్నారు. ఓట్లు కొనేందుకు ఆర్‌ఎస్‌ఎస్ మద్దతిస్తుందా దళిత, పూర్వాంచల్ ప్రజల ఓటర్లను పెద్ద ఎత్తున ఓటరు జాబితాల నుంచి తొలగిస్తున్నారు. ప్రజాస్వామ్యానికి ఇది మంచిదని ఆర్‌ఎస్‌ఎస్ భావిస్తుందా ప్రజాస్వామ్యాన్ని బీజేపీ నిర్వీర్యం చేస్తోందా?' అని కేజ్రీవాల్ ఆ లేఖలో ప్రశ్నించారు. కాగా, కేజ్రీవాల్ లేఖపై బీజేపీ ఘాటుగా స్పందించింది. 'అబద్ధాలు, మోసం అనే మీ తప్పుడు అలవాట్లను వదిలిపెట్టి మీలో అర్థవంతమైన మార్పు తీసుకువస్తారని ఆశిస్తున్నాం' అని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా అన్నారు. ఈ మేరకు అరవింద్ కేజ్రీవాల్‌కు తాను లేఖ రాసినట్లు ఆయన వెల్లడిరచారు.

## పోటీతత్వంతోనే విజయాలు సొంతం

### మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి




**కరీంనగర్, జనవరి 1(నినాదం న్యూస్):** పోటీ తత్వంతో ఆడినప్పుడే క్రీడల్లో విజయాలను సొంతం చేసుకోవచ్చని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం బెజ్జంకి మండల కేంద్రంలో బెజ్జంకి క్రికెట్ అసోసియేషన్ (బీసీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 47వ ఉమ్మడి జిల్లా స్థాయి ఎమ్మెల్యే క్రికెట్ టోర్నమెంట్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ యువత విద్యతో పాటు క్రీడా రంగంలో రాణించాలన్నారు. నైపుణ్యాన్ని పెంచుకోవడం ద్వారా క్రీడల్లో సత్తా చాటవచ్చన్నారు. గ్రామీణ ప్రాంత యువకులు క్రికెట్ లో చక్కటి ప్రదర్శన ద్వారా గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదగాలని, తద్వారా మానకొండూర్ నియోజకవర్గానికి పేరు తెచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమేనని, ఓటమి గెలుపునకు నాంది కావాలన్నారు. 47సంవత్సరాలుగా నిర్విరోధంగా క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించడం గొప్ప విషయమని ఆ నిర్వాహకులను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి,వర్కింగ్ ప్రెసిడెంట్ అక్కరవేణి పోచయ్య ముదిరాజ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శరత్ కుమార్,లక్ష్మీనరసింహస్వామి ఆలయ చైర్మన్ జెల్ల ప్రభాకర్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సందీప్,పార్టీ నాయకులు చెప్యాల శ్రీనివాస్, పర్ష సంతోష్, ఎండీ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆనందంగా ఉండాలి

### రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు



**మంథని, జనవరి 1 (నినాదం న్యూస్):** పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గ ప్రజలందరికీ తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు శుభాకాంక్షలు తెలిపారు. 2025 కొత్త విజయాలు, ఆరోగ్యం, ఆనందంతో మీ కుటుంబాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు.
మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం తరపున పార్టీ తరపున మరోసారి మంత్రి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

## 300 కోట్లతో రామగుండం నియోజకవర్గాన్ని

# అభివృద్ధి చేస్తున్నాం

- ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగనివ్వం
- అభివృద్ధి చూసి ఓర్వలేకపోతున్నా బీఆర్ఎస్ నేతలు
- రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్



**గోదావరిఖని జనవరి 01 (నినాదం న్యూస్):** రామగుండం పారిశ్రామిక ప్రాంతం, నియోజకవర్గాన్ని సుమారు 300 కోట్లతో అభివృద్ధి చేపడుతున్నామని శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ అన్నారు. ఈ మేరకు గోదావరిఖనిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగనివ్వమని, అందరికీ 2 లక్షల వరకు రుణ మాఫీ చేస్తున్నామని, ఇప్పటికే 25 వేల కోట్లకు పైగా రుణమాఫీ చేశామన్నారు. అలాగే ఓవైపు అభివృద్ధి చేస్తుంటే మరోవైపు ఆరోపణలు చేయడం సరైన విధానం కాదని బీఆర్ఎస్ పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా పూర్తి చేస్తున్నామన్నారు. రైతులు పండించిన పంటను కొనుగోలు చేయడంతో పాటు సన్నాలకు 500 బోనస్ కూడా ఇచ్చామన్నారు. ఇదంతా చేస్తూ ఉంటే సిగ్గు, మానం, బుద్ధి లేకుండా ఉద్యమాలు చేపడతామని బీఆర్ఎస్ నాయకులు అనడం విడ్డూరంగా అనిపిస్తుందని అన్నారు. అధికారంలోకి వచ్చిన తక్కువ సమయంలోనే 55 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చామని, ప్రతి పనిని పారదర్శకతతో పనిచేస్తున్నామని అన్నారు. దావోసస్ కు వెళ్ళి కోట్ల నిధులు తీసుకువచ్చామన్నారు. విద్యాశాఖ విషయంలో పిల్లలకు 40 శాతం మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచి కొత్త అధ్యయనానికి శ్రీకారం చుట్టామన్నారు. కొత్త బిల్డింగ్ లు, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్స్, స్పోర్ట్స్ యూనివర్సిటీస్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇచ్చిన హామీల కంటే ఎక్కువగా పనులు చేస్తున్నామన్నారు. ఓవైపు అభివృద్ధి చేస్తుంటే బీఆర్ఎస్ పార్టీ నేతలకు కళ్ళు కనబడడం లేదని... చెవులు వినబడడం లేదా... అని ప్రశ్నించారు. కోల్ బెల్ట్ ప్రాంతాన్ని స్థానిక సంస్థల భాగస్వామ్యంతో మరింత అభివృద్ధి చేస్తున్నామన్నారు. అభివృద్ధి విషయంలో ఆత్రుత పడుతుంటే మరోవైపు బీఆర్ఎస్ పార్టీ నేతలు ఇష్టానుసారంగా మాట్లాడుతూ... ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

## పిఆర్‌టియుటిఎస్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి,జనవరి01(నినాదం న్యూస్):** పిఆర్‌టియుటిఎస్ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో నూతన సంవత్సర శుభాకాంక్షలుతో 2025 డైరీ క్యాలెండర్ ను జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవా లక్ష్మీ, కాగజ్ నగర్ లో సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ జిల్లాలో విద్యా ప్రమాణాలు పెరుగుదలకు మరియు విద్యార్థుల హాజరు శాతం పెరుగుదలకు ఉపాధ్యాయులు నిరంతర శ్రమిస్తున్నారని, పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో, విద్య వైద్యం అభివృద్ధి చేయడంలో ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందన్నారు. ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవా లక్ష్మీ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానన్నారు. ఐటిడిఏ, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సిర్పూర్ శాసనసభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ జిల్లాకు రెగ్యులర్ డిఈవో ఉండే విధంగా కృషి చేస్తానని, డైట్ కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరం నుండే ప్రవేశాలు ప్రారంభించే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏటుకూరి శ్రీనివాసరావు, సునార్కర్ అనిల్ కుమార్ లు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ఉపాధ్యాయులకు మెరుగైన పిఆర్సి సాధించే విధంగా సంఘం కృషి చేస్తుందన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని, పెండింగ్లో ఉన్న బిల్లులన్నిటిని ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను పదోన్నతులతో భర్తీ చేయాలని, రెగ్యులర్ డిఈవో పోస్టు మంజూరు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏ.శ్రీనివాసరావు, ఎస్ అనిల్ కుమార్, సంఘం నాయకులు ఉదయ బాబు, వెంకటేశ్వర్లు, రాజు, వేణు గోపాలరావు, ప్రభాకర్, అనురాధ భాయి ,వరలక్ష్మి , అరుంధతి అనసూయ, కవిత ,గంగా భవాని సమత, సుజాత, రాకేష్, ఇందారపు ప్రకాష్, బాబు రావు, సోనేరావు, జ్ఞానేశ్వర్, రవిశంకర్, శశికాంత్ ,బాలు నాయక్, శ్రీనివాస్, బిక్షపతి, గోర్ సింగ్, వినేష్, జగదీష్, సదానందం , ఖాదర్, లాలా జీ, యాదగిరి, వెంకటేష్, శ్రీనివాస్, దామోదర్, రౌతు రవి , లక్ష్మయ్య, చరణ్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

### జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు



**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, జనవరి 01(నినాదం న్యూస్):** శాంతి భద్రతల దృష్ట్యా, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణ పరిస్థితులను మరింత సవ్యంగా కొనసాగించడానికి జనవరి నెల 1వ తేదీ నుండి జనవరి 31 వ తేది వరకు జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు ఐపీఎస్ తెలిపారు. ఈ మేరకు శనివారం జిల్లా పోలీసు కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేస్తూ వివరాలు వెల్లడించారు. 30 పోలీస్ యాక్ట్-1861 అమల్లో ఉన్నందున జిల్లాలో డిఎస్పి లేదా ఆపైపోలీస్ ఉన్నతాధికారుల నుండి ముందస్తు అనుమతి లేకుండా ఏలాంటి ప్రజా సమావేశాలు, ఊరే గింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, తదితర ప్రజలు గుమికూడి ఉండేవి ధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. నిషేధిత ఆయుధాలు, దురుద్దేశంతో నేరాలకు ఉసికోలిపే ఎటువంటి ఆయుధాలు కల్గిఉండరాదని తెలిపారు. ప్రజా జనజీవనానికి ఇబ్బంది, చిరాకు కల్గించేందుకు దారితీసే ఇబ్బందికర ప్రజా సమావేశాలు, జన సమూహం అలాంటివి పూర్తిగా నిషేధం అన్నారు. చట్టపరమైన జారీచేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం శిక్షా ర్హులు అవుతారని సూచించారు. నిషేధంలో ఉన్న నిబంధనలను తప్ప నిసరిగా అందరూ పాటించాలన్నారు. ఎలాంటి కార్యక్ర మాలు నిర్వహించాలన్న ముందస్తుగా దరఖాస్తు చేసుకొని అనుమతులు తీసుకోవాలని సూచించారు. 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున ఎటువంటి అను మతులు లేని ర్యాలీలు నిర్వహించిన వారిపై కఠిన మైనచర్యలు తప్పవని హెచ్చరించారు.

## స్వచ్ఛ ఆటో వారి అరాచక వసూళ్లు..

**– పారిశుద్ధ్య అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీవాసుల విజ్ఞప్తి**




**అల్వాల్, డిసెంబర్ 31 (నినాదం న్యూస్):** ఇళ్లలో చెత్త తీసుకెళ్లే స్వచ్ఛ ఆటో వారి డిమాండ్ కు అదుపు లేకుండా రూపాయిలు వసూలు చేస్తున్నారని, లేదంటే చెత్త తీసుకెళ్ళమని మోరాయి స్తున్నారని ప్రెసిడెన్సి కాలని ప్రధాన కార్యదర్శి నర్ర శ్రీనివాస్ రెడ్డి ఆరోపిం చారు. ఒక ఇంటికి రూ 200ల నుండి రూ 600లు ఆపైన కూడా వసూలు చేస్తూ.. చెత్త తీసుకెళ్లే వారి డిమాండ్లతో కాలనీ వాసులు గగ్గోలు పెడుతున్నారని వాపోయారు. అసలు చెత్తబండికి వారికి ఇంటి యజమాని ఎంత ఇవ్వాలని, అపార్ట్మెంట్ అయితే ఎంత ఇవ్వాలి అనేది ప్రశ్నార్థంగా మారిందని పేర్కొన్నారు. తక్కువలో తక్కువ రూ150 ఆపై రూ 200 లు, ఒక్కొక ఇంట్లో రూ 600లు ఆపై కూడా వసూలు చేస్తు న్నారని, అదనపు చేత పడితే అదనంగా అడుగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చేసేదేమీ లేక కాలనీ వాసులు అడిగినంత డబ్బులు ఇవ్వకపోతే ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారని, కాలనీలో అందరిముందు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని, ఎంత ఇవ్వాలి అనేది ఒక ప్రకటన ద్వారా సానిటేషన్ డిపార్ట్మెంట్ అధికారులు పట్టించుకుని సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.



## నేడు గేమ్ ఛేంజర్ ట్రైలర్ రిలీజ్

రామ్ చరణ్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సమయంరానే వచ్చేసింది. 'గేమ్ ఛేంజర్ ట్రైలర్ ఎప్పుడు వస్తుందా అని వెయిట్ చేస్తున్న మెగా ఫ్యాన్స్‌కు మేకర్స్ క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఈ మూవీ ట్రైలర్‌ను న్యూ ఇయర్ కానుకగా జనవరి 02 సాయంత్రం 5.04 గంటలకు విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా న్యూ ఇయర్ విషెస్ తెలుపుతూ కొత్త పోస్టర్‌ను పంచుకుంది. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తేజ్, దిగ్గజ దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న తాజా చిత్రం గేమ్ ఛేంజర్. ఈ సినిమాను అగ్ర నిర్మాత దిల్ రాజు నిర్మిస్తుండగా.. థమన్ సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. భారీ బడ్జెట్‌తో రాబోతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ కథానాయికగా నటిస్తుండగా.. సునీల్, ఎస్ జే సూర్య కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే మూవీ నుంచి టీజర్‌తో పాటు పాటలను విడుదల చేయగా.. సూపర్ రెస్పాన్స్‌తో దూసుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే ట్రైలర్ కోసం వెయిట్ చేస్తున్నారు అభిమానులు.



## పుట్టపర్తి సాయిబాబా సన్నిధిలో సాయి పల్లవి



కొత్త ఏడాది సందర్భంగా అందరూ న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌లో మునిగితేలుతుంటే సాయి పల్లవి మాత్రం ఆధ్యాత్మికం వైపు వెళ్లింది. కొత్త సంవత్సరం కానుకగా.. ప్రపంచ ప్రసిద్ధి చెందిన పుట్టపర్తి శ్రీ సత్య సాయి బాబాను దర్శించుకుంది సాయి పల్లవి. కుటుంబంతో కలిసి పుట్టపర్తికి వెళ్లిన సాయిపల్లవి ప్రత్యేక పూజలు నిర్వహించింది. అనంతరం బాబా నామస్మరణ చేస్తూ ఆధ్యాత్మికతను చాటుకుంది. ఈ సందర్భంగా పట్టుచీరలో సంప్రదాయంగా మెరిసి ఆకట్టుకుంది. కాగా ఇందుకు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## 6న హరిహర వీరమల్లు పాట రిలీజ్

ప్రాంతీయ భాషా చిత్రాలతోనే జాతీయ స్థాయి గుర్తింపు పొందిన అతికొద్ది మంది కథానాయకులలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఒకరు. ఆయన తన సినీ ప్రయాణంలో తొలిసారిగా 'హరి హర వీర మల్లు పార్ట్-1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' అనే పీరియాడికల్ యాక్షన్ సినిమాలో నటిస్తున్నారు. ఎ.ఎం. రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ. దయాకర్ రావు ఈ చిత్రాన్ని భారీస్థాయిలో నిర్మిస్తున్నారు. జ్యోతి కృష్ణ ఈ భారీ యాక్షన్ ఎపిక్‌ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్న 'హరి హర వీర మల్లు' చిత్ర పాటల కోసం ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా అభిమానులు, ప్రేక్షకుల్లో ఉత్సాహం నింపే వార్తను తాజాగా నిర్మాతలు పంచుకున్నారు. 'హరి హర వీర మల్లు' నుంచి 'మాట వినాలి' అంటూ సాగే మొదటి గీతాన్ని జనవరి 6వ తేదీన ఉదయం 9:06 గంటలకు విడుదల చేయనున్నట్లు తెలుపుతూ ప్రత్యేక పోస్టర్ ను వదిలారు. తుఫానుకి ముందు ప్రశాంతతలా, యుద్ధానికి ముందు చిరునవ్వు చిందిస్తూ ప్రశాంతంగా కనిపిస్తున్న యోధుడిలా ఉన్న పవన్ కళ్యాణ్ లుక్ పోస్టర్ లో ఆకట్టుకుంటోంది.

## షూటింగ్ షురూ..

### ఎస్ఎస్ రాజమౌళి, మహేష్‌బాబు కాంబో భారీ సినిమా





సూపర్‌స్టార్ మహేష్ బాబు హీరోగా ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో పాన్ వరల్డ్ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే! ప్రీ ప్రొడక్షన్ వర్క్ జోరుగా సాగుతోంది అయితే. సినిమా సెట్స్ మీదకు ఎప్పుడు వెళుతుంది? అని ప్రేక్షకులంతా ఆతురతగా ఎదురు చూస్తున్నారు. ఇప్పుడు వాళ్లందరికీ గుడ్‌న్యూస్ అందింది. జనవరి 2వ తేదీ, గురువారం నాడు పూజా కార్యక్రమాలతో మహేష్ బాబు, ఎస్ఎస్ రాజమౌళి సినిమా లాంఛనంగా ప్రారంభం కానుంది. హైదరాబాద్‌లోని అల్యూ మినియం ఫ్యాక్టరీలో ఉదయం పది గంటలకు ఓపె నింగ్ జరుగుతుంది. మామూలుగా తన సినిమా ప్రారంభోత్సవానికి మహేష్ బాబు హాజరు కారు. మరి ఈ సినిమాకు వస్తాడా లేదా అన్నది చూడాలి. ఈ కార్యక్రమానికి పరిశ్రమలో ప్రముఖులతోపాటు వంద మందికి పైగా హాజరయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిసింది. 'ఆర్ఆర్ఆర్' సినిమా చిత్రీకరణలో కొంత భాగం అల్యూమినియం ఫ్యాక్టరీలోనే షూటింగ్ చేశారు. ఆ సమయంలోను రాజమౌళి ఆఫీస్ అక్కడే ఏర్పాటు చేశారు. బాహుబలి కోసం రామోజీ ఫిలిం సిటీలో చిత్రీకరణ చేసినప్పుడు తన ఆఫీసును అక్కడే ఏర్పాటు చేశారు రాజమౌళి.

## కొత్త సంవత్సరంలో అలరించనున్న సినిమాలు ఇవే...

కొత్త సంవత్సరం కొంగొత్త ఆశలు, ఆకాంక్షలతో వచ్చేసింది. అయితే 2024 ఏడాది సినిమా ప్రేక్షకులకు మంచి అనుభవాలను నింపి వెళ్లిన విషయం తెలిసిందే. గుంటూరు కారంతో మొదలైన కొత్త ఏడాది.. ఆ తర్వాత హన్ మాన్, కల్కి, సరిపోదా శనివారం, లక్కీ భాస్కర్, పుష్ప 2 ది రూల్ వంటి సినిమాలతో మర్చిపోలేని జ్ఞాపకాలను మిగిల్చింది. అయితే ఈ ఏడాది కూడా పెద్ద సినిమాలతో పాటు చిన్న సినిమాలు అలరించబోతున్నాయి. ఈ క్రమంలోనే జనవరిలో బాక్సాఫీసు ముందుకు రానున్న చిత్రాలేవో చూసేద్దాం. ఈ ఏడాది టాలీవుడ్‌లో తెలుగు సినిమా కాకుండా ఒక మలయాళం డబ్బింగ్ చిత్రం బోణీ కొడుతుంది. మలయాళ నటుడు టొవినో థామస్, సౌత్ క్వీన్ త్రిష ప్రధాన పాత్రల్లో వచ్చిన చిత్రం 'ఐడెంటిటీ'. అఖిల్ పాల్, అనాస్ ఖాన్ ఈ సినిమాకు సంయుక్తంగా దర్శకత్వం వహించగా.. ఈ చిత్రం జనవరి 02న ప్రేక్షకుల ముందుకు రానుంది.

**గేమ్ ఛేంజర్ ...**



ప్రతి సంక్రాంతి లాగే ఈ సంక్రాంతి కూడా రసవత్తరంగా సాగబోతుంది. జనవరి 10న రామ్ చరణ్ గేమ్ ఛేంజర్‌తో మొదలవ్వనున్న ఈ పోటీ తర్వాత వెంకటేశ్, బాలకృష్ణతో పాటు డబ్బింగ్ సినిమాలు రానున్నాయి. రామ్ చరణ్ ప్రధాన పాత్రలో వస్తున్న తాజా చిత్రం గేమ్ ఛేంజర్. శంకర్ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆర్ఆర్ఆర్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత రామ్ చరణ్ సినిమా వస్తుడటంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి.

**'డాకు మహారాజ్'....**



గేమ్ ఛేంజర్ వచ్చిన రెండు రోజులకే బాక్సాఫీస్ మీద దండయాత్ర చేయడానికి 'డాకు మహారాజ్' అంటూ వస్తున్నాడు బాలయ్య. బాలకృష్ణ హీరోగా రూపొందుతున్న ఈ యాక్షన్ డ్రామాలో శ్రద్ధా శ్రీనాథ్, ప్రగ్యా జైస్వాల్ కథానాయికలుగా నటిస్తుండగా.. 'వాల్తేరు వీరయ్య' సినిమాతో 2023 సంక్రాంతికి హిట్ అందుకున్న బాబీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు.

**సంక్రాంతికి వస్తున్నాం....** సంక్రాంతి రేసులో ఉన్న మరో పెద్ద సినిమా సంక్రాంతికి వస్తున్నాం. వెంకటేశ్‌కి ఎఫ్2, ఎఫ్ 3 వంటి సూపర్ హిట్లు అందించిన దర్శకుడు అనిల్ రావిపుడి మరోసారి జతకట్టిన విషయం తెలిసిందే. వీరిద్దరి కాంబోలో వస్తున్న చిత్రం సంక్రాంతికి వస్తున్నాం. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ చిత్రం జనవరి 14న ప్రేక్షకుల ముందుకు వస్తుంది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాపై ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయి. ఇవే కాకుండా హిందీ నుంచి కంగనా రనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' సినిమాని జనవరి 17న తీసుకురాబోతుండగా.. సోనూసూద్ స్వీయ దర్శకత్వంలో వస్తున్న 'ఫతేహ్' జనవరి 10న రిలీజ్ కానుంది.



## డాకు మహారాజ్.. దబిడి దిబిడి వచ్చేస్తుంది..!



నందమూరి బాలకృష్ణ కె.ఎస్ బాబీ కాంబోలో వస్తున్న డాకు మహారాజ్ సినిమాకు థమన్ మ్యూజిక్ అందిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా విషయంలో అన్నిటినీ పర్ఫెక్ట్ గా ప్లాన్ చేస్తున్నారు. సంక్రాంతి బరిలో దిగేందుకు వస్తున్న బాలయ్య సినిమా నుంచి ఇప్పటికే రెండు సాంగ్స్ రిలీజ్ అయ్యాయి. ఇప్పుడు డాకు మహారాజ్ నుంచి 3వ సాంగ్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. డాకు మహారాజ్ నుంచి మొదటి సాంగ్ టైటిల్ సాంగ్ కాగా రెండోది చిన్ని సాంగ్ వచ్చింది. ఆ రెండు సాంగ్స్ కి సూపర్ రెస్పాన్స్ రాగా థర్డ్ సాంగ్ ని దబిడి దిబిడి అని దించుతున్నారు. బాలయ్య విలన్లకు వార్నింగ్ ఇస్తూ చెప్పే డైలాగ్ దబిడి దిబిడి. ఆ డైలాగ్ నే సాంగ్ లిరిక్ గా వాడుతున్నారు. థమన్ ఈ సాంగ్ ని తన మార్క్ కంపోజింగ్ తో అదరగొట్టేస్తారని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. డాకు మహారాజ్ సినిమా మాస్ యాక్షన్ మూవీగా వస్తుంది. ఈ సినిమా నుంచి ఇప్పటికే వచ్చిన టీజర్ అంచనాలు పెంచింది. సాంగ్స్ కూడా సినిమాపై మరింత బజ్ క్రియేట్ చేస్తున్నాయి.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S). Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288, CELL : +91 80742 79741